# అన్నమయ్య - వ్యాసవైజయంతి



డా॥ యస్. చిన్నరెడ్డయ్య

# అన్నమయ్య - వ్యాసవైజయంతి

DISCOUNT 50%

రచయిత

డా॥ యస్. చిన్నరెడ్డయ్య

**అన్నమయ్య - వ్యాసవైజయంతి**
**- డా॥ యస్. చిన్నరెడ్డయ్య**

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : 2014

వెల : 100/-

ప్రతులకు :

**డా॥ యస్. చిన్నరెడ్డయ్య**
తెలుగు అధ్యాపకులు,
ద్రవిడ విశ్వవిద్యాలయం,
కుప్పం, చిత్తూరు జిల్లా.
సెల్ నెం. 94406 11033

చిరునామా :

**డా॥ యస్. చిన్నరెడ్డయ్య**
11-200, తారకరామనగర్,
తిరుపతి.


డి.టి.పి. & ప్రింటింగ్
శ్రీవారిగ్రాఫిక్స్, తిరుపతి.
సెల్. 99484 34277



ఈ గ్రంథం తిరుమల తిరుపతి దేవస్థానముల వారి
ఆర్థిక సహాయంతో ముద్రించబడినది.

ఈ గ్రంథముద్రణ అనంతరం వచ్చే విమర్శలకు,
చట్టరీత్యా తీసుకునే చర్యలకు గ్రంథకర్తగా నాదే బాధ్యత.

# ప్రశంస



కన్నడదేశంలో ప్రముఖ వాగ్గేయకారుడు భక్త పురంధరదాసు. అలాగే ఆంధ్రదేశంలో పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుడు.


లోకంలో తమ పూర్వీకుల గురించి తర్వాతి తరాలవాళ్ళు చెప్పుకోవటం, వారి చరిత్రలు వ్రాయటం సహజం. అన్నమాచార్యుల విషయంలో కూడా అదే జరిగింది. అన్నమాచార్యుల వారి సారస్వతాన్ని వారి వంశం వారితోపాటు ఎందరో కవులు, పండితులు, పరిశోధకులు ప్రచారం చేశారు. ఇంకా చేస్తున్నారు. అటువంటివారిలో డా॥ యస్. చిన్నరెడ్డయ్య కూడా ఒకడు.

తేనెటీగ పలు పుష్పాలనుండి మకరందాన్ని సేకరించి ఒకచోట చేర్చి, తేనెను తయారు చేసినట్లు ఈ రచయిత అన్నమయ్యపై వ్రాసిన వివిధ వ్యాసాలను ఒకచోట చేర్చి 'అన్నమయ్య - వ్యాసవైజయంతి' అనే పేరుతో పరిశోధనాధ్యాత్మిక గ్రంథాన్ని వెలయించినాడు.

ఇందులో అన్నమయ్య భక్తి, అన్నమయ్యకు పోతనతో పోలిక, నాటి కడప జిల్లాలోని గ్రామాల పేర్ల పుట్టు పూర్వోత్తరాలు, సమాజ శ్రేయస్సు లాంటివి కళ్లకు కట్టినట్లు విశదీకరించబడ్డాయి.

ఈ రచయిత కృషి ప్రశంసనీయం. ఈ గ్రంథం పఠనీయం.

**డా॥ యస్ దశరథ**
సహాయ పరిశోధకుడు,
పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తి.తి.దేవస్థానములు, తిరుపతి.



# అమృతాస్వాదనం

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారు. ఆ దేవదేవుని దివ్యపాదారవిందాలను ఆశ్రయించి 32 వేల సంకీర్తనలతోపాటు ఎన్నో రచనలు చేసిన వాగ్గేయకార వరేణ్యుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. సంగీత సాహిత్యమేళవింపుతో సాహిత్య సృజన చేసిన అన్నమయ్య తెలుగులో సంకీర్తన సాహిత్యానికి ఆద్యుడయ్యాడు. ఆయన చూపిన దారిలోనే ఆయన పుత్రపౌత్రాదులు నడచి ఎన్నో గ్రంథాలు శ్రీవేంకటేశ్వరస్వామి వారిపై రచించి అంకితం చేశారు.

తాళ్ళపాక కుటుంబంలోని వారందరూ కవులు, విద్వాంసులు, గానకళాకోవిదులు, బహుభాషావిశారదులు, బహుగ్రంథ కర్తలు. శ్రీవేంకటేశ్వరస్వామి వారిని వస్తు నేపథ్యంగా తీసుకొని వివిధప్రక్రియలలో రచనలు చేసి ఆంధ్రభారతికి సేవ చేసిన ఏకైకకుటుంబం తాళ్లపాకవారిదే. అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ యన్నట్లు ఆ కుటుంబంలో పుట్టిన వారందరూ శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులు, జ్ఞానులు, సుగుణశీలురు. వారందరికీ దిశానిర్దేశం చేసిన మూలపురుషుడు అన్నమయ్య.

అన్నమయ్య సంకీర్తనా సాహిత్యం సముద్రం వంటిది. అందులో చేపలు కొందరు పట్టుకుంటారు. ముత్యాలు కొందరు ఏరుకుంటారు. దాని తరంగాలను చూసి కొందరు ఆనందిస్తారు. ఇంకా ఎన్నో జీవులు అందులో నివసిస్తుంటాయి. ఆ విధంగానే అన్నమయ్య సంకీర్తనల్లో భక్తిని కొందరు, శృంగారాన్ని కొందరు ఆస్వాదిస్తారు. ఆ సంకీర్తనల

మధురిమను విని ఎందరో పరవశిస్తూ పరమానందభరితులవుతారు. ఇంకొందరు అందులోని సంఘసంస్కారాన్ని తెలియజేసారు.

ఇంకనూ కొందరు పురుషార్థాలను, అరిషడ్వర్గాలకు చెందిన అంశాలను, పురాణాలకు సంబంధించిన విశేషాలను వెలికితీసారు. ఇలా ఎవరికి తోచిన తత్త్వాన్ని వారు వెల్లడిస్తున్నారు. ఈ దశలో అన్నమయ్య సాహిత్యంపై మరొక రచన అవసరమా అనే ప్రశ్న నాలో మెదిలింది. అయితే డా॥ ఎస్. చిన్నరెడ్డయ్యగారు రచించిన 'అన్నమయ్య – వ్యాసవైజయంతి' చదివాక నా ప్రశ్న ఎంత నిర్హేతుకమయిందో నాకే బోధపడింది. ఈ గ్రంథ రచయిత పది వ్యాసాలలో అన్నమయ్య మూర్తిమత్త్వాన్ని సమగ్రంగా ఆవిష్కరించారు. ప్రతి వ్యాసంలోనూ వినూత్నాంశాలున్నాయి. 'పోతన–అన్నమయ్య'లను పోల్చుతూ చెప్పిన అంశాలు రచయిత ప్రతిభా పాటవాలకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఈ గ్రంథం ఆధ్యాత్మికవేత్తలకు హస్తభూషణంగా పరిశోధకులకు ఆకర గ్రంథంగా దోహదపడుతుందనుటలో సందేహం ఇసుమంతైనా లేదు. ఇంతమంచి గ్రంథాన్ని రాసిన డా॥ఎస్. చిన్నరెడ్డయ్యను అభినందిస్తూ, ఇలాంటి మంచి గ్రంథాలు వారి కలం నుంచి మరిన్ని వెలువడాలని ఆశిస్తున్నాను.


**డా॥ కె. రాధారమణ**

ఎడిటర్

సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.



# అభినందనం

అన్నమయ్య పేరెత్తగానే శ్రీ వేంకటేశ్వర స్వామివారి భక్తుల తనువు పులకిస్తుంది. అన్నమయ్య సంకీర్తనల గానం చెవుల బడగానే భగవంతుని సృష్టి మొత్తం తన్మయం చెందుతుంది. ఈ రెండు సంఘటనలకు మూలం అన్నమయ్య సంకీర్తనామృతం. సంగీత, సాహిత్యాల సమ్మేళనమే అన్నమయ్య సంకీర్తనల సారం. అది కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారు అన్నమయ్యకు ప్రసాదించినవరం. ఆ దేవుని కరుణాకటాక్ష వీక్షణాల ఫలితంగానే అన్నమయ్య 32వేల సంకీర్తనలు రాసి స్వామివారికి అంకితం చేసాడు.

**శ్లో ॥ సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయమ్ ।**
**ఏకమాపాతమధుర మన్యదాలోచనామృతమ్ ॥**

అనేది సుప్రసిద్ధమైన సంస్కృత ఆభాణకం. సంగీతంవల్ల మధురానుభూతి, సాహిత్యంవల్ల ఆలోచనామృతం కలుగుతుందని పై శ్లోకం తెలుపుతున్నది. సంగీతం సాహిత్యం కంటే లలితమైనది. సంగీతం తక్షణమే హృదాయన్ని ద్రవింపజేస్తుంది. అయినా ఆ అనుభూతి తాత్కాలికం. కానీ దానికి మంచి సాహిత్యం తోడైతే బ్రహ్మానంద స్థితి కలుగుతుంది. ఈ రహస్యాన్ని గుర్తించే అన్నమయ్య సంగీత సాహిత్యాలను సమన్వయిస్తూ సాహిత్య సృజన చేసాడు. అందులో ఆ మహనీయునికి అజరామరకీర్తిని తెచ్చిపెడుతున్నవి సంకీర్తనలు. ఆ సంకీర్తనల్లో ఎన్నో పౌరాణిక, ఆధ్యాత్మిక, శృంగార, చారిత్రక సామాజిక

అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఎందరో పండితులు విమర్శకులు పరిశోధకులు అన్నమయ్య సాహిత్య భాండాగారం నుంచి ఎన్నో అమూల్యమైన వివిధ అంశాలను ప్రజలందరికీ చేర్చారు. అయినా ఇంకా ఎన్నో అనర్ఘరత్నాలు అందులో నిగూఢంగా ఉన్నాయి. వాటిని వెలికి తీసే ప్రయత్నం చేసారు డా॥ ఎస్. చిన్నరెడ్డయ్యగారు.

అన్నమయ్య సంకీర్తనలను రచయిత తనశక్తిమేర ఔపోసన పట్టి, వివిధాంశాలను పరిగణనలోకి తీసికొని అందులో మళ్లీ మెరికలవంటి పది అంశాలను సంశోధించి వాటిని 'అన్నమయ్య-వ్యాసవైజయంతి' పేరుతో గ్రంథంగా తీసికొచ్చారు. ఈ గ్రంథంలోని పది వ్యాసాలు అన్నమయ్య సాహిత్య తత్వాన్ని తెలిపే ఆణిముత్యాలు. 'అన్నమయ్య-అష్టవిధనాయికలు' అనే వ్యాసంలో అలిమేలు మంగమ్మను అష్టవిధ శృంగారనాయికల పరంగా ఆరోపిస్తూ రాసిన వ్యాసం రచయిత ప్రతిభకు నికషోఫలంగా నిలుస్తుందని చెప్పవచ్చు. ఈ వ్యాసమే కాదు అన్ని వ్యాసాలు మేలుబంతివంటివి.

వృత్తిరీత్యా విశ్వవిద్యాలయ అధ్యాపకులైన రచయిత కలం నుంచి ఇలాంటి గ్రంథాలు మరెన్నో, వెలువడాలని హృదయపూర్వకంగా అభిలషిస్తున్నాను.

**డా॥ కె. రెడ్డెప్ప**
స్కూల్ అసిస్టెంట్,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నెరబైలు-517 194
చిత్తూరు జిల్లా.

# మనవి

ఉత్తర దిక్కు నుంచి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి తరలివచ్చే భక్తవరేణ్యులకు తొలి గడప అయిన కడప పట్టణంలో నేను పుట్టాను. తాళ్ళపాక వంశీకుల జన్మస్థలమైన కడపజిల్లా తాళ్ళపాకలో కొన్నాళ్లు బాల్యజీవితం గడిపాను. పాఠశాల, కళాశాల, స్నాతకోత్తర విద్యను నెల్లూరు, తిరుపతిలలో పూర్తి చేసాను. ప్రస్తుతం వృత్తిరీత్యా ద్రవిడ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్నాను.

తెలుగు సాహిత్యమంటే నాకు పంచప్రాణాలు. అందులోనూ అన్నమాచార్యుల సంకీర్తనలంటే ఎనలేని అభిమానం. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ఎం.ఏ. తెలుగు చేసాను. ఆ కాలంలో అన్నమాచార్య కళామందిరానికి వెళ్లి అన్నమయ్యపై వివిధ పండితులు చేసిన ఉపన్యాసాలు విన్నాను. వారు చెప్పిన అంశాలు నాలో భావపరంపరలను రేకెత్తించాయి. ఆనాడే అన్నమయ్య సాహిత్యంలోని విభిన్నకోణాలను వెలికిదీయాలని సంకల్పించాను. ఆ నేపథ్యంలో వెలువడిన రెండవ గ్రంథమే ఈ "అన్నమయ్య-వ్యాసవైజయంతి". ఇదివరకే 'తాళ్లపాక పదసాహిత్యంలో చారిత్రక సాంఘిక సాంస్కృతికాంశాలు' అనే గ్రంథాన్ని వెలువరించాను. ఇది పాఠకుల ఆదరాభిమానాలను చూరగొన్నది.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు, ఆధ్యాత్మిక గ్రంథాలకు ఆర్థిక సహాయం అనే పథకం కింద ఈ గ్రంథ ముద్రణకు ఆర్థిక

సహాయాన్నందజేశారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ గ్రంథానికి 'ప్రశంస' అందించిన ప్రియమిత్రుడు డా॥సముద్రాల దశరథగారికీ, సహృదయంతో నా ఆధ్యాత్మిక గ్రంథ రచనకు ప్రోత్సహిస్తున్న డా॥కె.రాధారమణగారికీ, అభినందనలతో నా అభివృద్ధి కాంక్షిస్తున్న డా॥కె.రెడ్డెప్ప గారికీ, చక్కగా డి.టి.పి. చేసిచ్చిన శ్రీ టి. గుణభూషణ్ గారికీ నా కృతజ్ఞతలు.

నిరంతరం నా కృషిని అభినందిస్తూ ప్రోత్సహిస్తున్న నా శ్రీమతి విజయదుర్గకు, నా గారాలపట్టి ప్రణూషకు నా ఆశీస్సులు.

– డా॥ ఎస్. చిన్నరెడ్డయ్య

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అన్నమయ్య భక్తి తత్త్వం | 1 |
| 2. | అన్నమయ్య నరసింహశతకం | 8 |
| 3. | అన్నమయ్య-నవవిధ భక్తులు | 21 |
| 4. | అన్నమయ్య-ఆధ్యాత్మిక తత్త్వం | 42 |
| 5. | అన్నమయ్య-అష్టవిధ నాయికలు | 61 |
| 6. | అన్నమయ్య సంకీర్తనలు-మధురభక్తి | 85 |
| 7. | పోతన-అన్నమయ్య | 101 |
| 8. | అన్నమయ్య సంకీర్తనలలో ఆచార్యుడు | 123 |
| 9. | అన్నమయ్య దర్శించిన వైష్ణవక్షేత్రాలు-కడప జిల్లా | 128 |
| 10. | అన్నమయ్య కవిత్వం-సమాజ శ్రేయస్సు | 165 |

# 1.అన్నమయ్య భక్తి తత్త్వం

జీవుడు దేవునిలోని అంశమే కాని వేరు కాడు. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతన:" అని భగవంతుని మాట. మండే అగ్ని నుంచి మిణుగురులు ప్రభవించినట్లే పరబ్రహ్మం నుంచి వివిధ జీవులు ఉద్భవిస్తున్నాయని శ్రుతి ఉద్బోధిస్తున్నది.

జీవుని గమ్యం కూడా దేవున్ని చేరటమే తాను ఎక్కడ నుంచి ఉద్భవించాడో అక్కడికే మళ్ళీ చేరుకోవాలి. నదీజలాలు సాగరాన్ని చేరినట్లే, జీవకోటి చివరికి పరమాత్మలో లీనం కావాలి. మానవ జీవిత పరమలక్ష్యం భగవంతుని దివ్య సాన్నిధ్యం పొందడమే అని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి.

భగవత్ప్రాప్తికి భక్తి ఒక్కటే ముఖ్యోపాయమని పెద్దలు చెప్పారు. "భక్త్యా మా మభిజానాతి", భక్త్యాత్వనన్యయా శక్య:" ఇత్యాది భగవద్వచనాలు కూడా ఈ సత్యాన్నే ప్రతిపాదిస్తున్నాయి.

భక్తి నానావిధాలు. భాగవతంలో భక్తి తొమ్మిది విధాలుగా చెప్పబడింది -

**శ్రవణం కీర్తనం విష్ణో: స్మరణం పాదసేవనమ్ ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్ ॥**

**(భాగ-7-6-23)**

ఇందులో నామ సంకీర్తనం కలియుగంలో ముఖ్యాతి ముఖ్యమైన భగవత్ప్రాప్త్యుపాయంగా పేర్కొనబడింది.

అష్టోత్తరశతోపనిషత్తులలో ఒకటైన కలిసంతరణోపనిషత్తు కలిదోషనిర్మూలనానికి నామ సంకీర్తనాన్ని మించిన సాధనం మరొకటి లేదని ప్రబోధిస్తున్నది. కలికాలంలో భూమి మీద పర్యటిస్తూ కలిదోషం అంటకుండా ఉండే ఉపాయం చెప్పమని నారదుడు బ్రహ్మను ప్రార్థిస్తాడు.

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే ।**
**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే ॥**
**ఇతి షోడశకం నామ్నాం కలికల్మషనాశనమ్ ।**
**నాతః పరతరోపాయః సర్వవేదేషు దృశ్యతే ॥**

**(కలిసంతరణోపనిషత్తు)**

అని ఉపదేశిస్తాడు. షోడశనామ మహామంత్రమే కలికల్మషనాశకం. దాన్ని మించిన ఉపాయం సమస్త వేదాలను గాలించి చూచినా కనిపించదని పై ఉపదేశ సారాంశం.

భాగవతం మొదలైన గ్రంథాలు కూడా నామ సంకీర్తన ప్రభావాన్ని ఎన్నో రీతుల ప్రశంసిస్తున్నాయి.

**నామ సంకీర్తనం యస్య సర్వపాపప్రణాశనమ్ ।**

**(భాగ-12-13-23)**

**ఏతావతాల మఘ నిర్హరణాయ పుంసామ్ ।**
**యత్కీర్తనం భగవతో గుణకర్మనామ్నామ్ ॥**

**(భాగ-6-3-24)**

ఇత్యాది వచనాలు భక్తి మార్గాలలో సంకీర్తన మార్గం మహా ప్రభావవంతమైనదని చాటుతున్నాయి.

పూర్వం నారదాది మునీంద్రులు భగవత్సంకీర్తనంతోనే తరించారు. ఈ కలియుగంలో కూడా సంకీర్తనంతో భవసాగరాన్ని తరించిన మహనీయులు ఎంతో మంది కానవస్తారు. త్యాగరాజు, రామదాసు, పురందరదాసు, క్షేత్రయ్య మొదలైన సుప్రసిద్ధ వాగ్గేయకారులంతా నామ సంకీర్తనంతో భగవదనుగ్రహానికి పాత్రులైన వారే.

ఈ వాగ్గేయకారులలో శ్రీతాళ్ళపాక అన్నమాచార్యులు అగ్రగణ్యులు. ఈయనను పద కవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ అంటారు. 15వ శతాబ్దిలో నేటి కడప మండలానికి చెందిన తాళ్ళపాక గ్రామంలో అన్నమయ్య జన్మించాడు. లక్కమాంబా నారాయణసూరి అనే పుణ్యదంపతులు ఈయన తల్లిదండ్రులు.

అన్నమయ్య పసిబిడ్డగా ఉన్నప్పుడే తిరుమలప్ప ప్రసాదమని చెప్పకపోతే ఉగ్గుత్రాగేవాడు కాడట! స్వామిపై జోలలు పాడకుంటే నిదురించేవాడుకాడట! ఉపనయనానంతరం ఆయనకు విద్యలన్నీ కరతలామలకమయ్యాయి. ఆయన ఆడిన మాటెల్లా అమృత కావ్యంగా, పాడిన పాటెల్లా పరమగానంగా భాసించాయి. పదహారేళ్లకు ఆయనకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమయ్యాడు. భక్తి భావంతో అన్నమయ్య వేంకటాచలపతి మీద వింత వింతలుగా ఎన్నో సంకీర్తనలు పాడాడు. ఆయన పాడిన సంకీర్తనలు మొత్తం ముప్పది రెండు వేలని ప్రతీతి. శృంగార సంకీర్తనలనీ, ఆధ్యాత్మిక సంకీర్తనలనీ ఈ పాటలు రెండు రకాలు.

భగవత్సంకీర్తనకంటే భగవత్ప్రాప్తికి శ్రేష్టమైన ఉపాయం మరొకటి లేదంటూ ఆయన ఇలా ప్రబోధించాడు.

ఏవం శ్రుతిమత మిదమేవ త
ద్భావయితు మతఃపరం నాస్తి ॥పల్లవి॥

అతుల జన్మభోగాసక్తానాం
హితవైభవ సుఖ మిదమేవ,
సతతం శ్రీహరి సంకీర్తనం త
ద్వ్యతిరిక్త సుఖం వక్తుం నాస్తి ॥ఏవం॥

బహుళ మరణ పరిభవ చిత్తానాం
ఇహపర సాధన మిదమేవ
అహిశయన మనో హరసేవా త
ద్విహరణం వినా విధిరపి నాస్తి ॥ఏవం॥

సంసార దురిత జాడ్యపరాణాం
హింసా విరహిత మిద మేవ
కంసాంతక వేం కటగిరి పతేః ప్ర
శంసైవా పశ్చా దిహ నాస్తి ॥ఏవం॥(అధ్యా - 5-4)

భగవద్రామానుజులు ప్రతిపాదించిన ప్రపత్తి మార్గాన్ని అన్నమాచార్యుడు ప్రజానీకానికి పలువిధాల ఎలుగెత్తి ప్రబోధించాడు. ఆయన ఆధ్యాత్మిక కీర్తనలలో పదే పదే శరణాగతి తత్త్వమే గోచరిస్తుంది. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ-

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥
(గీత 18-66)

అని శరణాగతిని పరమోపాయంగా బోధించాడు. ఈ చరమ శ్లోకంలోని తత్త్వాన్ని శ్రీ రామానుజులు విరివిగా ప్రచారం చేశారు. అన్నమయ్య ఈ తత్త్వాన్ని మరింత విపులంగా తన సంకీర్తనల ద్వారా ప్రబోధించాడు.

**ఒక్కడే మోక్షకర్త - వొక్కటే శరణాగతి।**
**దిక్కని హరి గొల్చి బదికిరి తొంటివారు॥ (అధ్యా-6-186)**

అని ఆయన హరిని ప్రపత్తి మార్గంతో ఆరాధించవలసిన ఆవశ్యకతను అనేక విధాల నొక్కి వక్కాణించాడు.

శరణాగతినే ప్రపత్తి అని కూడా అంటారు. ప్రపత్తిలో భగవంతుని మీద భక్తునికి అచంచలమైన విశ్వాసం ఉండాలి. ఈ విశ్వాసమే ప్రపత్తికి ప్రాణం. దీని ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అన్నమయ్య ఇలా భగవానుని కీర్తించాడు.

**నిన్ను నమ్మి విశ్వాసము నీ పై నిలుపుకొని**
**ఉన్నవాడ నికవేరే ఉపాయమేమిటికి**
**గతియై రక్షింతువో కాక రక్షించవో యని ॥పల్లవి॥**

**మతిలోని సంశయము మరి విడిచి**
**ఇతరులచే ముందర నిక నెట్టౌదునో యని**
**వెతతోడ దలచేటి వెఱపెల్లా విడిచి ॥నిన్ను॥**

**తిరమైన నీ మహిమ తెలిసే వాడననే**
**గరుపముతోడి ఉద్యోగము విడిచి**

వెరవున నీ రూపు వెదకి కానలే ననే
గరిమ నలపు నాస్తికత్వమును విడిచి ॥నిన్ను॥

ధ్రువమైన నాచేతకు తోడు దెచ్చుకొనే ననే
అవల నన్యుల మీది యాస విడిచి
వివరిం చలమేల్మంగ విభుడ శ్రీవేంకటేశ
తవిలితి నా పుణ్యమంతయు నీకు విడిచి॥ నిన్ను॥

**(అధ్యా-6-202)**

భగవత్పూజా విధానాన్ని ప్రతిపాదిస్తూ నిండు మనస్సు అంతట భగవంతుని సందర్శించడం, శత్రుమిత్రుల నిందాస్తుతులు మొదలైన ద్వంద్వాల పట్ల సమభావం, ఇత్యాదులే నిజమైన భగవత్పూజలని అన్నమయ్య చెప్పాడు.

నిండు మనసే నీ పూజ
అండగోరకుండు టదియు నీ పూజ ॥పల్లవి॥

ఇందు హరిగల దందు లేడనేటి
నిందకు బాయుటె నీ పూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే
అందదుకు మాను టదియె నీ పూజ ॥నిండు॥

తిట్టులు గొన్నని దీవెన గొంతని
నెట్టుకోనిదే నీ పూజ
పెట్టిన బంగారు పెంకును నినుమును
అట్టె సరియను టదియు నీ పూజ

**సర్వము నీవని స్వతంత్ర ముడిగి**
**నిర్వహించుటే నీ పూజ**
**సర్వి శ్రీ వేంకట పతి నీ దాసుల**
**పూర్వమనియెడి బుద్ధి నీ పూజ ॥నిండు॥(అధ్యా-6-31)**

భగవద్గీతలో చతుర్థాధ్యాయంలో చెప్పబడ్డ గుణాతీతుని లక్షణాలనే పై సంకీర్తనలో అలా అన్నమయ్య వివరించాడు.

తన రచనలు భగవత్పాదాలకు తాను చేసిన పూజలనీ, అవి భగవత్కీర్తిరూప పుష్పాలనీ- భక్తిపూర్ణుడై అన్నమయ్య పేర్కొన్నాడు.

భక్తిలోనే కాకుండా భాషలో కూడా అన్నమాచార్యుడు మహా నిపుణుడు. ఆంధ్రభాషా తత్త్వాన్ని సమగ్రంగా అవగతం చేసుకోవడానికి అన్నమాచార్యుల వాఙ్మయ సాగరాన్ని మథించడం మహనీయమైన మార్గం.

# 2.అన్నమయ్య నరసింహశతకం

ఈ నృసింహశతకాన్ని గూర్చి కొంత ముందుగా మనము పరిశీలించవలసిన చరిత్రాంశమున్నది. అన్నమయ్యకు సంబంధమున్న నరసింహమూర్తులు ఎందరో కాని ప్రస్తుత మీ శతక పద్యాలను బట్టి భువనగిరి నృసింహస్వామి, అహోబిల నృసింహస్వామి ఇరువురు. తాళ్ళపాకలో నరసింహుడుండెనో లేదో తెలియదు. నేడతడున్నట్టు ఆ గ్రామంలో దాఖలా లేదు. అచ్చట భూగర్భంలో దాగివున్నాడేమో! పరిశోధించాలి. సింహాచలేశుడు తిరుపతి నరసింగుడు అన్నమయ్యకు పరిచయస్తులే "ఓరంపాటిదేవ" అని తన సంకీర్తనలో నుటంకించిన వేంకట్రమణస్వామియున్న ఓరంపాడు (పెద్ద ఓరంపాడు) లోని ఆంజనేయ, శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీనరసింహ, శ్రీదుర్గ, శ్రీవినాయక మూర్తులు గల శ్రీ నరసింహునితో అన్నమయ్యకు నేస్తముండి యుండకపోదు. (ఇప్పుడు పెద్ద ఓరంపాటి చెరువులో తట్టులో పై మూర్తుల ఆలయాల చిహ్నాలు భూగర్భంలో ఉన్నవి. వానికి సాక్షిగ చెరువుకట్టపై వారానికొకసారి స్థానిక ప్రజల పూజలు అందుకొనుచున్న ఆంజనేయమూర్తి ఉన్నాడు. ఆలయాల శిథిల శిల్పాలు చెరువుకట్ట వెంట మనకు దర్శనీయాలు!)

"ఊటుకూరను పొరుగూర చుట్టముల చాటున గొనిపోయి చదువబెట్టుటయు" అని అన్నమయ్య చరిత్ర. ఈ ఊటుకూరు గ్రామం రాజంపేట తాలూకాలో రాజంపేటకు సుమారు 24 మైళ్ళ దూరాన ఉంది. ఇచ్చటనే 'కామాక్షీ సమేత నాగేశ్వరస్వామి' అను మహేశ్వరుడున్నాడు. ఈ రుద్రుడీ చోట జరిగిన రణరంగాలనేకం చూచాడని ప్రతీతి.

అన్నమయ్య తాత నారాయణయ్య చదువురాక బాధపడి చేయిపెట్టిన పుట్ట. ఊటుకూరునుండి రాజుపాలెం మార్గంలో సర్కారుబావి దగ్గరుంది. మోటు విగ్రహాలు పడివున్నాయి. పుట్ట కరిగి పోయింది. ఆ పుట్ట పక్కన చింతలమ్మ అను దేవత గుడి ఉంది. నేడాదేవతను 'కనికాద్రమ్మ' అని అంటారు. ఆ దేవతా విగ్రహాన్ని ఊటుకూరు నుండి వెంకటంపల్లె అగ్రహారం తీసుకొని పోయి ఆ గ్రామ ప్రజలు గుడి కట్టించారు. కనికాద్రమ్మ గుడి నేడు పేరు పొందింది. ప్రతియేటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు ఉత్సవం చేస్తున్నారు. ఊటుకూరు గ్రామప్రజలు ఆ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆ దేవి ఉత్సవ విగ్రహం ఊటుకూరులో ఉన్నది.

అన్నమయ్య తాతకు విద్యాసంపద ప్రసాదించిందీ, తాళ్ళపాక చెన్నుని వేడుకోమన్నదీ నీ మూడవ తరమువాడు కీర్తిపురుషుడు కాగలడన్నది ఆ చింతలమ్మ దేవియే. ఊటుకూరులో క్రీ.శ.1740 ద్విపద మైరావణ చరిత్ర వ్రాసిన తాళ్ళపాక తిమ్మాచార్యుల వరకు ఆ వంశీయులున్నట్లు చారిత్రాకాధారాలున్నాయి.

ఊటుకూరుకు పశ్చిమంగా ఒక మైలు దరిలో ఒక గుట్ట ఉంది. ఆ గుట్ట క్రింద ఒక గ్రామముంది. ఆ గ్రామం పేరు భువనగిరి. బోనగిరి పల్లె అని నేడు వ్యవహారము. ఆ గుట్ట పేరు భువనగురి - నేడు బోనగురి.

భువనగిరి శిఖరాగ్రంలో చాలా ప్రాచీన కాలం నుండి సుమారు 3,4 అడుగుల వైశాల్యము గల గుండురాతిపై ఒక్కటే పాదము (కుడిపాదము) తీర్చబడి ఉండేది. దాని సమీపంలో ఒక వేపచెట్టుంది.

(పూర్వపు చెట్టు నశించగా మరొకటి ఇటీవల పెంచారట) ఆ పాదము శ్రీ నరసింహస్వామి పాదమని ఆ ప్రాంత ప్రజల విశ్వాసము. ప్రతియేటా వైశాఖశుద్ధ చతుర్దశి నృసింహ జయంతినాడు స్థానికులతోపాటు చుట్టుప్రక్కల గ్రామ ప్రజలేగాక ఇతర ప్రదేశాలనుండీ స్వామిని సేవించుకొనడానికి వచ్చి పొంగళ్ళు పెట్టి పాదాన్ని పూజించి, తమ కోరిక తీరుటకై మ్రొక్కుబడి ఉంటారు. అది అనాదిగా జరుగుచున్న వ్యవహారం.

అక్కడ లభించిన పద్యాలు అహోబిల నారసింహునిపై చెప్పినవిగా నున్నవి. కాని పాద ప్రశంస వాడి యున్నందున నవి బోనగిరి (భువనగిరి) నరసింహునిపై చెప్పినవనీ చెప్పవచ్చు. పైన అహోబిల నరసింహస్వామి పద్యాలు అని వ్రాసినారు. 'శిఖినరసింహా' అను మకుట పద్యంలో 'ఊట్కురపురభవుడున్నాడు'. స్పష్టమైన వ్రాతలో నున్నవి. నాలుగు కంద పద్యాలు పూర్వకవులైన 'శేషప్పకవి', 'కూర్మనాథకవి' వ్రాసిన నృసింహ శతకం, సింహాద్రి నారసింహ శతకం ప్రసిద్ధాలైనవి. శిఖి నరసింహా అనే కంద శతకం, శకునశాస్త్రంగా ఉంది. అహోబిల గిరియందుగల నరసింహుడే శిఖి నరసింహుడా? అచ్చట నా పేరుతో మరొక నృసింహుడున్నాడా తెలిసికోవాలి?

1. పద్యం-కందం

**పారము లేనట్టి దయా**
**నీరధి వని భవభయములు- నెట్టింపగన్**
**శౌరివి నీవని నీదరి**
**చేరితి నహో(హా)బిల - శ్రీ నృసింహా!**

ఇందు కడపటి పాదమున గుణదోషముంది. చేరితహోబిల గిరి హరి(?) శ్రీ నరసింహా అని సవరింపదగును.

2. పద్యం-కందం

**వింతౌ అవతారంబులు**
**సంతలు పెట్టినయి (వి) ధమున చాలుగ చూడన్**
**సుంత ఏమబ్బెను మాకును (సుంతే మబ్బెను (మాకును)**
**చింతింప అహోబిల హరి శ్రీ నరసింహా!**

ఇందు 'సంతలు పెట్టు' (బయలు చేయుట) అన్నది ఆ ప్రాంతపు జాతీయపదం. సంతలో సరుకులుంచినట్లు అని భావం.

3. పద్యం- కందం

**పాదంబొక్కటి మ(మా) కడ**
**శ్రీదంబుగ బెటీ (ట్టి) పోయి-సేరితే**
**ఎందును తి (త్రి) విక్రముదన**
**జెందును నీకెబు(భు)వనగిరి శ్రీనరసింహా!**

ఈ పద్యం పాద ప్రస్తావనతో స్థానిక చరిత్రకు దగ్గరగా ఉన్నదియై భువనగిరి నరసింహుని పేర సార్థకమగుచున్నది. ఈ పద్య రచనలో రెండు రెండు పాదాలలో ప్రాస భిన్నముగా ఉన్నది.

4. పద్యం - కందం

**తాతలు తండ్రులు మ్రొక్కిరి**
**నేతలు నీ పాదమెపుడు-నిల్పిరి మరి(ది)లో**

**బ్రాతిగ ఊట్కురు పురభవు**
**చేతః ప్రీతిగ హరి వని-శిఖి నరసింహా!**

ఈ పద్యం మూడవ పద్యాంశాన్ని నిర్ధారించుచున్నది. కాని మకుటం 'శిఖి నరసింహా' అనుటచే సందేహానికి ఆస్పదమగుచున్నది. ఆ మకుటంతో శకున శాస్త్రసంబంధమైన పూర్వకవి శతకమొకటి ఉంది. ఊట్కురు (ఊటుకూరు) నందు వెలసిన మహేశ్వరునీ, నిన్నూ మా తాతలు తండ్రులు పాలకులు తమ మనస్సున ధ్యానించి నీ పాదమును సేవించిరి. అనే భావం వల్ల హరి హరాభేదమందు కలదు. ఆనాటి అన్నమయ్య అతని కుటుంబీకులు అద్వైతులే కదా!

ఈ పద్యాంశము కొంత అన్నమయ్య చరిత్రాంశమునకు సంబంధించి దగ్గరగా ఉంది. ఎందుకనగా అన్నమయ్య తాత తండ్రుల నివాసము ఊటుకూరు. లేక వారి జ్ఞాతులైననుండవచ్చు. అందువల్ల ఆ సమీపమునగల భువనగిరిపై నెలకొన్న పాదము శ్రీ నృసింహునిదని అనాదిగా పరంపరగా వ్యవహారంలో ప్రసిద్ధమై విశ్వసనీయమై ఉండినందునను, దాన్ని తరచూ తన వారితో పాటు పోయి అన్నమయ్య చిన్ననాటినుండీ నా పాదాన్ని సందర్శించి ఉండకపోడు. ఆ పాద సందర్శనమే తరువాత అహోబిల నారసింహుని సందర్శనానికి అన్నమయ్య హృదయాన్ని ప్రేరేపించాడేమో!

చిన్ననాడు తిరుమల యాత్రా సందర్భంలో కొండను ఎక్కేటప్పుడు అన్నమయ్య దారిలోనున్న 'అళిపుళి సింగరి(?)ని దర్శించినాడు కదా! అళిపుళి సింగడనగా చింత చెట్టుకడ నున్న నరసింహదేవుడు.

**'యుక్తి వేంకటగిరి యొద్ద నున్నట్టి**
**పల్లెలో గొల్లల పాలిటి శక్తి**
**యల్లారునని మును లనిశంబు బొగడ**
**గను పట్టునట్టి యా గ్రామంపు శక్తి!**
**గనుగొని బహునమస్కారముల్ చేసి**
**'అళిపుళి సింగరి' నర్చించి మ్రొక్కి**
**తలి(ల?) యెఱుగుండు సందర్శించి కదలి.**

**(అ.చరిత్ర 14 పుట)**

ఇందు 'అల్లారు' అన నేమి? అలరారు కావచ్చు. మరియు తిరుమల శిఖరాన వెలసిన శ్రీవేంటేశ్వరుని సన్నిధినున్న శ్రీనృసింహుని సేవించాడు.

**'శ్రీనివాసుని నమస్కృతి చేసి దండ**
**గానుపించిన భాష్యకారుల బొగడి**
**శ్రీనరసింహుని సేవ గావించి**
**దానవాంతకు జనార్దను సన్నుతించి**
**అలమేలుమంగకు నభివందనములు**
**సలిపి చెంగటి యాగశాల కీర్తించి (అ.చరిత్ర 21 పుట)**
*కనక కశిపునకు గలగె గుండియలు*
*తొడికి పట్టి విష్ణుడు దొడమీద నిడికొని*
*కడుపు చించెను వాని గర్వ మడగ*
*వెడలె జిల్లున వాని వేడి నెత్తురు నింగికిపొడి పొడియాయ*
*శత్రు భూషణములెల్లను'* ***(11-218)***

'నరసింహవిజయము' చిన్నన్న చెప్పెనా? ఏమో! అది ద్విపదో, పద్యమో, గద్యమో! తిరుమల శ్రీవారి ఆలయంలో తిరుమల రాయలు కట్టించిన నాలుగుస్తంభాల మంటపంలో కనక కశిపుని వధించు జ్వాలానృసింహమూర్తి శిల్పముంది.

ఏమైనా అన్నమయ్య నృసింహమూర్తిని చిన్ననాటనే దర్శించి, తన తాత తండ్రులవలె నృసింహస్వామిపై భక్తి ప్రపత్తుల నినుమడింపజేసికొన్నాడు. తన యూరవెలసియున్న దేవుళ్ళపై, పద్యాలు పలికి పాటలు పాడినట్లే తన తాత తండ్రులు సేవించిన భువనగిరి నరసింహుని (పాదము) పై చెప్పిన తండ్రుల వలె నృసింహస్వామిపై భక్తి ప్రపత్తుల్ని ఇనుమడింపజేసుకున్నాడు.

తన ఊర్లో వెలసి ఉన్న దేవుళ్ళపై పద్యాలు పలికి పాటలు పాడినట్లే తన తాత తండ్రులు సేవించిన భువనగిరి నరసింహుని (పాదం) పై చెప్పిన పద్యశతకములోనివీ పద్యాలు. ఈ శతకంలో అన్నమయ్య మకుటనియమం ఒక్కటిగా పాటించి ఉండవచ్చు కాని ఈ వ్రాతలోని పద్యాలలో, అహోబిలము, భువనగిరి, శిఖనరసింహులు ప్రత్యక్షమైనారు. ఇది వ్రాతకాండ్ర తప్పుగా తోచదు. తన అతిశయ భక్తి తత్పరతతో నరసింహుడెచటివాడైనా యొకడే కదా అనే భావంతో చెప్పి యుండవచ్చునేమో! ఈ పద్యాల్లో అన్నమయ్య పేరులేదు. చెన్న, కృష్ణ, వేంకటేశ్వర, రామ, హనుమ దేవుళ్ళు తమ తాళ్ళపాక వంశీయుల కారాధ్యదైవములైనట్లే నరసింహుని కూడా వారి కులారాధ్య దైవమైనాడు. చిన్నన్న అన్నమయ్య చరిత్ర (పు.30) లో అన్నమయ్య తన వివాహానంతరం అహోబిల నరసింహుని సేవింపబోగా అచట

'పరమేశుడగు నహోబిల నృసింహుడు
గురు భావమున జేరుకొని త్రిదండంబు
నా నరసింహు చక్రాది మంత్రములు
తానె ప్రత్యక్షంబు దయసేయ గొనుచు
హరి హయగ్రీవు బ్రత్యక్షంబు జేసి
ధర స్వతంత్ర స్వతంత్రుడైనట్టి
వేదాంతదేశికు వెంకటా చార్యు
నాదివ్య సాంప్రదాయమున వర్తించు
'శఠకోపముని' వద్ద సకల వేదాంత
పఠనంబు జేసి యభంగ విస్ఫూర్తి
హరిపూజ హరిసేవ హరికీర్తనంబు
హరిమననము ధ్యాస మనిశంబు దనకు"గా

(అ.చ.30 పుట)

ప్రవర్తించి సకల వేదాంతసారాన్ని గ్రహించి, ఆధ్యాత్మికానందానుభూతి ననుభవించినాడు. తన అనుభవైకవేద్యంగా ఆధ్యాత్మిక సంకీర్తనలెన్నో వేంకటేశ్వర నామాంకితంగా పాడినాడు. అప్పట్లో అన్నమయ్య చాలాకాలం అనగా తనకు టంగుటూరు నందలి సాళ్వ నరసింహరాయల పరిచయమేర్పడే వరకూ అహోబిలంలోనే ఉండియుండవచ్చు. ఆయనకచటనే కల్గెనేమో తొలిసంతానం - ఆ బిడ్డనికి 'నరసింహుడ'ని పేరు పెట్టుకున్నాడు. ఈ నరసింహుడే సంకుసాల వాడైనాడట. ఇతడే కవికర్ణరసాయన కర్తయని పండిత ప్రవచనం. సత్యమేమో! సంకుసాల (సుంకేసుల గ్రామం పులివెందల

తాలూకాలోది) పులివెందుల సమీపంగా ఉంది. పులివెందలకు ఒక మైలు పశ్చిమంగా ఆ నరసింహుని కృతినందుకొన్న శ్రీ రంగనాథుడు ఆలయంలో ఉన్నాడు. అతని గురువు 'భట్టపరాశరు'లున్న గ్రామం అచటికి సమీపమే. భట్టపరాశరుల వంశీయులు పులివెందల కడప మార్గంలో ఉన్న వేంపల్లెలో నేడున్నారు. ఆ ఆలయం ప్రక్కన సమీపంలో 'గోస్తనీ' నదీ "చంద్రపుష్కరిణి" అను చిన్న కొలను కలవు. ఈ నృసింహకవి వృత్తాంతం పండిత పరిశోధకులకు కొరుకుడు పడని సమస్యయై ఉన్నది. ఈ నరసింహుని తల్లి తిరుమలాంబ (అన్నమయ్య పెద్దభార్య) పుట్టిల్లు "సంకుసాల" (నేడు సుంకేసల) అని కొందరు. ఆధారం అన్వేషణీయం.

విజయనగర ప్రభువుల దండనాథుడైన సాళ్వ నరసింహరాయలు అహోబిల నారసింహుని భక్తుడు. అప్పుడప్పుడు తాను టంగుటూరు నుండి రాచకార్యంగా విజయనగరానికి పోయి వచ్చేసందర్భంలో అహోబిల నరసింహుణ్ణి దర్శించడం సంప్రదాయం కాబోలు. ఆ ప్రకారం పోయినపుడు అహోబిలంలోనున్న అన్నమయ్య ప్రతిభావ్యుత్పత్తుల్ని అచటివారివల్ల విన్నాడేమో? అన్నమయ్య తాను కొత్తగా వ్రాసిన...

**'..........వాల్మీకి రామాయణమెల్ల**
**రాగంబుతో ననురాగంబుతోడ**
**బాగుగా గంధర్వుబాగుగా జదివి**
**పాటలన్నియు దనపాట పిమ్మటన**
**పాటపాటనె పాటపాడి చూపగను'**

సంతసించి సాళ్వ నరసింగరాయలు అన్నమయ్యను దర్శించి, స్వామి సన్నిధిని పరిచయం చేసికొని

**యా తాళ్ళపాకాన్నమయ్యకు సాగి**
**చేతులు మొగిచి మచ్చిక బూజచేసి**
**శ్రీకృష్ణమన్నన గ్రీడి భూ చక్ర**
**మేక చక్రంబుగా నేలిన పగిది**
**నాలాగు మీ సహాయము నాకు గలుగ**
**నేలుదు ధరయెల్ల నేక చక్రముగ**
**నన్ను మన్నించి విన్నపమాలకించి**
**క్రన్నన మాయూరి కడ కేగుదెంచి**
**మాకు బుద్ధులు సెప్పి మాచేయి**
**పూజ చేకొని మమ్ము రక్షింపరే.....**

అని అర్థించి అందలం బెక్కించి తాను భృత్యప్రాయుడై కొల్చి తన రాజధాని టంగుటూరికి తోడ్కొని వచ్చినాడేమో!

అన్నమయ్య పాడిన రామాయణాన్ని విన్నవాడగుటచే కాబోలు పండిత పరిపోషకుడు, సాహిత్యవేత్త, సమరాంగణ సార్వభౌముడైన సాళ్వనరసింహరాయలు 'రామాభ్యుదయ' మనే సంస్కృత కావ్యాన్ని రచించాడని కొందరి అభిప్రాయం.

**పాద ప్రశంస :-**

శైవ వైష్ణవ క్షేత్రాల్లో స్వామి పాదాలనుపేర పాదచిహ్నాలుగా శిలలపై తీర్చబడి ఉన్నాయి. వాటిల్ని తరచు మనము దర్శించుచున్నాముగదా!

అవి శ్రీపాదములో! శ్రీగురు పాదములో! శ్రీహరిపాదములో! శ్రీహరపాదములో మనకు పూజనీయాలు. భక్తజనుల పూజలు అందుకొంటున్నాయి.

అట్లే భువనగిరిపై (బోనగిరి) నెలకొన్న దనాదిగా ఒక పాదమే. దానిని బాల్యంలో అన్నమయ్య దర్శించి ఉండకపోడు. తిరుమల యాత్రాసందర్భంలోనూ తలయేరుగుండు సమీపానగల మంటపంలో ప్రతిదినము దిగువ తిరుపతి నుండి వచ్చిన రామానుజాచార్యుల వారికి, ఉదయం తిరుమలలో స్వామినర్చించి ఉపదేశం చేయుచుండగా, మధ్యాహ్నసమయానికి పూజాతిక్రమణదోషం నంబివారికి కలుగనీయకుండా ఆ వేళకు శ్రీస్వామి తన శ్రీపాదాలను-దివ్య కుసుమ తులసీమృగ మద కర్పూర సుగంధముతోడ ప్రత్యక్షం గావించెనట! అటువంటి శ్రీపాదములు అహోబిల క్షేత్రంలో ఉన్నవి కాబోలు!

ఆ శ్రీపాద సందర్శనోత్సవం చిన్ననాటి నుండి అన్నమయ్య హృదయంలో నిల్చి ఉండుటచే నా దివ్యపాదమహిమ

**బ్రహ్మ కడిగిన పాదము!**
**బ్రహ్మము దానె నీ పాదము!**

అను దివ్య సంకీర్తనం అతని నోట వెలయింపజేసిందై మనలను ధన్యుల్ని చేసిందనుకోవచ్చు. మరియు నేటికినీ ఒక సంప్రదాయం రాజువారి సీమలో దళిత వంశీయులందు నెలకొని ఉండే వృత్తాంతం గమనిద్దాం.

వైశాఖశుద్ధ పాడ్యమినుండి గాని ఆ పక్షంలో తొలిశనివారంనుండి

గానీ వ్రత నియమాన్ని పాటించి తమ ఇండ్లు వాకిండ్లు ఆవు పేడతో శుద్ధిచేసుకొని ఇంట దివ్వె వెలిగించి దానిముందు బియ్యం, రాగి, జొన్న (లభించినదేదైనా) ధాన్యం పిండిని పరచి పూజించి ఉంచుతారట! ఆ రాత్రి ఆ గృహస్థుని (కుటుంబంలో ఎవ్వరికైనా) కలలోగానీ, పరచిన పిండిపై పాదపుగుర్తుగానీ, కన్పించినంతనే, స్వామికి తమ కోర్కె నివేదించుకొని ముడుపులు కట్టుకుంటారట. ఆ దినం మొదలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలుండి దివ్వెను పూజిస్తూ సుమారు ఒకమూర పొడవుగల 'పాదరక్ష' (చెప్పు) కుడికాలిది ఒకటి కుట్టి, దానికి రంగులు పూసి, రంగుల జిగిణి రాతి రేకులు, పూసలు, కుచ్చులు, చిన్న గొడుగులతో అందంగా అలంకరిస్తారు.

ఆ తరువాత దాన్ని దాగెరలో పెట్టుకొని పూలు, పసుపు, కుంకుమలతో పూజిస్తూ గరుడగంబ మెత్తుకొని తప్పెటలు, తుడుములు వాయిస్తూ కొమ్ములూదుకొంటూ 'గోవిందా' అని గోవిందలు పెడ్తూ ఊరూరా ఇంటింటికీ తిరిగి ఆయా ఇండ్లవాళ్ళొసగిన ముడుపులూ, ధనధాన్యాలూ, వస్త్రాలు తీసుకొని సరిగ్గా నృసింహ జయంతినాటికి నెల్లూరు మండలంలో గల రాపూరు సమీపమందలి పెంచలకోన శ్రీపెంచల (పెనుశిల) నృసింహస్వామి క్షేత్రం చేరుతారు. అచ్చట నున్న స్వామివారి శ్రీపాదం సన్నిధిని తాము తీసికొనిపోయిన శ్రీవారి పాదరక్షనుంచి, ముడుపులిచ్చి తమ మ్రొక్కులు తీర్చుకొందురు.

ఈ వ్రత నియమ నిబంధనల్ని కడు కఠినంగా వ్యవహరిస్తారట. తమ కేదైన విపరీతం జరిగినచో అది తమ వ్రత నియమాల్లో ఏదో లోపం జరిగిందనే నమ్మకం వారిలో నున్నది. తమ ఆచరణలో ఏ

విపరీతం లేకుండు వరకు మూడేండ్లు లేక మూడు పర్యాయాలు శ్రీస్వామి పాదరక్షలు కుట్టి వ్రతనియమం పాటించి స్వామికి సమర్పించుకొందురట!

ఇట్లే ఒక ప్రాంతీయులు కుడిపాదం చెప్పుకుట్టి స్వామికి సమర్పిస్తే మరో ప్రాంతీయులైన భక్తులు తమకు కలలో కనబడి, పిండిపై చూపిన చిన్నె ప్రకారం ఎడమపాదం చెప్పుకుట్టి స్వామికి సమర్పింతురట.

ఈ విధంగా స్వామివారి సన్నిధికి వచ్చినచెప్పుల్లో కుడి ఎడమల జోడు చెప్పులు స్వామికి అమరి ఉండగలవని ఈ వ్రత నియమానురక్తులైన భక్తులు చెబుతున్నారు.

ఈ పద్ధతినే తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని శ్రీపాదములందును వారనుష్ఠింతురట. అది మనమెరిగిందే. అందుకు తిరుమలలో (అలిపిరి) చెప్పుల మండపమే నిదర్శనం.

ఈ వ్రతనియమం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవ సమయాన చేస్తారని కొందరు, ఎప్పుడైనా భక్తుని అభీష్టానుసారం తన అనుకూలాన్ని బట్టి ఒక శనివారమున ప్రారంభించి పాటించవచ్చునని మరి కొందరూ అంటారు.

ఏమైననూ శ్రీవారి శ్రీపాదంపై నాగరికులకన్న అనాగరికులలోనే భక్తి ప్రపత్తులెక్కువగా నున్నవనుటకు సత్యమైన తార్కాణమిది. అతిశయోక్తి కాదు.

# 3.అన్నమయ్య-నవవిధ భక్తులు

శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం, వందనం, దాస్యం సఖ్య మాత్మనివేదనమ్ ॥

అని సంస్కృత భాగవతము తొమ్మిది విధాలైన భక్తి మార్గాలను తెలియజేసింది. ఇదే తొమ్మిది రకాల భక్తి మార్గాలను పోతన భాగవతంలో ఇలా చెప్పాడు.

**తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం**
**బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుడై యుండుట భద్రమంచు తలతున్ సత్యంబు దైత్యోత్తమా**
**(దశమస్కంధం-పూర్వభాగం-226)**

అని పై నవవిధ భక్తి మార్గాలలో అన్నమయ్య సంకీర్తనలు శ్రీవేంకటేశ్వరుని సేవించాయి.

శ్రవణ భక్తి:

"శ్రవణం నామ చరిత గుణాదీన శ్రుతిర్భవేత్" అని భక్తి రసామృత సింధువు భగవంతుని నామగుణ చరిత్రలను శ్రద్ధతో ఆలకించడమే శ్రవణభక్తి.

"శ్రీవిష్ణోః శ్రవణే పరీక్షద భవత్" అను శ్లోకమును బట్టి శ్రవణ భక్తిలో పరీక్షిత్తు ముఖ్యుడు. ఏడు దినాలలో భగవంతుని కథలను విని ముక్తిని పొందినవాడు పరీక్షిత్తు.

**"వినరో భాగ్యము విష్ణుకథ,**
**వెనుబల మిదివో విష్ణు కథ"**
**"శ్రీపతి మీకథ చెవులను వింటిమి**
**పాపములణగెను భయముడిగె"**

విష్ణుకథలను వినడం మహద్భాగ్యంగా చెపుతూ శ్రీపతి కథలను వింటే పాపాలను బాసి భయాలు తొలగిపోతాయని అన్నమయ్య అంటున్నాడు.

తానే గోపికయై అన్నమయ్య శ్రీహరి కథామృతాన్ని నిరంతరం సేవించువాడు కనుక శ్రీహరి భక్తిని ఇలా ప్రకటించాడు.

**"కలిగె మాకిదె కైవల్యము**
**కలకాలము హరికథా శ్రవణము"**
**"నీ కథామృతము నిరతసేవన నాకు**
**చేకొనుట సకల సుఖసేవనంబటుగాన"**

కేవలం హరికథా శ్రవణం వల్లనే మోక్షం లభిస్తుందని, అలాంటి శ్రీహరి కథామృతాన్ని నిరంతరం వినడం ద్వారా సమస్త సుఖాలు ప్రాప్తిస్తాయని తెలుస్తుంది. శ్రవణ భక్తి ద్వారా కైవల్యం ప్రాప్తిస్తుందని, నిర్మలమైన భక్తిని కోరువారు శ్రీహరి పావన కథలను ఆసక్తితో వినాలని అన్నమయ్య తెలియజేస్తున్నాడు.

**కీర్తనభక్తి :**

భగవంతుని నామ గుణలీలా విభూతుల్ని స్తుతించడం కీర్తనభక్తి అనబడుతుంది. కీర్తనభక్తిలో ముఖ్యుడు శుకుడు.

"శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ" అని ప్రహ్లాదుని మాటగా ప్రకటించాడు పోతన.

లోక ప్రసిద్ధమైన హరినామకీర్తన ప్రాచీనత్వాన్ని తెలయజేయడంలో అన్నమయ్య కీర్తనభక్తి ప్రకటించబడింది.

**నళినదళాక్షుని నామ కీర్తనము**
**కలిగి లోకముల కలదొకటె**

అట్లే కీర్తనం బ్రహ్మపదార్థమని ఇది సామవేదం కంటే గొప్పదైనదని ప్రస్తుతించాడు.

**"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం**
**జాలెల్ల నడగించు సంకీర్తనం"**
**"సామమున కెక్కుడెడీ సంకీర్తనం"**

క్రింది కీర్తనలలో మేలైన రుచిని ఇచ్చే సంకీర్తనమే తనకు చాలని, ఇహపర సాధనం అదేనని తెలిపిన విధం అన్నమయ్య కీర్తనభక్తికి నిదర్శనం.

**"చాలదా హరినామ సంకీర్తనము తమకు**
**చాలదా యితమైన చవులెల్ల నొసగ"**
**"ఇహపర సాధన మిదియొకటె**
**సహజపు మురారి సంకీర్తనొకటె"**

**స్మరణభక్తి:**

భగవంతుని విస్మరింపక, నిరంతరం ధ్యానించుట స్మరణభక్తి. ఈ స్మరణ భక్తులలో ముఖ్యుడు ప్రహ్లాదుడు. "చక్రి చింతనలేని జన్మంబు

జన్మమే"? అన్న ప్రహ్లాదుని మాటల ద్వారా పోతన స్మరణభక్తి ప్రకటితమైంది.

"కలౌ స్మరణాన్ముక్తిః" కలియుగంలో స్మరించడం వల్ల ముక్తి లభిస్తుంది. అన్న మాటలను గుర్తు చేస్తున్న అన్నమయ్య స్మరణభక్తిని ఇలా ప్రకటించాడు. హరిని, హరిపేరు తలచడం చేతనే తనను శ్రీహరి కరుణించాడని చెప్పాడు.

**నిన్నుదలచి పేరు దలచి**
**నన్ను కరుణించితే నెన్నిక గాక**

అచ్యుతుని నామం స్మరించడం వల్ల కోరిన ధనమెల్లా లభిస్తుందని, ఆ నామమే అధికమైన ధనమని నారదుడు మొదలైన వారిచే స్మరించబడిన నాలుకపైన ధనం ఇదేనని అట్టి నారాయణ నామమే నమ్మదగిన ధనమని నామస్మరణం గూర్చి తెలిపాడు.

**ఇచ్ఛలో గోరే వెల్లా ఇచ్చే ధనము**
**అచ్యుతు నామమే పో అధికపు ధనము**

**నారదాదులవొగడే నాలుకపై ధనము**
**సారసపు వేదాలతో చాటే ధనము**
**కూరిమి మునులు దాచుకున్నట్టి ధనము**
**నారాయణ నామమిదే నమ్మినట్టి ధనము**

హరినామ స్మరణ ఆనందాన్ని కలిగిస్తుందని అందుకే ఆ శ్రీహరి నామాన్ని మరవ వద్దని కలిదోషహరమైన ఆ నామాన్ని ఎల్లప్పుడు తలచమని తనివితో ఆనామ స్మరణలో మునిగి తరించండని స్మరణభక్తిని ప్రకటించాడు.

హరినామము కడు ఆనందకరము
మరుగవొ మరుగవొ మరుగవొ మనసా

నలినాక్షుని శ్రీనామము
కలిదోషకరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలచవొ తలచవొ తలచవొ మనసా

నగధరు నామము నరకహరణము
జగదేకహితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవొ పొగడవొ పొగడవొ మనసా

కడిగి శ్రీ వేంకటపతి నామము
బడిబడివే సంపత్కరము
అడియాలంబిల నతి సుఖమూలము
తడవవొ తడవవొ తడవవొ మనసా.

పాదసేవనాభక్తి :

"పాదసేవనం నామ భగవత్పరిచర్యా చామరాందోళన పర్వ మహోత్సవాను రూపా" అని భక్తి ప్రకాశం.

అన్నమయ్య క్రింది సంకీర్తనలో బ్రహ్మపాదసేవనా భక్తి తత్పరుడని తెలుస్తున్నది.

"శ్రీకాంతుడ నీ పాద సేవకులయినవారు..... బ్రహ్మాదులు"

**శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ**
**శ్రీమన్నారాయణ నీ పాదమే శరణు**

ప్రామాణికులైన ప్రపన్నులకు కామధేనువు, కల్పవృక్షం శ్రీహరి అని, మోక్షం కోరేవారికి ధరణీధరుని పాదసేవే భాగ్యాన్ని ఇస్తుందని తెలిపాడు.

**కామధేనువిదె కల్పవృక్షమిదె**
**ప్రామాణ్యముగల ప్రపన్నులకు**
**ధరణి ధరుపాద సేవే భోగము**
**పరమంబెరిగిన ప్రపన్నులకు**

అంతేకాక శ్రీహరి పాదప్రాశస్త్యం గురించి క్రింది సంకీర్తనలో తెలిపాడు అన్నమయ్య. ఇందులో వామనావతార ఘట్టం, అహల్యా పాప విమోచన ఘట్టాలు తలంపునకు తెస్తాయి.

**బ్రహ్మకడిగిన పాదము**
**బ్రహ్మము దానె నీ పాదము**

**చెలగి వసుధ గొలిచిన నీ పాదము**
**బలితల మోపిన పాదము**
**తలకక గగనము తన్నిన పాదము**
**బలరిపు గాచిన పాదము**

**కామిని పాపము కడిగిన పాదము**
**పాముతలనిడిన పాదము**

ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము

పరమయోగులకు పరిపరి విధముల
వరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము

బ్రహ్మచే కడగబడినది, బ్రహ్మం తానే అయినది. భూమిని కొలిచినది, బలితలపై మోపినది. ఆకాశాన్ని తన్నినది, (తాకినది) ఇంద్రుని కాపాడినది, అహల్య పాపాన్ని కడిగినది, కాళీయమర్దన చేసినది, ప్రేమతో లక్ష్మీచేత ఒత్తబడినది, పరమయోగులకు పరిపరి విధాల కైవల్యాన్ని ఇచ్చినది అయిన ఈ పాదము తిరువేంకటగిరిలో స్థిరంగా నిలిచి పరమపదాన్ని ప్రసాదించడానికై ఉన్నది అని కొనియాడాడు.

క్రింది కీర్తనలో కూడా అన్నమయ్య పాదసేవనా భక్తిని ప్రకటిస్తూ శ్రీహరి పాద ప్రాశస్త్యాన్ని కొనియాడాడు.

ఈ పాదమే కదా యిలయెల్ల గొలిచినది
ఈ పాదమే కదా యిందిరా హస్తముల కితవైనది
ఈ పాదమే కదా యిందరును మ్రొక్కెడిది
ఈ పాదమే కదా యీగగన గంగ పుట్టినది
ఈ పాదమే కదా యెలమి పెంపొందినది
ఈ పాదమే కదా యిన్నిటికిని యెక్కుడైనది

ఈ పాదమే కదా యిభరాజు తలచినది
ఈ పాదమే కదా యింద్రాదులెల్ల వెదకినది
ఈ పాదమే కదా ఈ బ్రహ్మ కడిగినది
ఈ పాదమే కదా యెగసి బ్రహ్మాండమంటినది

ఈ పాదమే కదా ఇహపరము లొసగిడిది
ఈ పాదమే కదా యిలనహల్యకు కోరికైనది
ఈ పాదమే కదా యీక్షింప దుర్లభము
ఈ పాదమే కదా యీ వేంకటాద్రిపై నిరవైనది

భూమిని కొలిచినది, (వామనావతారం) ఎల్లప్పుడు లక్ష్మీదేవి తన చేతులతో ఆపాదాలను ఒత్తడం చేత లక్ష్మి హస్తాలకు నిలయమైనది, అందరిచే మ్రొక్కబడినది, ఆకాశగంగ పుట్టినది, ప్రశస్తమైనది, అధికమైనది, ఇభరాజు తలచినది, బ్రహ్మచే కడగబడినది, బ్రహ్మాండాన్ని ఆక్రమించినది, ఇహపరాలను ఇచ్చేది, చూడటానికి అరుదైనది అయిన ఆ పాదం ఇప్పుడు శ్రీవేంటాద్రిపై స్థిరంగా ఉంది అని తెలిపాడు.

**అర్చన భక్తి :**

"అర్చనం పూజా" అని భక్తి ప్రకాశము , "గౌరవిత ప్రీతి హేతు క్రియా పూజా" అని దేవపూజారహస్యము అను నిర్వచనాలను బట్టి గౌరవింపబడువారికి ప్రీతిహేతువైన సమస్త క్రియలు పూజ అనబడును. ఆ పూజ అర్చనమని తెలుస్తుంది. త్రిలోకాలకు పూజింపదగినవాడు పరమాత్ముడు కాబట్టి పరమాత్మకు ప్రీతికరమైన పని చేయుటయే అర్చన అని స్పష్టమవుతుంది.

అన్నమయ్య అర్చన భక్తిని గురించి ఈ విధంగా ప్రకటించాడు.

**నిన్ను బూజించే వారి నిజ పరతత్త్వమవు**
**యిన్నిటా నీ దాసులకు యేలికవు**

అని భగవంతుని అర్చించే వారికి నిజమైన పరతత్త్వం లభిస్తుందని, దాసులకు అతడే ఏలిక అని, అర్చన భక్తిని తెలిపాడు.

**నిత్య పూజలివో నేరిచిననోహో**
**ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి**
**తనువే గుడియట తలయే శిఖరమట**
**పెనుహృదయమే హరి పీఠమట**
**కనుగొన చూపులె ఘనదీపములట**
**తనలోపలి అంతర్యామికిని**
**పలుకే మంత్రమట పాడైన నాలికే**
**కలకలమను పిడి ఘంటయట**
**నలువైన రుచులే నైవేద్యములట**
**తలపులోపల నన్ను దైవమునకు**
**గమన చేష్టలే అంగరంగ గతియట**
**తమిగల జీవుడే దాసుడట**
**అమరిన వూర్పులే ఆలపట్టములట**
**క్రమమతో శ్రీ వేంకటరాయనికి**

తనలోని అంతర్యామికి శరీరమే ఒక దేవాలయం, తల దాని శిఖరం, హృదయ స్థానం హరిపీఠం, చూచే చూపులు(కనులు)

ఘనదీపాలు. తనలోని దైవానికి మాటే మంత్రం. నాలుకే కలకలమను శబ్దాన్ని కలిగించే పిడిఘంట. నలువైన రుచులే (బ్రహ్మపదార్థం) నైవేద్యాలు. శ్రీవేంకటేశ్వరుని కోసం చేసే గమన చేష్టలే అంగరంగ గతియని, జీవుడే ఆ దేవుడికి దాసుడని, అమరిన ఊర్పులే ఆలపట్టాలు అని పరమాత్మకు నిత్యం తాను చేసే పూజా విధానాన్ని తెలిపాడు.

"అర్చనం పూజా" భక్తి ప్రకాశము చెప్పినట్లుగా పూజ అర్చన భక్తిగా అన్నమయ్య పై సంకీర్తనలో మానసిక అర్చన భక్తి చేశాడు. అట్లే 'నిండు మనసే నీ పూజ' అని నిజమైన మనస్సు గల్గి ఉండడమే అర్చనభక్తి అని తెలిపాడు.

**నిండు మనసే నీ పూజ**
**అండ గోరకుండుటదియు నీ పూజ**

అర్చన విధానంలో షోడశోపచారాలు కలవు. క్రింది సంకీర్తనలో అన్నమయ్య శ్రీహరికి సమర్పించిన షోడశోపచారాలు అతని అర్చన భక్తిని ప్రకటిస్తుంది.

**షోడశ కళానిధికి షోడశోపచారములు**
**జాడతోడ నిచ్చలును సమర్పయామి**

**అలరు విశ్వాత్మునకు ఆవాహనమిదె సర్వ**
**నిలయునకు ఆసనము నెమ్మినిదే**
**అల గంగా జనకునకు అర్ఘ్యపాద్యాచమనాలు**
**జలధి శాయికిని మజ్జన మిదె**

**వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె**
**సరి శ్రీమంతునకు భూషణములివె**
**ధరణీ ధరునకు గంధ పుష్ప ధూపములు**
**తిరిమిచే కోటి సూర్య తేజునకు దీపము**

**అమృత మథనునకు అదివో నైవేద్యము**
**గమిచంద్ర నేత్రునకు కప్పుర విడెము**
**అమరిన శ్రీ వేంకటాద్రి మీది దేవునకు**
**తమితో ప్రదక్షిణాలు దండములు నివిగో**

ఆవాహనం, ఆసనం, పాద్యం, అర్ఘ్యం, ఆచమనం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం, ప్రదక్షిణం, నమస్కారం, నీరాజనం మొదలైన షోడశోపచారాలను మానసపూజగా చేశాడు అన్నమయ్య.

**వందన భక్తి :**

వందనమనగా నమస్కరించుట. ఇది మిగిలిన భక్తి మార్గాలకంటే అత్యంత శీఘ్ర అనుగ్రహ ప్రదమైంది.

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః॥**

"నీమనస్సు నాయందే లగ్నమొనర్చి నాకే నమస్కరించు. ఈ విధంగా నాయందే భక్తి తత్పరతతో తదేక నిష్ఠగల మనసుతో నన్ను ఆశ్రయిస్తే తప్పక నన్నే పొందుతావు." అని భగవానుని మాటలు.

తల్లిదండ్రులు, గురువులు, భాగవతులు వీరికి చేసే వందనం

భగవత్ అనుగ్రహాన్ని కల్గజేస్తుందని భాగవతము చెపుతుంది. ఈ వందనంలో వినయం, అనునయం, స్తోత్రపాఠం, ప్రార్థన అనేవి సమ్మిళితమై ఉంటాయి.

అన్నమయ్య వందనభక్తిని ఈ క్రింది సంకీర్తనల ద్వారా ప్రకటించిన విధం గుర్తింపదగి ఉంది.

"మరుతంత్రములలోన మరగేటికి
శిరసువంచి మొక్కేను చెప్పరే యాతనికి"
"నమో నారాయణాయ నమో
సమధికానందాయ సర్వేశ్వరాయ"

"నళినాక్షు నీకు నమస్కరించిన
ఫలము వొగడ నిక బ్రహ్మకు వశమా"

"నవనీత చోర నమో నమో
నవ మహిమార్ణవ నమో నమో"

హరి నారాయణ కేశవాచ్యుత కృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నర నారాయణ నమో నమో

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారకా
నగరాధినాయకా నమో నమో

వైకుంఠ రుక్మిణీ వల్లభ చక్రధర
నాకేశ వందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీ వేంకటేశ్వర
నాకజననుత నమో నమో

"నారాయణాయ నమో నమో నానాత్మనే నమో నమో ఈ రచనలనే ఎవ్వరు దలచిన ఇహపర మంత్రములిందరికి".

పై కీర్తనలో భగవంతుని నామరూపగుణాదుల్ని కీర్తించి నమస్కరించి దేవేంద్రునిచే దేవతలచే కీర్తించబడే శ్రీకర గుణనిధి అయిన శ్రీ వేంకటేశ్వరునికి వందన భక్తిని ప్రకటించాడు అన్నమయ్య.

'ఈ రచనలు' అనే మాటకు అర్థం కీర్తనలు. కీర్తన ద్వారా ఇహపర సౌఖ్యాన్ని పొందవచ్చని అన్నమయ్య తెలియజేస్తూ అన్ని ఆత్మలు తానైయున్న ఆ నారాయణునికి వందనమాచరిస్తున్నాడు.

"నమో నమో లక్ష్మీ నారసింహ
నమో నమో సుగ్రీవ నరసింహ
"నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ
సరుగ నానాశత్రుల సంహరించవే"

శ్రీవేంకటేశ్వరునికి నమస్కరించిన మాత్రాన శత్రువుల బారినుండి తప్పించుకోవచ్చని తెలియజేస్తున్నాడు. అంతేగాక తన జీవితంలో ఏదో ఒక సందర్భంలో ఈ అవసరం అన్నమయ్యకు వచ్చి ఉంటుందని అనిపిస్తుంది. అందుకే "నీవాదనని నన్ను నిందించే శత్రువును చావగొట్టి వానినిట్టే సంహరించవే" అని పై కీర్తనలో చెప్పుకున్నాడు.

**నారాయణ నమో నమో**
**నారద సన్నుత నమో నమో**

**ఆది దేవ సకలాగమ పూజిత**
**యాదవకుల మోహనరూప**
**వేదోద్ధర తిరువేంకట నాయక**
**నాద ప్రియతే నమో నమో**

నారదునిచే స్తుతింపబడేవాడు, సకలాగమాలతో పూజింపబడేవాడు, ఆ ఆదిదేవుడైనవాడు, సంగీతప్రియుడు, మోహనరూపుడు, యాదవకుల తిలకుడు, వేదోద్ధరుడు అయిన శ్రీ వేంకటేశ్వరునికి నమస్కారం అని అన్నమయ్య వందనభక్తిని ప్రకటించాడు.

**దాస్యభక్తి :**

**దాస్యం కర్మార్పణం తస్య కైంకర్యమపి సర్వదా**

అనే నిర్వచనాన్ని బట్టి సర్వకర్మలు భగవదర్పణ చేసి కైంకర్య మొనరించుట దాస్యభక్తి అని తెలుస్తుంది.

అన్నమయ్య దాస్యభక్తిని, ప్రాచీనత్వాన్ని, ప్రాశస్త్యాన్ని కొనియాడిన విధం ఇలా ఉంది.

**ఆదికి అనాది హరి దాస్యంబిది**
**వేదాంతంబుల వెలసినది**

**సోదించి కనిరి శుకనారదాదులు**
**పాదుగ నికతమ భాగ్యము కొలది**

హరిదాస్యం అనాది అని, వేదాంతాలలో చెప్పబడినదని, శుకనారదాది నిత్యముక్తులచే ఆచరించబడేదని, దాస్యభక్తి ప్రబోధాన్ని, ఆచారాన్ని అన్నమయ్య ప్రకటించాడు.

**అంది నీకు భక్తులైన యల మహానుభావుల**
**చందపువారిపై భక్తి చాలదా నాకు**
**కుందువ శ్రీవేంకటేశ కదునీ బంటుకు**
**సందడి బంటనవుటే చాలదా నాకు**

భాగవతులపై (శ్రీహరిభక్తులు) భక్తి కలిగివుండడం, వారికి సేవ చేయడం మంచిదని అన్నమయ్య చెప్పిన మాటల్లో దాసానదాసుడను అన్న అనన్య దాస్యభక్తి కనిపిస్తుంది.

శ్రీవేంకటేశ్వరా! నేను నీ దాసుడను. నా బాగోగుల గురించి నీకు చెప్పనక్కరలేదు. నన్ను రక్షించువాడవు నీవేనంటూ దాస్యభక్తిని ప్రకటించాడు.

**నీ దాసుల భంగములు నీవు జూతురా**
**యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా?**

"అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అన్న భావనతో అన్నమయ్య మేము నీ దాసులం. నీవు మమ్ము రక్షించే రాజువు అని దాస్యభక్తిని ప్రకటించాడు.

**నీవేలికవు మాకు నీ దాసులము మేము**
**ఆవల నితరుల నేమడుగ బొయ్యేమా**

నిర్మలంగా పూనిన దాసులకు ఎల్లవేళలా సౌఖ్యాన్ని ఇచ్చేవాడు ఆ జనార్దనుడే. శ్రీహరి దాస్యం ఒక్కటే నమ్మదగింది, అన్న అన్నమయ్య దాస్యభక్తి క్రింది సంకీర్తన ద్వారా ప్రకటించబడింది.

**సంతత సౌఖ్యము జనార్దనుడే**
**ఆర్మిలి సంపదలనంతుని తగులు**
**నిర్మలముగ పూనిన దాసులకు**

**నీ దాస్యమొకటే నిలిచి నమ్మగలది**
**శ్రీదేవుడవు నీ చిత్తము నాభాగ్యము**
**పరగుశ్రీ వేంకటపతి తన దాసుల**
**నరుడుగ గాదే ననంతుడితడు**

ఎక్కడ పుట్టినా, ఎక్కడ ఉన్నా శ్రీహరిపై దాస్యభక్తిని గలిగి ఉంటే చాలు అంటూ దాస్యభక్తిని ప్రకటించాడు.

**యెందు జనించినా నేమి యెచ్చోటనున్ననేమి**
**కందువ నీదాస్యము గలిగితే చాలు**

**సఖ్యభక్తి :**

"భగవంతుని ప్రభావ, తత్త్వ, రహస్య మహిమల గ్రహించి విశ్వాస పూర్వకముగా సఖ్యభావనతో నాతని రుచికనుగుణముగా రూపొందుట అతని ననన్యముగా ప్రేమించుట, అతని గుణరూప లీలాదుల యందు ముగ్ధుడై నిరంతరము ప్రసన్నముగా నుండుట సఖ్యభక్తి."

పరమాత్ముని స్నేహితునిగా భావించి, సేవించుట సఖ్యభక్తి. దాస్యభక్తి పరిపక్వం చెంది సఖ్యభక్తిగా పరిణమిస్తుంది. ఇందులో ప్రేమ,

సన్నిహితం సంబంధము ఉంటుంది. ఈ సఖ్యభక్తిలో ముఖ్యుడు కుచేలుడు.

సఖ్యభక్తి ద్వారా అర్జునుడు శ్రీహరి విశ్వరూపాన్ని దర్శించే భాగ్యానికి నోచుకున్నాడని అన్నమయ్య సఖ్యభక్తిని ప్రకటించాడు.

**బలువగు తన రూపము జూపె**
**కలదింతయు ఘనతెరింగించెన్**

**పాండవరక్షణ పరుడై నరునకు**
**నండనే తెలిపె మహామహిమ**
**దండె విడిచి తన దయతో నర్జును**
**డుండగ మగటి మీనాడు బలికె**

పాండవులను రక్షించడానికై అర్జునుడికి గీతోపదేశం చేశాడు. ఇది సఖ్యభక్తిలో అర్జునునికి మాత్రమే సాధ్యమైంది. ఈ గీతోపదేశ సారాంశమే ఇది అని అన్నమయ్య ఇలా తెలియజేశాడు.

**అని ఆనతిచ్చె కృష్ణుదర్జునునితో**
**విని యాతని భజించు వివేకమా**

**భూమిలోన జొచ్చి సర్వభూత ప్రాణులనెల్ల**
**ధీమపాన మోచేటి దేవుడనేను**
**కామించి సస్యముల కలిగించి చంద్రుడవై**
**తేమల పండించేటి దేవుడనేను**

**దీపనాగ్నినై జీవదేహముల అన్నములు**
**తీపుల నరగించే దేవుడనేను**

వీపున నిందరిలోని హృదయములోన నుండు
దీపింతు తలపు మరపై దేవుడనేను

వేదములన్నిటిచేత వేదాంత వేత్తలచే
ఆదినే నెరగదగిన ఆ దేవుడను
శ్రీదేవితో గూడి శ్రీ వేంకటాద్రి మీద
పాదైన దేవుడను భావించనేను" అని భగవానుడే
తన తత్త్వాన్ని తెలియజేశాడు.

క్రింది కీర్తన ద్వారా భగవంతునికి భక్తునికి నర నారాయణులకు గల సఖ్య భక్తి వ్యక్తమవుతున్నది.

ఏల మోసపోయిరొకొ యెంచి యాకాలపు వారు
బాలకృష్ణుని బంట్టై బ్రతుకవద్దా
దరునికి విశ్వరూపున్నది జూపనంటేను
నరహరి యితడని నమ్మవద్దా

**ఆత్మనివేదన భక్తి :**

"ఆత్మదేహః తస్య నివేదనం భగవతి సమర్పణం యద్వా ఆత్మనః ఆత్మీయస్య దేహదారాదే" దేహదారులను భగవత్ అర్పణం గావించుట ఆత్మనివేదనం అవుతుందని తెలుస్తుంది.

జీవాత్మ పరమాత్మ స్వరూపం అని భావించుటే ఆత్మజ్ఞానం. ఇట్టి అహంకార రహితమైన అభేదదృష్టితో కూడిన ఆత్మ నివేదనమే ఆత్మలో నెఱుక అని పోతన మతం. దీనికే ప్రపత్తి, శరణాగతి, ఆత్మనిక్షేపం, న్యాసం అన్న నామాంతరాలున్నాయి.

భవబంధాలను విడనాడాలంటే అంతరంగాన్ని సర్వస్వాన్ని శ్రీహరికి సమర్పించాలని ఆత్మనివేదన భక్తి ప్రకటించాడు అన్నమయ్య.

**అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించకుంటె**
**వింత వింత విధముల వీడునా బంధములు**

**మనుజుడై ఫలమేది మరిజ్ఞాని యౌదాకా**
**తనువెత్తి ఫలమేది దయగలుగుదాకా**
**ధనికుడై ఫలమేది ధర్మము సేయుదాకా**
**పనిమాలి ముదిసితే పాసెనా భవము**

**చదివియు ఫలమేది శాంతము కలుగుదాకా**
**పెదవెత్తి ఫలమేది ప్రియమాడుదాకా**
**మదిగలి ఫలమేది మాధవు దలచుదాకా**
**యెదుట తాను రాజైతే ఏలెనా పరము**
**పావనుడై ఫలమేది భక్తి కలిగిన దాకా**
**జీవించి ఫలమేది చింతదీరుదాకా**
**వేవేల ఫలమేది వేంకటేశుఁగన్నదాకి**
**భావించి తా దేవుడైతే ప్రత్యక్షమౌనా**

భగవంతుని మీద విశ్వాసంతో కూడిన భక్తిని ప్రకటించి తన సర్వస్వం భగవంతునికి అర్పించి, నేను నిమిత్త మాత్రుణ్ణి, అన్ని చర్యలకు కారకుడు ఆ భగవంతుడే నన్న తత్త్వంతో మెలగడం ఆత్మనివేదనా భక్తిని ప్రకటిస్తుంది.

అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంతనాకు నీవే శ్రీరఘురామ

కులమును నీవే గోవిందుడా నా
కలిమియు నీవే కరుణానిధీ
తలపును నీవే ధరణీధరా నా
నెలవును నీవే నీరజనాభా

తనువును నీవే దామోదరా నా
మనికియు నీవే మధుసూదనా
వినికియు నీవే విట్టలుడా నా
వెనకముందు నీవే విష్ణుదేవుడా

పుట్టుగు నీవే పురుషోత్తమా కొన
నట్ట నడుమ నీవే నారాయణా
యిట్టే శ్రీవేంకటేశ్వరుడా నాకు
నెట్టన గతి యింక నీవే నీవే

నీవే గతియని వేడుకోవడం శరణాగత తత్త్వం. అది ఆత్మనివేదన భక్తికి నామాంతరం. మచ్చునకు కొన్ని కీర్తనలు.

దైవమా నీవేగతి మా తప్పులు పనిలేదు
శ్రీ వల్లభుడవు నీవే చేకొని కావగదే

తే శరణమహం తే శరణమహం
శైశవకృష్ణా తే శరణం గతోఽస్మి

**పరమాత్మ పరమాణురూపశ్రీ**
**తిరువేంకటగిరి దేవా శరణు**

నవవిధ భక్తిమార్గాలను ప్రకటించిన అన్నమయ్య నవవిధ భక్తి ప్రాశస్త్యాన్ని కూడా కొనియాడడం ద్వారా భక్తికి వశుడు భగవంతుడు అన్న విషయాన్ని లోకానికి తెలియజేసి తద్వారా ప్రజలలో విష్ణుతత్త్వాన్ని భక్తి తత్త్వాన్ని పెంపొందించాడు.

# 4. అన్నమయ్య-ఆధ్యాత్మిక తత్త్వం

తెలుగు ప్రాంతానికి సంబంధించినంతవరకు మధురభక్తి మార్గానికి ఆద్యుడు తాళ్ళపాక అన్నమాచార్యులు. మధురభక్తిని మోక్షమార్గంగా నిర్ణయించి, సంకీర్తనల ద్వారా దానిని ప్రచారం చేసినవాడు అన్నమయ్య. ఉత్తరభారతదేశంలోని చైతన్యుని మార్గంలో అనేకమంది వాగ్గేయకారులు మధురభక్తిని సాధనంగా చేసుకొని నడుస్తున్నారు. వీరందరికీ వారధిలా నిలిచి, వీరి సిద్ధాంతాలను ఏకతాటిమీదికి తీసుకొని వచ్చినవాడు ఆంధ్రుడైన వల్లభాచార్యులు. వీరు అన్నమాచార్యుల సమకాలీనులు. కనుక తప్పక వీరి ప్రభావం అన్నమయ్యపై ఉండవచ్చు. చైతన్యుడు శిఖరాయమానం చేసిన రాధాకృష్ణ ప్రేమ తత్త్వానికి రాధాకృష్ణులను దంపతులుగా మలచి సామాజిక ఆమోదాన్ని జోడించినవారు వల్లభాచార్యులు.

భక్తి వాగ్గేయకారులందరూ క్షేత్రానికి ప్రాధాన్యం ఇచ్చారు. చైతన్యుడు తన సిద్ధాంతాలకనుగుణంగా మధురను తిరిగి నిర్మించాడు. నామదేవుడు పండరిపురాన్ని, అన్నమయ్య తిరుపతిని తమ ఆశ్రయ కేంద్రాలుగా చేసుకున్నారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వరుని, అతని శ్రీతత్త్వమైన అలమేలుమంగను నాయకానాయికలుగా గ్రహించాడు అన్నమయ్య.

## అన్నమయ్య-దార్శనిక నేపథ్యం

దార్శనిక సిద్ధాంతాలకు సంబంధించి అన్నమయ్య రామానుజులు ప్రవచించిన విశిష్టాద్వైత దర్శనానికి చెందినవాడు.

> **తేటలెన్నైనా గలవు చదువులందు**
> **తేటగా రామానుజ తెరిచె వేదములలో** **(3-415)**

అని రామానుజుల సిద్ధాంతాన్ని తనకు అంగీకారమైన మార్గంగా ఎన్నుకున్నాడు. రామానుజుల సిద్ధాంతాన్ని సంకీర్తనల రూపంలో సులభంగా అందరికీ అందుబాటులో ఉండే విధంగా నిర్వచించి చూపాడు. కఠినంగానూ, సామాన్యులకు అర్థంకాని భాషలోనూ ఉన్న దార్శనిక భాష్యాన్ని సంకీర్తన రూపంలోకి తీసుకొని వచ్చాడు. పరబ్రహ్మ, జీవుడు, జగత్తు వీటి సంబంధం ఉత్పత్తులు-మోక్షమార్గం-సాధనం అన్నింటినీ సంకీర్తనలలో పొందుపరచాడు.

## పరబ్రహ్మ స్వరూపం

విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని అనుసరించి పరబ్రహ్మం సర్వవస్తువులకు ఆత్మ. జీవులకు ప్రకృతికి గూడ అతడే ఆత్మ. అవి అతనికి శరీరభూతమై ఉంటాయి.

**వునికై బ్రహ్మాండము వొళ్లై నీకై వుండగాను (11-16)**
**వొట్టి ప్రకృతి పురుషులొగి నీ దేహములు (3-524)**

సకల దేవతలు కూడ అతని అంగభేదాలు మాత్రమే.

**కలరు దేవతల బహుగతుల మహిమల మెరయ**
**అలరి వారెల్ల నీయంగ భేదములే (3-544)**

అతడు సర్వాంతర్యామి. జీవబ్రహ్మలకు అభేదం చెప్పిన అద్వైతాన్ని అన్నమాచార్యులు అంగీకరించలేదు.

**పరగు బ్రహ్మాదులు బ్రహ్మమే తామనలేరు**
**హరికే మొర పెట్టేరు ఆపదైతేను**

**ధరలో మనుజులింతే తామె దయివమనేరు**
**పోరి దాము చచ్చి పుట్టే పొద్దెరగరు (3-40)**

బ్రహ్మాది దేవతలే పరబ్రహ్మం తాముగా భావించలేదు. కనుక 'అదినీవే' అన్న భావాన్ని ఖండించాడు. అదే నీవైతే బద్ధుడెవడు? ముక్తుడెవడు? అని ప్రశ్నిస్తాడు.

**అంతా బ్రహ్మమైతే నాతుమావొక్కటియైతే**
**చింతింప గురుడు లేడు శిష్యుడూ లేడు**
**బంతినీ ముక్తుడూ లేడు బద్ధుడూ లేడిట్లయితే**
**వంతుల సత్కర్మ మెల్ల వఱత పాలాయబో (3-65)**

అది కాని పక్షంలో జీవునికి, పరబ్రహ్మానికి ఉన్నసంబంధం ఎటువంటిది? అనే ప్రశ్నకు సమాధానంగా జీవులు ప్రకృతి భగవంతునికి శరీరరూపులు. భగవంతుడు సకలప్రాణులకు ఆత్మ. అతి సూక్ష్మమైనది ఆత్మ. అణు ప్రమాణమైనది.

**జీవుడు**

జీవపరమాత్మల సంబంధం గురించి అన్నమయ్య ఈ విధంగా అంటాడు.

**అతి సూక్ష్మమాయాత్మ అందులో హరి యున్నాడు.**
**కతలే వినుట గాని కానరాదు (3-211)**

**జీవుడణువు జ్ఞానము చింతించగా విభువు**
**ఈ విధముగా నానా జీవులివే నీ యందే (3-524)**

ఇట్టి జీవుని ఉత్పత్తికి భగవంతుని సంకల్పమే నిమిత్త కారణం. జీవుని పుట్టుక భగవంతుని కుక్షినుండి ఏర్పడినదే. కనుక అంతర్యామి తత్త్వం కలిగిన భగవంతుడు ఈ దేహంలో కూడా ఉన్నాడు.

**చేకొని నీవు పెరరేచిన యీ చైతన్యము**
**పైకొని ఆ కర్మముల పాలు సేయదగునా**
.... .... .... .... ....
**యెంచగ నీకుక్షిలోన నెత్తిన యీ జన్మము**
**కొంచెపు భోగములకు గురి సేయవలెనా (3-55)**

పుట్టేవాడు జీవుడు. పుట్టించేవాడు భగవంతుడు. అతని మాయలో బ్రతికేవాడు జీవుడు. భగవంతుని నిర్మితమే జీవుడు. ఈ సంబంధంలో ఎంతో అంతరముంది. అతని రూపాన్ని ఊహించడం ద్వారా దీనిని తెలుసుకొనవచ్చు - అంటాడు అన్నమయ్య.

**పొడమిని జగములు పుట్టేటి జగములు**
**గుడిగొనె మీ రోమకూపముల**
**యెడయక నీరూపమేనని ధ్యానింతు**
**అదరి మీ వాడ నేననుటే కాక (3-116)**

గతించిన బ్రహ్మలు, రాబోవు బ్రహ్మలు అందరూ అతని నాభిలో నుండే ఉద్భవిస్తున్నారు. కనుకనే జీవుడు తాను నిమిత్తమాత్రుడు అనే జ్ఞానం పొందగలగాలి.

**కారణమాతడు దా కార్యమాత్రమింతే**
**శూరుడై రెంటా జొరక చూచుటే సుఖము (3-132)**

జీవుడు తన స్వరూప జ్ఞానాన్ని తాను భగవంతుని శరీర భూతంగా ఉన్నవాడను అనే జ్ఞానాన్ని మరవడమే అవిద్య. ఇది కర్మబంధ కారకం. కనుక తాను స్వతంత్రుడను అనే భావన వదిలివేయాలి. భగవంతుని నుండి జీవుని బుద్ధిని తిరోధానం చేయగల శక్తి అవిద్యలకు ఉంది. అవి జీవుని వదలక వెంటనంటి ఉంటాయి.

**ఈ మురికి దేహమేనా యెంత గాలమైన నేను**
**వోముకొంటా భువిమీద నుండ గోరేది**
**దోమటి నింద్రియాలేకా తోడునీడయై నన్ను**
**వేమరు భోగించ జేసి వెనుబలమైనవి. (3-288)**

కర్మ తరువాతి జన్మలకు కారణమవుతున్నది. ఈ మనసే కదా ఆశలాశలలో తిప్పుతుండేది అని అంటాడు అన్నమయ్య. ఈ ప్రపంచంలో పుట్టినది వీనికే చెందుతుంది. కాని మోక్షం వైపుకు మొగ్గుచూపదు ఎందుకంటే-

**ప్రకృతి బుట్టిన దేహి ప్రకృత గుణమే కాని**
**వికృతి బోధించబోతే విషయమింతే కదా (3-123)**

అంతేకాదు, పంచేంద్రియాలు, సంసారం అతని లీలలోనివే కనుక జీవుడు వాటికి వశుడౌతాడు. కాని బయటపడగలడా? అనే సందేహాన్ని అన్నమయ్య ఇలా సమర్థిస్తాడు.

**పంచేంద్రియములు నాపై బంపు వెట్టితివి నీవు**
**యెంచి వానినే దండించేదిది-నేరమౌగాదో**

పెంచేటి తల్లి దండ్రులు ప్రియమై వడ్డించగాను
కంచము కాలదన్న సంగతి యాబిడ్డలకు

ఈ అవిద్యారూపాలైన కామక్రోధాలు, ఇంద్రియాలు, ఆశలు, మాత్సర్యాలు, భగవంతుని తెలుసుకోనివ్వకుండా ఎలా అడ్డుకుంటున్నాయో అన్నమయ్య ఈ విధంగా తెలుపుతున్నాడు. మదం, అజ్ఞానం అనే అంధకారాలను కారణాలుగా చూపాడు.

ధనమదమిదె నన్ను దైవము నెఱగనీదు
తను మదమెంతయు తపముజేయనీదు
ఘనసంసార మదము కలుషము బాయనీదు
మనెడి నామనువెల్ల మదము పాలాయ
పొంచికామాంధకారము పుణ్యము గాననీదు
కంచపు జన్మపు చిక్కు గతి చూపదు
పెంచి యజ్ఞాన తమము పెద్దల నెరగనీదు
చించరాని నా బుద్ధి చీకటి పాలాయ (3-30)

ప్రకృతిలో భాగమైన జీవుడు తనకు తానుగా బయటపడలేడు. కనుక తాను అస్వతంత్రుడు అన్న భావంతో అంతర్యామియైన భగవంతుని శరణు అనడం ఒక్కటే మార్గాంతరం.

అంతరాత్ముడై హరి పొడిచూపగ
వంతపు కర్మపు భయమేది
సంతత మాతడే స్వతంత్రుడిదివో
కొంత కొంత మరి కోరెడిదేది (3-25)

రామానుజ మతానుసారంగా శరణాగతి ఒక్కటే విముక్తిమార్గం. శరణాగతి ఆత్మ సమర్పణ యోగానికి జీవుని ప్రోత్సహిస్తుంది. సమర్పణం వల్ల జీవుని రక్షించుకొనే బాధ్యత భగవంతుని మీదనే ఉంటుంది. ఈ భావాన్ని అన్నమయ్య చాలా సులభమైన దృష్టాంతాలతో పేర్కొంటాడు.

**ఇల మీద తమ సొమ్ము లెవ్వరి వద్ద నుండినా**
**తలపిడి కొలుపిడి తగిలినట్టు**
**తొలుత పంచేంద్రియపుదొంగల వద్దనున్నాడ**
**వెలయ నీ సొమ్మనుచు విడిపించుకొనవె (2-5)**

**దిక్కుమాలినట్టి వారిదెచ్చి దయగలవారు**
**దిక్కయి కాతురు వారి దిగదోయరు**
**తక్కక మాయలోబడి దరిదాపులేని నన్ను**
**వెక్కసాన రక్షించక విడిచేవా నీవు (3-70)**

శరణాగతిని కోరిన జీవులపై భగవంతుడు అమిత అనుగ్రహం గలవాడుగా విశిష్టాద్వైతం చెబుతుంది.

అతని అంతర్యామిత్వాన్ని అంగీకరించినందువల్ల జీవుని వెంట ఉంటాడు. అతనికే కర్తృత్వం ఇవ్వడం వల్ల రక్షణభారం వహిస్తాడు. భగవంతుని శరీరభూతునిగా జీవుడు భావించడం వల్ల సంస్కరించే బాధ్యత అప్పగించబడింది. ఈ భావాలను అన్నమయ్య ఇలా వ్యక్తీకరిస్తాడు.

**హరి నీవు నాకు నంతర్యామివైన ఫలము**
**తిరిగినందే మావెంట దిరిగెదవు**

ఇరువుగ నీవు మాకు నేలికవైన ఫలము
గరమె మా పాపమెల్ల గట్టి కొంటివి-

భువిలోన నీవు నన్ను బుట్టించిన ఫలము
ఇవల రక్షించే తొడిపి దొకటాయ
తివిరి నన్ను నీకుక్షి దెచ్చికొన్న ఫలము
జవళి నానేరములు చక్కబెట్టబడెను (3-59)

జీవునిపై భగవంతునికి అనంతమైన అనుగ్రహం ఉంది. పావనులు గమ్మని గంగను, పాతకాలు తొలగించుకొమ్మని తులసిని, కొలుచుకొనుమని శిలామూర్తులను భవహరణం కోసమని నామాన్ని ప్రసాదించాడు అంటాడు అన్నమయ్య. భగవంతుని కృప పొందడానికి అతడు జీవుని తన వర్గంలోని వానిగా భావించవలసి ఉంటుంది.

గట్టు చూపె తొల్లతన గుణము పాండవులందు
గట్టిగా తన వారైతే కాచుకుందు ననుచు (3-251)

ఈ పక్షపాతం భగవంతునికి గల దోషగుణంగా పైకి కనిపిస్తుంది. దీనికి అన్నమయ్య వైష్ణవ సిద్ధాంతపరమైన సమాధానం చూపిస్తాడు. కొందరిపై కోపం, కొందరిపై ప్రసాదం, కొంత చీకటి, కొంత వెన్నెలకు కారణం వారు చేసిన పుణ్యమే అంటాడు.

దాస పరిపాలనము తగు దుష్ట శిక్షణము
వాసి గైకొంటివి నీకు వశమై రెండు
దోసము నీవల్ల లేదు తొలుతే శ్రీ వేంకటేశ
సేసినవారి పుణ్యమే చిత్తాన బెట్టితివి (3-43)

భగవంతుని కృపవల్లనే కైవల్యం లభిస్తుంది కాని దానికై జీవుని ప్రయత్నం అవసరం. జీవునికి కొన్ని నియమాలు విధించబడ్డాయి. వాటిని అన్నమయ్య ఈ విధంగా తెలుపుతాడు.

**ఊరకే కలుగునా వున్నతపు మోక్షము**
**శ్రీరమణు కృపచేత జేరు మోక్షము**
**కలుషము బెడబాసి కర్మగండముగడచి**
**మలసినప్పుడుగా మరి మోక్షము**

**చలన మించుక లేక సంసార వారధి దాటి**
**నిలిచినప్పుడుగా నిజమోక్షము (2-505)**

పంచేంద్రియాలను జయించాలి. సమచిత్తాన్ని పొందగలగాలి. అప్పుడు భగవంతుని ఆదరణ మన్ననలతో మోక్షప్రాప్తి కలుగుతుంది. వీటిని సాధించడానికి తరణోపాయాలను అన్నమయ్య సూచించాడు.

**పాపములు హరినామ పఠనచే బాపుకొంటి**
**కైవుగ జిత్రగుప్తుడా కవిలెగట్టు**
**కోపుల పుణ్యములెల్ల గోవిందునికిచ్చితిమి**
**పూపల స్వర్గము త్రోవ భుజవేయరో (2-145)**

హరి దాస్యం వల్ల జీవన్ముక్తిని, అజ్ఞాన నాశనం వల్ల జన్మ రాహిత్యాన్ని పొందగలరని చెబుతాడు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ననుసరించి పురుషార్థాలు ఐదు - ధర్మ, అర్థ, కామ, కైవల్య, భగవత్ప్రాప్తులు, స్వస్వరూప ప్రాప్తియే కైవల్యం, మోక్షం దానిపైన ఉన్నది భగవత్ప్రాప్తి. దీనివల్ల జీవునికి భగవత్ కైంకర్యం కలుగుతుంది.

**కైవల్యమున కంటే కైంకర్య మెక్కుడు**
**శ్రీవిభుడ నీవు మాకు జిక్కె మర్మమిదివో(2-483)**

అని సమర్థిస్తాడు అన్నమయ్య. దీని సాధనకు భక్తి ఒక్కటే మార్గం.

**నారదాదులగు భక్తులిందరును నానాగతుల రసి చూసి**
**సారపు శ్రీ వేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము**

కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులు అనే చతుర్విధ యోగాల చేత బ్రహ్మ ప్రాప్తి కలుగుతుంది. దీనిలో భక్తిగా పర్యవసించే జ్ఞానాన్నే విశిష్టాద్వైతం ప్రవచిస్తుంది. అన్ని మార్గాలను తరచి భక్తిమార్గాన్నీ, శరణాగతిని ప్రమాణమార్గంగా విశిష్టాద్వైతం పేర్కొంటుంది. హరి భక్తికి వేదాల, శాస్త్రాల ప్రమాణాలను విశిష్టాద్వైతం చూపుతుంది. సులభమైన భక్తిమార్గం ఉండగా ప్రయాసలతో నిండిన కర్మమార్గాన్ని విశిష్టాద్వైతం నిరసిస్తుంది.

**సులభపు మార్గములు చుట్టిరానే వుండగాను**
**బలు ప్రయాసపు కర్మబద్ధులైరి జీవులు**
**శ్రీపతి భక్తియనేటి చింతామణి వుండగాను**
**యేపున మోసపొయ్యేరు యేలో జీవులు (3-279)**

భక్తిమార్గాన్ని నిరసించి ముఖ్యంగా జ్ఞానమే ఉత్తమమైనదిగా భావించే అద్వైతాన్ని ఖండిస్తూ అన్నమయ్య-

**దుర్జనులు భక్తి నొల్లరు జ్ఞానులమంటా (3-40)**

అని విమర్శిస్తాడు. భగవంతుడు భక్తసులభుడు. కరుణించడానికి

తడవు చేయడు అని విమర్శిస్తాడు. భగవంతుడి దగ్గరకు తిరుమంత్రం తప్పక చేరుస్తుంది. ఈ భావాన్ని అన్నమయ్య ఇలా వ్యక్తీకరిస్తాడు.

సకల కర్మము చేత సాధ్యముకాని నీవు
వొక యించుకంత భక్తికొగి లోనైతి
ప్రకటించి బహువేద పఠన జిక్కని నీవు
యొకరివై తిరుమంత్రమునకు జిక్కితివి.
.... .... .... .... .... ....
ఉగ్రతపముల మెచ్చి కైకొనని నీవు
గాటపు దాసులైతేనె కైకొని మన్నించితి (3-56)

ఈ భక్తిమార్గం నియమాలు చాలా ముఖ్యమైనవి. ఇవి పరమ యోగీశ్వరులు పాటించినవి.

మొదల నాత్మజ్ఞానము దెలిసి పిమ్మట
హృదయములోని హరి నెరుగుట
వుదుటైన ఇంద్రియాల నొడిసి వంచుకొనుట
గుదిగొన్న తనలో కోరికలుడుగుట
తన పుణ్య ఫలములు దైవము కొసగుట
పనివడి యతనిపై భక్తి చేసుట
తనివితో నిరంతర ధ్యాన యోగ పరుడౌట
మనసులో బ్రకృతి సమ్మంధము మరచుట
నడుమ నడుమ విజ్ఞానపు కథలు వినుట
చిదుముడి నాచార్య సేవచేయుట

**యెడయక శ్రీ వేంకటేశుపై భారము వేసి**
**కడు వైష్ణవుల కృపగలిగి సుఖించుట (3-212)**

మిగిలిన మార్గాలు-జపయజ్ఞాలు, తీర్థస్నానాలు, కాలానుష్ఠాలు- పరిమితమైన ఫలితాలను ఇచ్చేవి. జపయజ్ఞ దాన కర్మలు చిరకాల ఫలాలు పుణ్యతీర్థ స్నానాలు పాపవిమోచాలు, అపరిమిత దేవతాంతర భజనలు ఆయాలోక ప్రాప్తులు, ఉపవాసాది నియమాలు తపోనిష్ఠకు కారణాలు. ఇంద్రియనిగ్రహం తను ధరులకు కష్టమైనది. కనుక శరణాగతి మాత్రమే ఏకైక మార్గాంతరం అంటాడు అన్నమయ్య. (3-328)

కైవల్యం ఒక్కటే. దానికి ప్రయత్నించే వారందరూ జీవులే. స్త్రీలను కూడా జీవులుగా ప్రత్యేకంగా పేర్కొని కైవల్య ప్రాప్తిని బోధించాడు అన్నమయ్య.

**పాలితులు జీవులే పురుషులు జీవులే**
**తలప భావభేదములే కాని (2-78)**

అంటాడు అన్నమయ్య. ఆత్మార్పణం చేసుకున్న భక్తుని తనువు గుడిగా మారుతుంది. తలయే శిఖరమౌతుంది. హృదయమే పీఠం, చూపులే ఘనదీపాలు, పలుకులే మంత్రాలు. నాలుకే గంట చివరికి జీవుడు దాసుడుగా మారతాడు. (2-82)

**ప్రకృతి**

విశిష్టాద్వైతంలోని మరో తత్త్వం ప్రకృతి. ప్రకృతి జీవులకు ఆత్మవంటిది పరబ్రహ్మం. అతనికి శరీర భూతమైనవి ప్రకృతి, జీవుడు.

**వట్టి ప్రకృతి పురుషులొగి నీ దేహములు**
**అనంతమైన ప్రకృతి అఖిల వికారములై**
**పనివడి నీ మాయయై ప్రపంచమై**
**వొనరి జడమై యుండనొకచో దివ్యమై యుండు (3-524)**

వెలినున్న జగమెల్ల విష్ణుడ నీ మహిమే అని జగత్కారణుడని విష్ణువును పేర్కొని విశిష్టాద్వైత సిద్ధాంతాలను సూక్ష్మంగా సంకీర్తనలలో అన్నమయ్య పొందుపరచాడు. క్షితి, దేహాలు ప్రకృతికి చెందిన వికారాలు ఇది తెలుసుకొనడమే సుజ్ఞానం (3-211). ఈ సంబంధాన్ని మనసులో మరచుటే మార్గాంతరం.

**మోక్షమార్గం-మధురభక్తి తత్త్వం**

భగవంతుని చేరడానికి అన్నమయ్య మధురభక్తి మార్గాన్ని ప్రముఖంగా ఎన్నుకున్నాడు. 12-15 శతాబ్దాలలో ఈ మార్గం భారతదేశంలో అనేక చోట్ల ప్రవర్తిల్లింది. మధురభక్తి మార్గాన్ని అన్నమయ్య తన సంకీర్తనలలో సమర్థించాడు. శుద్ధాద్వైత ప్రవర్తకులైన వల్లభాచార్యులు అన్నమయ్య సమకాలీనులు. వల్లభుడు అప్పటికే ఉత్తర భారతంలో పుష్టిమార్గాన్ని ప్రవర్తింపచేశాడు. దార్శనిక నేపథ్యాన్ని మించి భక్తిలోని పుష్టిమార్గ గొప్పతనం ఈ సంకీర్తనలో ఇలా వెలువరించాడు.

**కమలాసనాదులు గానని నీపై**
**మమకారము సేయు మార్గము గలిగే**
**అమరేంద్రాదుల కందరాని నీ**
**కొమరైన నామము కొనియాడ గలిగే**

**సనకాదులును గాన జాలని నిన్ను**
**తనివోవ మతిలోన దలపోయ గలిగె**
**ఘన మునీంద్రాదులకు నగమ్యమై వున్న**
**నిను సంతతమును వర్ణింపగలిగె**
**వరమై దివ్యమై పరగిననీ**
**యిరవిట్టిదని మాకు నెఱుగంగ గలిగె (11-44)**

భగవంతుని పట్ల భయాన్ని, అణకువను, గౌరవాన్ని కాక మమకారం కలిగించేది పుష్టిమార్గం ఒక్కటే. ఈ మార్గం బ్రహ్మ, సనకాది మునులు ఎవరికీ తెలియనిది. ఈ మార్గం లభించడం, భగవంతుని వర్ణిస్తూ "నీ వారమై బతుకగలిగే ఈ జన్మము చాలదు? అంటాడు అన్నమయ్య. భగవంతునితో ఏర్పరచుకున్న బంధాన్ని ఇంకో సంకీర్తనలో ఇలా వర్ణిస్తాడు.

**మూవంక గొల్లెతలు మున్ను సేసిన తపము**
**కైవసమై ఫలించిన ఘన భాగ్యమితడు**
**వరముతో యశోద వసుదేవాదులకు**
**పరగిన కన్నుల పండుగీతడు (11-173)**

అటు గొల్లెతలను, ఇటు యశోదా వసుదేవాదులను తలచటం రాగాత్మికా భక్తిలో భాగమే. రూపగోస్వామి రాగాత్మికా భక్తిని రెండు విధాలుగా పేర్కొన్నాడు.

**సా కామా రూపా సమ్బన్ధ రూపా చేతి భవే ద్విధా**

1. కామరూపభక్తి 2. సంబంధారూపభక్తి. గోపికలు కామంతోను,

యశోదా వసుదేవాదుల తల్లిదండ్రి సఖులు అన్న అనుబంధంతోను భగవంతునికి చేరువయ్యారు. అందుకే వేదాలలోనూ నారదాదుల చేతనూ స్తుతింపబడిన ఈ విష్ణుకథ గొల్లెతలు చిలికిన చల్లలో వెల్లివిరిసింది- అంటాడు అన్నమయ్య. భగవంతుని పొందడం అన్నది వారి వారి కోరికను బట్టి ఉంటుంది. సర్వేశ్వరుడైన భగవంతుని వారి వారి పద్ధతులలో భావించారు అంటాడు అన్నమయ్య.

**పరమ యోగులకు భావనిధానము**
**అరయ నింద్రాదుల కైశ్వర్యము**
**గరిమ గొల్లెతల కౌగిట సౌఖ్యము**
**సిరులొసగేటి యీ వేంకటేశుడు**

**కలికి యశోదకు కన్న మాణికము**
**తలచిన కరికిని తగు దిక్కు**
**అలద్రౌపదికిని యావద్బంధుడు**
**చెలరేగిన యీ శ్రీ వేంకటేశుడు (11-2)**

మార్గం ఏదైనా సరే భగవంతుని కృపవల్లనే సాధ్యం అవుతుంది. అన్నమయ్య మాత్రం మధుర భక్తి మార్గాన్నే సమర్థించాడు.

**ఏదైన దేవుడు ప్రాణికియ్యక లేదు**
**పాదుగ నాతని మీది భక్తి సాధనము**

..... ..... ..... ..... .....

**దేహమే బంధకము దేవుడింతే మోక్షము**
**ఊహల రెంటికి మనసొక్కటే సాధనము (11-82)**

భక్తి, మనస్సు అనే రెండు సాధనాల ద్వారానే దేవుడు సాధ్యమవుతాడు అంటాడు అన్నమయ్య. ఎందుకంటే దేవుని పొగడే వేదాలు అనంతంగా ఉండగా ఒక జీవుడు అతనిని పొగడగలడా? అలాగే అతడిని పూజించే ఋషులు కోటాను కోట్లుండగా 'అలరి నిన్ను పూజించే యంతవాడనా' (3-337) అని అంటాడు అన్నమయ్య. కనుక చనువు ఒక్కటే మార్గంగా బోధిస్తాడు.

**ఆడుతా బాడుతా నీతోనట్టే ముద్దు గునుసుతా**
**వోడక నీ దండ చేరి వున్నారమయ్యా**
**ఆస దల్లిదండ్రి మోము యట్టె చూచి శిశువులు**
**యే సుఖ దుఃఖములు దామెరగనట్టు (3-390)**

అంటాడు. చనువువల్ల ఒక నిశ్చింత వస్తుంది. ఈ సంకీర్తనలో అన్నమయ్య దృష్టాంతాలన్నీ అటువంటి వాటినే చూపుతాడు. తల్లిదండ్రులుండగా పిల్లలు తమ సుఖ దుఃఖాలగురించి పట్టించుకోరు. ఏలినవారు చక్కగా పెడితే బంట్లు పరులను అడుగరు. అలాగే చేత చిక్కిన నిదానం ఉండగా కలిమిలేములనే కాదు దేనినీ పట్టించుకోడు జీవుడు. అందుకే

**గరిమ గోపికలు గావెలనన్నది**
**హరినీ సంభోగ మదియ పో (3-548)**

అంటాడు అన్నమయ్య.

అయితే భగవంతుని మీద ఉన్న ఈ వలపు సామాన్యమైనది కాదు. లౌకిక శృంగార కామాలకు సంబంధించినది కాదు. ఈ వలపు భావనలోని తీవ్రతను, ఉదాత్తతను ఈ విధంగా అన్నమయ్య విశదీకరిస్తాడు.

**పాపమెరుగదు వలపు భయమెరుంగదు వలపు**
**రూపెరుంగదు మతికి రుచిసేయు వలపు**
**పూ పవయసున పండు వొడమించునీ వలపు**
**తీపులకు గడుదీపు దినదినము వలపు**

**సిగ్గెరుంగదు వలపు శిరము కెక్కును వలపు**
**వొగ్గించు నన్నిటికి వొడిగట్టు వలపు**
**బగ్గనను నటుగుండె పగిలించు నీ వలపు**
**అగ్గలపు జాణలకు నాయమీ వలపు**

**తెగువ దెచ్చును వలపు తేలించు నీ వలపు**
**యిగిరించి కలిమిలే మెఱగదీ వలపు**
**పగల శ్రీ వెంకటేశ్వరు మాయలీ వలపు**
**తగులు విరికాని వలె దగించు వలపు** (3-400)

లౌకికమైన వలపు భావనలో ఇవి ఎలా అన్వయిస్తాయో, ఆధ్యాత్మిక భావనలోనూ అంతకు రెట్టింపు అన్వయించి మధురభక్తి తత్త్వాన్ని సమర్థిస్తాయి. పాపం తెలీదు. భయం లేదు. తక్కువ సమయంలోనే పరిణితిని కలిగిస్తుంది. కోరిక తీవ్రత దేహాన్ని దహిస్తుంది. తెగింపునిస్తుంది. ఇటువంటి వలపును మించినది వేరొకటి లేదంటాడు అన్నమయ్య.

ఇది గాక సౌభాగ్య మిదిగాక తాపము మరి
యిదిగాక వైభవంబిక నొకటి కలదా

అతివ జన్మము సఫలమై పరమ యోగివలె
నితర మోహాపేక్ష అన్నియును విడిచె
సతి కోరికలు మహా శాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసన వోలె నుండె

తరుణి హృదయము కృతార్థత బొంది విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయ
నరసిజానన మనో జయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ

శ్రీ వేంకటేశ్వరుని జింతించి పరతత్త్వ
భావంబు నిజముగా బట్టె జెలియాత్మ
దేవోత్తముని, కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ (12-17)

అన్ని మోహాలు త్యజించి భగవంతుని పైననే మోహాన్ని నిలపడం వల్ల పరమ యోగత్వాన్ని ఆ యోగిని సాధించినది. హృదయాన్ని భగవదర్పణం చేసి నిశ్చలత్వం పొందినది. దీనివల్ల పరతత్త్వ భావం చెలి ఆత్మలో పుట్టినది. భగవంతుని కృపకు పాత్రమైన మనసు స్థిరమైనది. ఇంతటి స్థితికి జీవుని కొని పోయే మధుర భక్తి తత్త్వాన్ని కన్నా గొప్పదైన తపస్సులు ఇకలేవు అని ఉద్ఘాటిస్తాడు- అన్నమయ్య. గోపికలు చూపే కామభక్తికి మూలం భగవంతుని సుఖింపచేయడమే- అంటాడు

రూపగోస్వామి. అదే భావనతోనే అందరివలె లేక ఇతర మార్గాల వలె కాదు. కేవలం నీమేను మరపించడం కోసమే నేను ప్రయత్నిస్తాను.

**ఇతరులవలె నన్ను నెంచకురా నీ**
**మతి చొచ్చి నీ మేను మఱపింతునోరి** **(12-10)**

అని అంటాడు అన్నమయ్య. మధురభక్తి తత్త్వాన్ని తన ఆధ్యాత్మ సంకీర్తనల రూపంలో వెలువరించి శృంగార సంకీర్తనలలో ఆ తత్త్వానికి లక్ష్యాల వంటి సంకీర్తనలను సమకూర్చాడు.

**మారు చేతులీయవద్దు మరుగాళ్ళీయవద్దు**
**బీరాన గుండెలు గోసి పెట్టవద్దు**
**గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు**
**ఊరకే మీవారమని వున్నజాలు** **(11-62)**

అని 'జీవాల చంపవద్దు' అంటూ భక్తిలోని హింసను నిరసించి ఊరకే నీవారమనే శరణాగతిని, నీ కోసమేననే మధురభక్తి భావనని ప్రవచించాడు అన్నమయ్య.

# 5.అన్నమయ్య-అష్టవిధ నాయికలు

అవస్థాభేదాల చేత నాయికలు ఎనిమిది విధాలవుతారు. ప్రవర్తనా వైవిధ్యాన్ని అనుసరించి నాయికలను అష్టవిధాలుగా విభజించడం జరిగింది. ఈ విషయాన్ని గురించి శ్రీవేదం వేంకటరాయశాస్త్రిగారు ఇలా అన్నారు.

**"మఱియు శృంగార శంభు సంభావితాష్ట**
**తనవులన నీ మృగాక్షులు వినుతుగాంతు**
**రష్ట విధ భేదముల"**

శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు ఇలా పేర్కొన్నారు-

వరుడు కైవసమైన వనిత స్వాధీన భ
ర్తృక ప్రియాగమవేళ గృహము దనువు
సవరించు నింతి వాసక సజ్జ పతిరాక
తడవుండ నుత్కంఠదాల్చు నింతి
విరహోత్క సంకేత మరసి నాథుడు లేమి
వెసనార్తయౌ కాంత విప్రలబ్ధ
విభుడన్య సతి బొంది వేకువ రాగుందు
నబల ఖండిత యల్క నధిపుదెగడి
అనుశయము జెందు సతి కలహాంతరిత ని
జేశుడు విదేశ గతుడైన గృశత దాల్చు
నతివ ప్రోషిత పతిక కాంతాని సరణ
శీల యభిసారికాఖ్యయై చెలువు మెఱయు

**స్వాధీన పతిక :**

ఈ నాయిక గురించి వివిధ అలంకారికుల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

**శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు -**

"భర్త తన యధీనుడై యున్న యువతి స్వాధీన భర్తృక లేక స్వాధీన పతిక. పర స్త్రీలను కాంక్షింపక తన యందే యనురక్తుడైన పతి గలది" అన్నారు.

**శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు -**

"కాంతుడు రతిగుణా తృష్ణుడై ఎవతె చెంతను బాయడో విచిత్ర విభ్రమాసక్త అయిన ఆ నాయిక స్వాధీన పతిక యనబడును." అని పేర్కొన్నారు.

**శ్రీవడ్డికవి దృక్పథం ఇలా ఉంది -**

**అధిపు డనిశంబు స్వాధీనుడై యెసంగు**
**తరుణి స్వాధీన పతికగు దాని చేష్ట**
**లంగభవ మహోత్సవ మదా హంకృతి వన**
**విహరణ మనోరథా ప్త్యాది విధము లగును**

**శ్రీపోణంగి శ్రీరామ అప్పారావుగారు ఇలా వివరించారు.**

"నాయకుడు సురతాతి రసబద్ధుడై తన పార్శ్వమందుండగా అధికమగు హర్ష సౌభాగ్య అభిమానములను కలిగియుండు నాయిక స్వాధీన భర్తృక అనబడును."

**సారాంశము:**

ఈ నాయిక భర్త అనురక్తిని పొందినదై ఉంటుంది. నాథుడు పరకాంతాసక్తుడు కాకుండా అనవరతం తనపట్లనే అత్యంత ఆదరణను, ప్రగాఢ మోహాన్ని కలిగిఉండేటట్లు చేసుకునే చాతుర్యం, సమర్థత, దక్షత కలిగిన ప్రణయిని ఈ నాయిక.

అన్నమయ్య శృంగార సంకీర్తనలలో ప్రధాన నాయిక అలమేలు మంగ. ఈమె దివ్య కాబట్టి అలమేలుమంగ, శ్రీనివాసులది దివ్య ప్రణయం. ఈమె తన సౌందర్య వినయ విలాసాదులతో కాంతుని కైవసం చేసుకుని కనుసన్నలలో నిలుపుకుంటుంది.

**ఎటువంటి మోహమో యింతి నీపై నతనికి**
**తటుకన సురమున ధరియించె నిన్నును ॥పల్లవి॥**
**నెలత నీ నిలయము నీరజమనుచుఁ బ్రియ**
**మలరి జలజనాథుడాయ నతడు**
**నిరతి నలమేల్మంగ నీ కురులు నలుపని**
**అరుదార నీవర్ణుడాయనతడు**

**సంపుటం:23, సంకీర్తన:1**

ఈ కీర్తనలో నాయిక బాహ్య సౌందర్యాభిమాని అయిన నాయకుని భావగర్భిత చెయిదాలు వర్ణితమయ్యాయి ఈ నాయకుడు నాయిక. గుణాకృష్టుడు తన్మూలంగానే ఆమెకు ఉరముపై చోటిచ్చి పురస్కరించాడు. ఈ నాయిక పతిని స్వాధీన పరచుకుంది. నాయకుడు నాయిక సౌందర్య సారూప్యాలైన శంఖ చక్రధారణతో విచిత్ర విభ్రమాసక్త అయిన నాయికను బాహ్యాభ్యంతరంగాల్లోనూ ధరించి ఆమె ప్రగాఢ

సాన్నిహిత్యాన్ని ప్రకటించడంతో ఈమె స్వాధీన పతిక. నాయకుని రూప చేష్టా విలాసాలు నాయికపై అతనికి గల మోహానికి సంకేతాలుగానూ, ఆంతర్యాన్ని వెలువరించేవిగాను ఉన్నాయి.

**బాహ్యార్థం :**

భక్త సులభుడైన భగవంతుడు తనకు దాస్యం చేసే వారికి తాను అపార వాత్సల్యంతో దాసుడై వారి మనోభావాలకు అనుగుణంగా మారిపోతాడు.

**చెలులార యిదెవో నే జేసినది భాగ్యము**
**కలిగె దన కరుణ కడమ లింకేటికే! ॥పల్లవి॥**

**మన్నించి తానే నాపై మచ్చిక గలిగుండగా**
**విన్నపమేమి సేసే నీవేగినంతాను**
**కన్నులెదుటను తాను కైవసమై మెలగీని**
**సన్నలిత నేటికి సారె సారెకు**

**సంపుటము:18, సంకీర్తన:111**

నాయిక అయిన అలమేలు మంగ పతికి తనపై గల అవ్యాజ ప్రేమానురాగాల్ని గురించి, తన అన్యోన్య దాంపత్యాన్ని గురించి చెలులతో ముచ్చటిస్తుంది. మగని కరుణను పొందగలగడం తన పుణ్యఫలమని, అతను తన పట్ల సమ్మోహితుడై నిడువ జాలక యెట్టయెదుటనే మసలుకుంటున్నాడని గర్వంగా చెప్పుకుంటుంది.

అడగకుండా అన్ని కోరికలను, ఆశలను సంతృప్తి పరచే విభుని సాంగత్యంలో తనకు ఎలాంటి వెలితి లేదనీ, ఇటువంటి అనుకూలుడైన

భర్తతో సహజీవనం తనకు వరమనీ చాటుకుంటుంది. కాబట్టి ఈమె స్వాధీన పతిక.

**వాసక సజ్జిక :**

ఈ నాయికను గురించి ఆలంకారికుల అభిమతాన్ని పరిశీలిద్దాం. వడ్డి కవి వరేణ్యుడు ఇలా పేర్కొన్నాడు:

**ప్రియుడు వచ్చు దినంబని గృహము తనువు**
**జక్కని నిడుబోటి వాసక సజ్జ యగును**
**చేష్టలరయ దూతీ ప్రశ్న చెలుల వలని**
**హాస్యకలన మార్గ విలోక నాదులగును"**

**శ్రీవేదం వేంకటరాయశాస్త్రిగారు ఈ విధంగా వివరించారు :**

"ఎవతెకు సిద్ధమయిన పడకటింటి సఖి అలంకారము చేయునో ఆమె ప్రియుని రాకను ఎదురుచూచుచున్నట్టిది- వాసక సజ్జికయగును."

**శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు ఇలా వ్యక్తం చేశారు.**

"ఉచిత వాసకమునందు ( రాత్రి అంతయు నాయకుడు తనతో కూడి యుండుటకు తగినకాలమందు) రతి సంభోగ లాలసయై సంతోషముతో అలంకరించుకొను నాయిక 'వాసకసజ్జ' అనబడును"

**సారాంశము :**

ఈ నాయిక నాధుని ఆగమనాన్ని ఊహించి తన తనూ సౌందర్యానికి సర్వాలంకారాలతో మరింత లావణ్యాన్ని హత్తించి, గృహసీమను శోభాయమానంగా చక్కదిద్ది, ఉత్సాహోద్వేగాలతో అతని

రాకకోసం కనులింత చేసుకుని ప్రతీక్షిస్తుంది. అన్నమయ్య సంకీర్తనలలో వాసన సజ్జిక:

**ఏల సిగ్గులు పడేవుయెదుటికి గాగదవే**
**సోలిగా నీ సింగారాలు చూచుగాని యీతడు**
**కొప్పు పెట్టుకొంటివిగా కుప్పె సవరముతోడ**
**చిప్పిల బూసితివిగా చెంపలు నిండా జవ్వాది (1వ చరణం)**

**కట్టుకొంటివిగా చీర కళబెళ మనగాను**
**వొట్టు కొంటివిగా సొమ్ము లొళ్లు నిండాను (2వ చరణం)**

**సంపుటము-24, సంకీర్తన-290**

ఇక్కడ నాయికకు చెలి శిగ వేసుకోవడంలో, విరిదండలతో అలంకరించడంలో సహకరించింది. ఇలా సింగారించుకున్న నాయిక పడకటింటిలో నాయకునికి తడిమి లేపాలనే తమకంతో వేచి చూస్తోంది. కాబట్టి ఈమె వాసకసజ్జిక.

**బాహ్యార్థం :**

వివిధాలంకారాలతో సజ్జీకరించుకుని వాసగృహంలో పతిని వలపుల వలలో బంధించాలని ఎదురు చూడడం కనిపిస్తుంది.

**అంతరార్థం :**

మధుర భావ బంధుర హృదయులైన భక్తులతో మాత్రమే భగవంతుడు సఖ్యం చేస్తాడు. సర్వాలంకార సంశోభిత అయిన వాసకసజ్జికలా సుందర గుణ సంశోభితమనస్సులకు మాత్రమే ఆయన

స్పర్శన దర్శన భాగ్యాలు లభిస్తాయనడం అంతరార్థం.

**నీవు విచ్చే సేవనుచు నెలతతో జెప్పితేను**
**లేవె(?) గని పవ్వళించె వోవరి సింగారించె**
**అపటించి పరిమళాలాయిత్తుము సేసెను**
**మనుకొని ముంగిటను ముత్యాల ముగ్గులు వెట్టి**
**యెనలేని ఆరతులా ఇత్తముగ జేసెను**

**సంపుటము-24, సంకీర్తన-361**

నాథుని ఆగమన విషయాన్ని చెలియలు నాయికకు చేరవేశారు. పవ్వళించివున్న ఆమె ఉత్సాహంతో ఉదుటున లేచి సర్వాంగ సుందరంగా సింగారించుకుంది. పులకరించే హృదయంతో పరిమళాలను సమకూర్చింది. అతనికి ఆహ్వాన సంకేతాలుగా ముంగిట ముత్యాల ముగ్గులు వేసింది. పరమ పురుషునికి హారతుల్ని సిద్ధపరచింది. వల్లభుడు చేరవచ్చే వేళ తన తనువే ఆలయంగా అతని దివ్య స్పర్శకోసం తపిస్తూన్న ఈమె వాసక సజ్జిక.

**పచ్చదోరణాలు గట్టి పండుగనాటివలెనే**
**విచ్చేతువంటా నీకు విందాయిత్త పెట్టెను**
**తెలివ తన వరుస దినము దలచుకొని**
**గుటిగా బాన్పు పఅచుకొని వున్నది.**

**సంపుటము-26, సంకీర్తన-406**

ఈ నాయిక విభుని ఆహ్వానించడం కోసం చెలికత్తెలను పంపింది. అతని రాక ఆమెకు పర్వదినం. అందుకే గృహాన్ని పచ్చతోరణాలతో,

పూలమాలలతో కనులపండవుగా అలంకరించింది. షడ్రసోపేత విందుల్ని సిద్ధం చేసింది. కేళికా గృహంలో విరుల పాన్పును పరచింది. తానూ నిలువెల్లా సింగారించుకుని కళలు విరజిమ్ముతూ ఎదురు తెన్నులు సారిస్తూంది. కనుక ఈమె వాసక సజ్జిక.

**విరహోత్కంఠిత**

ఈ నాయిక లక్షణాన్ని గురించి అలంకారికుల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

**శ్రీ వడ్డికవి వివరణ ఇలా ఉంది.**

**అదిపుడింటికి రాకున్న నాత్మజింత**
**లలము సతి యుత్క చేష్టల నరతి భాష**
**ణాంగ జృంభణా కృష్టకం పాతిరుదిత**
**విదితముగ నాద్యవస్థలై విస్తరిల్లు**

**శ్రీసన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు ఇలా వివరించారు.**

"పతి చెప్పినవేళకురాక యాలస్యము సేయగా మిక్కిలి తహ తహ పాటుగొనునది విరహోత్కంఠిత. లేక విరహోత్క."

**శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు ఈవిధంగా పేర్కొన్నారు.**

"అనేక కార్య వ్యాసంగములచే ప్రియుడు రానిచో దుఃఖార్తయగు నాయిక విరహోత్కంఠిత అనబడును."

**సారాంశము :**

ఏ కారణంవల్లనైనా నిర్ణీత సమయానికి పతి ఆమె సమక్షానికి

చేరకపోతే అతని అనురాగ వీక్షణాలకోసం మురిపెపు పలకరింపుల కోసం. స్పర్శానుభూతికోసం ప్రతిక్షణం పరితపిస్తుందీమె. అతని తలపులతో లీనమై ప్రతి చిరుసవ్వడిని నాథుని రాకగా ఊహిస్తూ ఉత్కంఠతో వేగిపోయే సున్నిత సుకుమార మనస్వి ఈ నాయిక.

అన్నమయ్య సంకీర్తనలలో విరహోత్కంఠిత విరివిగా కనిపిస్తుంది. అయితే ఈ సంకీర్తనల్లో చాలా వరకు చివరి చరణాల్లో నాయికకు, శ్రీవేంకటేశ్వరుని తోటి సంశ్లేష అనివార్యంగా వర్ణితమవుతుంది. అటువంటప్పుడు నాయిక విరహోత్కంఠితగా మిగిలిపోయే అవకాశం లేదు. ఆమె విరహం తాత్కాలికం మాత్రమే. దివ్యుడైన నాయకుని సంకల్పాల్ని ఎవరూ త్రోసిరాజాలరు. కాబట్టి నాయికను కలుసుకో నెంచి ఉద్యుక్తుడైన నాయకుని ఆపగల అన్యులు లేరు. కార్యాంతరాలు దివ్యులకు ఆటంకాల్ని కల్పించలేవు.

**చెలి వీనుల జవ్వాది చెక్కుల గరగి జారీ**
**వెలి నిన్ను బాసిన విరహాసను (1వ చరణం)**

**మునుకొని యెరసినీ ముంజేతి కంకణములు**
**తనివార నిన్ను గూడే తమకమున**
**(3వ చరణం) సంపుటము-24, సంకీర్తన-110**

ఈ సంకీర్తనలోని నాయిక లక్షణాలు ఆమెను విరహోత్కంఠితగా సూచిస్తున్నాయి. నాయకుడు రాకపోవుటవలన ఆమె వీనుల జవ్వాది చెక్కుల మీదుగా కరిగిపోయింది. నిట్టూర్పుల గాలి చేత పూదండలలోని పుప్పొడి రేగి పోయింది. విభుని చేపట్టాలనే తపనతో నాయిక

కరకంకణాలు సవ్వడి చేస్తున్నాయి. హేమంత వేళ తత్తర పడుతున్న చెలి ప్రియసమాగమాయత్త అయి ఉత్తల మందుకున్న చిత్తంతో వేచి చూస్తోంది. కాబట్టి ఈమె విరహోత్క. విరహంతో పాటూ ఈమెకు నాయకుడు రాని కారణం మీద ఉత్కంఠ అగ్నికి అజ్యంలా తోడవుతుంది.

**బాహ్యార్థం :**

నాయకుడు నిర్ణీత సమయానికి రాకపోవడంతో ఆమె వేదనతో వేగిపోవడం, వ్యాకుల పడడం కనిపిస్తుంది.

**అంతరార్థం :**

జీవి భగవంతుని దర్శనం కోసం, దివ్య స్పర్శ కోసం తపించడం, కలవరపడడం వ్యక్తమవుతుంది.

**ఆరగించు మన గదరమ్మ లారా అయ్యో**
**నీరు పుక్కలించదివె నిన్నటనుండి**
**నిద్దుర గంటబెట్టదు నిన్నటినుండి**
**అద్దపు జెక్కులు వాడె నమ్మలారా అయ్యో**

**సంపుటము-12, సంకీర్తన-32**

తీవ్రమైన నాయిక విరహవేదనను చూసి చెలులు కలవరపడు తున్నారు. ఎదురు చూస్తూ నడి రాత్రి అయినా నిద్రపోకుండా కళ్ళలో వత్తులు వేసుకుని వేసారుతూంది. నిరీక్షణలో ఆమె వదనం వాడిపోయి, భోజన నిద్రాదుల లేమితో శరీరం శుష్కించి ఉంది. ఆపలేని వలపులతో రాత్రింబవళ్ళు మన్మథ తాపంతో రగులుతున్న ఈ నాయిక విరహోత్కంఠిత.

**విప్రలబ్ధ**

ఈ నాయికను గురించి అలంకారికుల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

**శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు ఇలా వ్యాఖ్యానించారు.**

"సంకేత స్థలమున తన ప్రియుడు లేకుండుటను గాంచి యార్తి వహించునది విప్రలబ్ధ."

**శ్రీ వేదం వేంటరాయశాస్త్రిగారు -**

"ప్రియుడు సంకేత మేర్పరచియు ఎవతె సన్నిధికిరాడో మిక్కిలి అవమానిత ఆమె విప్రలబ్ధయని యెఱుంగదగినది" అన్నారు.

**శ్రీ వడ్డికవి ఇలా వివరించారు.**

**ప్రియుడు సంకేత గృహమునబెరయకునికి**
**జింతులను విప్రలబ్ధ తచ్చేష్ట లశ్రు**
**పాత నిశ్వాస నిర్వేద భావ మూర్ఛ**
**నాశిజన కృతోపాలంభనాదులగును**

**సారాంశం :**

ఈ నాయిక ప్రియుడు సూచించిన సంకేత స్థలానికి వచ్చి అక్కడ అతడు లేకపోవడంతో బరువెక్కిన హృదయంతో వ్యాకులతను చెందుతుంది. అతను రాకపోవడంతో సంకేత స్థలంలోనే పరిపరి విధాల పరితాపం చెందుతుంది. ప్రియ ప్రాప్తి కోసం తల్లడిల్లుతుంది. విరహంతో మనోవైకల్యాన్ని పొందుతుంది.

అన్నమయ్య సాహిత్యం దివ్యశృంగార భూయిష్టం. కాబట్టి ఇక్కడ సంకేత స్థల ప్రసక్తి ఉండదు. నాయకుడు దివ్యుడు కావడం వల్ల సాధారణ నాయకులు సూచించినట్లు ప్రియురాలికి సంకేతాన్ని సూచించడు. ప్రియుడు రానిచో నాయిక నిరాశ చెందడం అన్నమయ్య సంకీర్తనల్లో ఉంది. అయితే అది సంకేతంలోనే జరిగిందనడానికి స్పష్టమైన సూచనలేమీ లేవు.

**ఎదురు చూచి యింతక యే మౌనో**
**హృదయము ఝల్లనీ నిటు దలచి**
**పొదల తీగెల యింట బొరలి యేమౌనో**
**మలసి వెన్నెల మంట మరి యేటి బ్రదుకు**

**(సంపుటము-12, సంకీర్తన-60)**

చెలికాని ఆగమనంకోసం నిరీక్షిస్తూ అతను రానందున నాయిక పొందే విరహావస్థ, వ్యాకులత ఈ సంకీర్తనలో వ్యక్తమవుతాయి. ప్రియునికోసం మన్మథవేదనతో ఆమె తీవెల పొదరిళ్లలో పొరలుతూంది. నిలువెల్లా నయనాలు చేసుకుని ఎదురు చూస్తోంది. తల్లడిల్లే హృదయంతో తలపోతల సెగలు ఎగజిమ్ముతూంది. ఈ వెన్నెల తీరాల్లో వేసవితాపం పొందుతూంది. ఈ రీతిగా నాయిక ప్రియ సమాగమం కోసం ఉవ్విళ్లూరుతూ వేచి వేచి ఉసురుసురంటూంది. ఇక్కడ తీవెల పొదరింటిలో నాయిక ఉంది కాబట్టి దానినే సంకేత స్థలంగా భావించాల్సి ఉంటుంది.

**బాహ్యార్థం :**

తనను సమర్పించుకోవాలని వేచివున్న నాయిక సూచించిన వేళకు ప్రియుడు సంకేతానికి రాకపోవడంతో నిర్భర తాప హృదయంతో నైరాశ్యానికి లోనవుతుంది.

**అంతరార్థం :**

పరమ పురుషుని సాక్షాత్కారం త్వరలోనే సంప్రాప్తిస్తుందని విశ్వసించిన యోగికి ఆ శుభ ఘడియలు దూరమైనప్పుడు ఏర్పడే పరివేదన ప్రతిబింబితమైంది.

**ఖండిత :**

ఈ నాయికను గురించి లాక్షణికులు ఈ విధంగా వివరించారు.

**శ్రీ వడ్డికవి ఇలా వివరణను ఇచ్చాడు.**

> **"నాథు దన్య సంభోగ చిహ్నాలను రేప**
> **కడ నరుగు దేర వగనొందు ఖండితదియు**
> **నస్ఫుటాలా పతాప చింతాతి రోష**
> **ముఖ్య చేష్టలచే జిత్తమున దపించు."**

**శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారి అభిప్రాయం ఈ విధంగా ఉంది.**

"ఉచిత వాసకమునందు (తనతో కలిసి యుండవలసిన సమయములో) ప్రియుడు ఇంకొక నాయికతో కలసియుండి తన యొద్దకు రానిచో దుఃఖార్తయగు నాయిక ఖండిత అనబడును."

అన్నమయ్య నాయకునిలో దక్షిణ నాయకత్వం ప్రకటిత మయ్యే

సన్నివేశాలు అనేకం ఉన్నాయి. అటువంటి సందర్భాలలో స్వీయ నాయిక కాఠిన్యాన్ని వహించి ఖండితగా రూపుదాల్చి, అక్షర చండికలా అతన్ని దుయ్యబడుతుంది.

**యెన్ని సుద్దులు చెప్పేవు ఇచ్ఛకమెంతసేవు**
**సన్నలేల చూపేవు సరసమే మాదేవు**
**యిన్నేసి నీ వేసాలు యెరగమానేము**
**యెప్పుడెవ్వరికో కౌగిలిచ్చి వచ్చి**
**రుచులుగా గూడితివి రొక్కము శ్రీవేంకటేశ**

**(సంపుటము-24, సంకీర్తన-438)**

నాయకుడు అన్యస్త్రీ సాంగత్య సంచిహ్నితుడై నాయికను సమీపించాడు. అది చూసిన ఆమె ఈర్ష్యా కషాయిత అయి అతని మాయ మాటలను, తప్పిదాన్ని, కప్పిపుచ్చుకునే చేతలను తూలనాడుతుంది. అతని కపట వ్యవహారాన్ని బట్టబయలు చేస్తుంది. కాబట్టి ఈ నాయిక ఖండితల కోవకు చెందుతుంది.

**బాహ్యార్థం :**

తన వాడనుకున్న వ్యక్తి పరవాడిలా తనకు దక్కవలసిన వలపులో ఇతరులకు భాగం పంచడాన్ని ఖండించే మనస్తత్వం కనిపిస్తుంది.

**అంతరార్థం :**

ఇతర ఆత్మల్ని ఉద్ధరించే పరమాత్మకు దివ్య సంయోగంతో తనకూ ముక్తిని ప్రసాదించమనీ పరమానందాన్ని ప్రసరించమనీ తపించే అఖండమైన జీవుడి వేదన వ్యక్తమవుతుంది.

**యెవ్వతె కస్తూరి బొట్టో ఇదె నీ నొసల నంటే**
**కుంకుమ గుబ్బల పూత గురిగా రొమ్మున నించె**
**పొంకపు చెవుల తట్టు పుణుగు బుజాల గారె**
**సమరతి చెమటలు చారలై నీమేన నిండె**

**(సంపుటము-27, సంకీర్తన-239)**

పరకాంతా సమాగమ సఫల మనోరథుడైన నాయకుడు వాస్తవాన్ని దాటవేస్తున్నాడు. అతని రాసలీలలు తనకు అవగతమేననీ, కప్పిపుచ్చుకోవడానికి వృథాప్రయాసపడవద్దనీ నాయిక తేటతెల్లం చేస్తుంది. అతని వదనంపై అందగిస్తున్న కుంకుమ ముద్ర లెవరివని దండిస్తుంది. జారి అతని భుజాలపైకి కారుతున్న తట్టుపుణుగు వివరమేమిటని నిశితంగా అడుగుతుంది. అతని శరీరమంతా స్వేదజలాలు చారలు కట్టి వున్నాయెందుకని నిలదీస్తుంది. కాబట్టి ఈమె ఖండితనాయిక.

**కలహాంతరిత**

ఈ నాయిక లక్షణాన్ని గురించి అలంకారికుల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

**వడ్డి కవీశ్వరుడిలా అన్నాడు -**

**పతిదెగడి మీద పరితాప భరము బూను**
**చెలియ కలహాంతరిత దాని చేష్టలరయ**
**భ్రాంతి సంతాప సమ్మోహ భాషణాది**
**చంచలా శ్వాస ముఖములై మించు మిగుల**

**శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు -**

" ఈర్ష్యా కలహము వలన వెడలిన ప్రియుడు మరలి రాకుండుటచే అమర్ష వశయగు నాయిక కలహాంతరిత" అన్నారు.

అన్నమయ్య సంకీర్తనలలో నాయిక చాలా వరకు గడసరితనం కలిగింది. భర్తను బంధీగా చేసుకుని తనచుట్టూ తిప్పుకోవాలనే స్వభావం కలిగిన జాణ. అలవిమీరిన అనురాగం వల్ల సులభంగా అపోహలకు లోనవుతుంది. ముందు జాగ్రత్తతో అతన్ని అదుపు చెయ్యాలని కలహిస్తుంది. ఇది సహించలేక విభుడు మరలిపోతే ఊహించని పరిణామానికి కలత చెందుతుంది. తన తొందరపాటుకు చింతిస్తుంది.

**మగువ నిన్న దూరి మనసు నొచ్చెనోయని**
**పొగులుచునటు చిన్నబోయి వున్నది**
**భామిని నీతో జెనగి పాదము దాకెనోయని**
**అముకొని అసురుసురయి వున్నది.**

**(సంపుటము-23, సంకీర్తన-225)**

ప్రణయకుపిత అయిన నాయికను అనునయించే యత్నంలో సరస సంభాషణలాడుతూ పాదపతనోత్సవాన్ని జరిపాడు నాయకుడు. మగణ్ణి లక్ష్యపెట్టక మొండికెత్తి నిరాశతో అతను వెళ్ళిపోగానే పశ్చాత్తాపచిత్తయి తల్లడిల్లిబోతున్న ఈ నాయిక కలహాంతరిత. ఈ సంకీర్తనలో సంధాన కర్తలెవరో నాయిక తదనంతర తాపాన్ని నాయకునికి వివరిస్తున్నారు.

**బాహ్యార్థం :**

వల్లభునికి తనపట్ల ఉన్న ప్రేమను పరీక్షించి నిగ్గు తేల్చుకోవాలనే

వాంఛతో అతని మీది వలపును ఎద లోపలే దాచుకుని కోపప్రటనం చేస్తుంది నాయిక. అనునయ వచనాలు ఫలించక నాయకుడు వెళ్ళిపోగా ఆమె తీవ్ర పశ్చాత్తాపానికి గురి అవుతుంది.

**అంతరార్థం :**

భగవతత్త్వం నిత్యం మన తలపుల్ని తడుతూనే ఉంటుంది. దాని పర్యవసానం పశ్చాత్తాపమే అవుతుంది.

**పదివేల మొక్కులు నీ పాదాలకు మొక్కేనిదే**
**యిదెనిన్ను వేడుకొనే నింటికి రావయ్యా**
**పొత్తుల మాటలు నిన్ను బొదిగి యేమాడితివో**
**చిత్తగించి నాపై దయసేయవయ్యా**
**చెనకి నిన్నేమేమి సేతలు సేసితినో**
**మనవి చే కొని నన్ను మన్నించవయ్యా**

**(సంపుటము-18, సంకీర్తన-74)**

ఈ సంకీర్తన అలమేలు మంగ స్వగతం. ఈమె పతిని ఉచితానుచితాలు ఎంచక తూలనాడడంతో అతను వెళ్ళిపోయాడు. ఆపైన ఆమెకు పశ్చాత్తాపం ప్రారంభమైంది. అపరాధ భావం ఆమె మనసును కలచి వేస్తొంది. పౌరుషంతో తానన్న మాటల్ని మన్నించమంటుంది. తొందరపాటుతో తను చేసిన చేష్టల్ని మనసున పెట్టుకోవద్దంటుంది. అనుచితంగా తప్పులెంచిన తన ధోరణికి లజ్జితురాలవుతున్నానంటుంది. అతన్ని అగౌరవపరిచి, అవమానించినందుకు వేవిధాల పాదాలకు మ్రొక్కుతాననీ, ఓర్పు వహించి

తనపై దయతో ఇంటికి రమ్మని వేడుకుంటుంది. కాబట్టి ఈమె కలహాంతరిత.

**ప్రోషితభర్తృక**

కార్యనిర్వహణాపరుడై పతి పరదేశానికి పయనమై వెళ్ళినపుడు విరహవేదనతో తల్లడిల్లే నాయిక ప్రోషితభర్తృక.

అన్నమయ్య సంకీర్తనల్లో ప్రోషిత భర్తృక లేదు. అన్నమయ్య నాయకుడు కొండల కోనేటి రాయడైన శ్రీవేంకటేశ్వరుడు. ఆయన విష్ణురూపుడు. దివ్యుడు మానవ మాత్రుడైన నాయకుడిలా నానాకార్యవశంపరుడై తన స్థావరాన్ని వదలి దూరదేశమేగడు. సర్వం విష్ణుమయం జగత్. ఇందుగల దందు లేడనే సందేహం అతనిపట్ల అనవసరం. కాబట్టి అన్నమయ్య నాయిక అయిన అలమేలుమంగ ప్రోషితభర్తృకగా మారే అవకాశం మృగ్యం. పతి విదేశగమనంతో విరహాన్ని అనుభవించే ప్రోషిత భర్తృకను అన్నమయ్య వర్ణించలేదు.

**అభిసారిక**

ఈ నాయికను గురించి అలంకారికులు ఇలా వ్యాఖ్యానించారు. అభిసారిక లక్షణాన్ని వడ్డికవి ఇలా నిర్వచిస్తాడు.

**తామె విభుడున్న యెడకైన దాపసించు**
**నిలయమున కాత డైనను నెమ్మి జేర**
**నరుగ నలు వంద బొల్చిన నవ్వ ధూటి**
**క్షితిని నభిసారి కనగ విశ్రుతి వహించు**

**శ్రీవేదం వేంకటరాయశాస్త్రి గారి అభిప్రాయం ఇలా ఉంది.**

"ఎవతె మదన వశంవదయై కాంతుని తన కడకు రప్పించుకొనునో లేక తానే అతని కడకుబోవునో ఆ నాయికను పండితులు అభిసారిక యందురు."

**శ్రీచర్ల గణపతి శాస్త్రిగారు ఇలా వివరించారు.**

"కామవశమై ప్రియుడు చెప్పిన సంకేత స్థానమునకై బోవునది అభిసారిక. ప్రియునికై అభి ఎదురుగా సరించునది పోవునది అని వ్యుత్పత్తి."

**సారాంశం**

ఈ నాయిక గాఢమైన మోహాతిశయముతోను, రత్యాకాంక్షతోనూ ప్రియుడున్న ప్రదేశానికి ప్రణయ సంచారాలు చేస్తుంది. కొన్ని సందర్భాలలో తన వద్దకే అతన్ని రప్పించుకుంటుంది. ఈమె లజ్జాశంకాదులను వదలి నిర్భయంగా చరిస్తుంది. అభిచరించే సమయ సందర్భాలను అనుసరించి వేష భూషణాల విషయంలో శ్రద్ధ వహిస్తుందీమె.

అన్నమయ్య నాయకుడు దక్షిణ నాయకత్వాన్ని నెరపడంలో సిద్ధహస్తుడు. పలువురు కాంతలతో సంబంధ బాంధవ్యాలున్న అతను వారి వద్దకు రాకపోకలు సాగించడం, ప్రేమాతిశయంతో వారే అతన్ని వెదుక్కుంటూ చేరడం పరిపాటి.

**వాసికి గొంగుపట్టేవు వడి నీవు గొల్లెతల**
**యింటికి రప్పించుకొంటి విట్లా బదారువేల**

**(సంపుటము-27, సంకీర్తన-130)**

ఇక్కడ నాయకుడు గొల్లెతల కొంగు పట్టాడు. ఈ భావనలో మదనవశంవద ఎదలతో గొల్లెతలు వేంకటేశుని కొంగున ముడివేసుకున్నారు. అతను పదహారువేలమంది గోపికలను ఇంటికి రప్పించుకున్నాడనడంలో రత్యాసక్తలైన గోపికలు నాయకుని అభిసరించడం స్ఫురిస్తుంది. ఇలా నాయకుణ్ణి తమ వద్దకు రప్పించుకోవడం వల్ల, అతన్ని వెదుక్కుంటూ తామే పోవడం వల్ల ఈ వనితలు అభిసారికలు.

**బాహ్యార్థం :**

తమి తీర్చుకోవడానికి తపించే నాయకులు ఒకరి కోసం ఒకరు అభిసరించడం కనిపిస్తుంది.

**అంతరార్థం :**

ఆత్మానందం నందనందనుని పొందువల్లనే ఆత్మలకు లభిస్తుంది. ఆత్మల ఆర్తిని నివృత్తి చేయడమే పరమాత్మకు ఆత్మీయాంశం. మర్కట మార్జాల, కిశోర న్యాయాల్ని ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

**మట్టెలు గల్లురనగ మగువయెందువోయేవే**
**వెదజల్లు వాసనతో వెదకే వెవ్వరినే**
**కలకల నవ్వులతో కమ్మటి నేమి చూచేవే**
**యెలమి నిన్నుగాచుక యీడనున్నాడ**

**(సంపుటము-25, సంకీర్తన-570)**

ఈమె సంకేతస్థలానికి ప్రియుణ్ణి రమ్మని చెప్పింది. తానూ అక్కడకు చేరుకుని అతని కోసం అన్వేషిస్తున్నంతలో ఆమె కోసం వేచివున్న ప్రియుడు పలకరింపుల పన్నీరు చిలకరించాడు.

ఆమె పాదాలకు మట్టెలు పెట్టుకుంది. ముంజేతులకు కంకణాలు ధరించింది. అవి శ్రావ్యంగా శబ్దిస్తున్నాయి. చీకటి రాత్రి ఆ సవ్వడి అతనికి ఆమె జాడను తెలియజేస్తూంది.

ఆమె సిగలో విరులు పెట్టుకుంది. మేనికి జవ్వాది పూసుకుంది. అవి సువాసనలు వెదజల్లుతున్నాయి. చీకటి వారిని కప్పివేస్తుంటే అక్కడేవున్న అతని కోసం అమె వెదుకుతూంది. ఆమెనుంచి ప్రసరించే పరిమళాలు అతనికి ఆమెను పట్టిచ్చాయి. నిశ్శబ్దమైన ఆ రేయిలో ఆమె కలకల నవ్వులతో తన ఉనికిని సూచిస్తూ మనోహరుడి కోసం గాలిస్తూన్న అభిసారిక ఈమె తమోభిసారిక.

**ఎల జవ్వనిటు నీకు నెదురు చూచుచు వెడలి**
**చెలగి వెన్నెలకు విచ్చేయగాను**

**(సంపుటము-12, సంకీర్తన-161)**

ఈ సంకీర్తనలో నాయిక యౌవనవతి. ప్రియునికోసం వెదుకుతూ వెన్నెలలో సంచరిస్తూంది. కలువల రాయడు ఆమె కోరికకు ఆజ్యం పోస్తున్నాడు. చంద్రకిరణాలు ఆమె మన్మథావస్థను ప్రదీపిస్తున్నాయి. వెన్నెలలో వేచివుంది కాబట్టి ఈమె జ్యోత్స్నాభిసారిక.

**కలికిదన విభుని కడ కేగె వేగిరాన**
**తిలకము కస్తూరి లద్ద మఱచె**
**మొగివీడిన తురుము ముడవదాయ**
**తగజెలి యిచ్చిన కైదండయును విడిచె**

**(సంపుటము-26, సంకీర్తన-267)**

ఈ నాయిక వేళమీరకుండా విభుని వద్దకు వెళ్ళే తొందరలో అస్తవ్యస్తంగా బయలుదేరింది. కుంకుమ దిద్దుకోలేదు. చెదరిన కురులు సవరించుకోలేదు. మనోవల్లభునితో ముచ్చటించాలని, అతని మూర్తిని వీక్షించాలని అతనిపైనే ఏకాగ్రతతో ఎటువంటి బాహ్యాలంకరణ లేకుండా అతనున్న చోటుకు పయనమై పోతుంది. తన తొందరపాటుకు ఆపలేని తమకానికి చెలులు పరిహసిస్తారని కూడా బిడియపడని ఈ నాయిక అభిసారిక.

**పూవుల తోటలోన పొలతి తాపాన నుండి**
**పండు వెన్నెల బయట భామిని యలయుచునుండి**
**(సంపుటము-17, సంకీర్తన-372)**

నిండు జవ్వని అయిన ఆమె నిలువెల్లా మదనోద్వేగంతో ఉద్యానవనాల్లో అతనికోసం వేచివుంది. శశికాంతులు ఆమె అభిలాషను ఉద్దీపింప చేస్తున్నాయి. పండు వెన్నెల్లో వివశత్వంతో వేచివున్న ఈమె జ్యోత్స్నాభిసారిక.

అష్టవిధ నాయికలు అష్టవిధ శృంగార చేష్టా వ్యంగ్య చతురలు. వీళ్ళు చేసే ఈ శృంగార ప్రక్రియలు ఆధారంగానే వీరికి పేర్లు స్థిరపడ్డాయి. ప్రతీకాత్మకంగా భావించినపుడు-భగవంతుడు పిలిస్తే పలుకగల స్థితిలోని మహాతపస్విలాంటి వ్యక్తిగా ఈమె దర్శన మిస్తుంది.(స్వాధీనపతిక) భగవంతుని కోసం మధుర మధుర హృదయంతో ఎదురుచూసే మహా భక్తురాలిలా గోచరిస్తుంది. వాసకసజ్జిక పరమాత్మ అన్యాత్మకు సాక్షాత్కరించి ఆలస్యంగా తనకు దర్శన మిచ్చినపుడు అసంతృప్తితో అసహనం చూపే అమాయక జీవాత్మలా

అనిపిస్తుంది ఖండిత. దర్శనమిచ్చినదేవుని తత్త్వం తెలుసుకోలేక నిర్లక్ష్యం చేసి అతను అదృశ్యమైపోగానే తీవ్ర ఆవేదనకు గురయ్యే ముగ్ధాత్మకు ప్రతీక కలహాంతరిత. సర్వేశ్వరుని సన్నిధి కోసం అన్ని చోట్ల అన్వేషించే ఒక తపస్విలా కనిపిస్తుంది అభిసారిక. యోగసంకేతాల ప్రకారం తపించినా ప్రత్యక్షంకాని పరాశక్తిని తలచుకుని పరితపించే యోగికి ప్రతిరూపం విప్రలబ్ధ. చిరకాలం తపస్సు చేసినా ఎంతకూ కనికరించి కనిపించని అనంతుని కోసం ఆర్తి వహించే ఆత్మ ప్రతిబింబం విరహోత్క. అష్టవిధనాయికలలో ఒకరైన ప్రోషిత భర్తృక అన్నమయ్య సంకీర్తనలలో లేదు.

ఇలా ఈ అష్టవిధ శృంగార నాయికల్లో అష్టవిధ యోగసిద్ధులు అంతర్లీనమై ఉన్నాయి. శృంగార వక్రతలో అభివ్యక్తమయ్యే ఆధ్యాత్మికత అనుభూతి ఈ నాయికల్లో నిక్షిప్తమైంది.

నాయికలకు ముఖ్యంగా మూడు అవస్థలు సంప్రాప్తిస్తాయి. నాయకుణ్ణి సంకేతంలో కలుసుకోవడానికి పూర్వం విరహోత్కంఠితలుగా ఉండడం ప్రథమావస్థ. తర్వాత నాయికలు నాయకాభిసరణం చేసిన దశలో అభిసారికలుగా మారడం ద్వితీయావస్థ. కారణాంతరాలవల్ల నాయకుని సాంగత్యం లభించకపోవడంతో విప్రలబ్ధలై పరితాపం చెందడం తృతీయావస్థ.

ఒకే నాయిక వివిధ అవస్థాభేదాల్లో నాయికా భేదాలతో కూడా చరించవచ్చు. ఒకప్పుడు అభిసారిక కావచ్చు. ఒకప్పుడు ఖండిత కావచ్చు. విప్రలబ్ధ మరొకప్పుడు విరహోత్క కావచ్చు. ఒకనాటి విరహోత్క

మరోసారి స్వాధీన పతిక కావచ్చు. అన్ని అవస్థాభేదాలు ఆయా వయో ధర్మాన్ని బట్టి, ప్రణయ భావాన్ని బట్టి ఒకే నాయికకు ఏర్పడినా ఏర్పడవచ్చు. అంతమాత్రాన ఈ అవస్థా భేదాలన్నీ ఒకే నాయికవని నిరూపించదలచుకోవడం సమంజసం కాదు.

ఇలా అన్నమయ్య నాయికలు చిత్రవిచిత్ర గతులతో తమ హావభావాల్ని ప్రదర్శిస్తారు. భక్తి రక్తి మిళిత హృదయాలతో ప్రవర్తిల్లుతారు.

# 6. అన్నమయ్య సంకీర్తనలు-మధురభక్తి

## మధురభక్తి

'భజ్' అనే ధాతువు నుంచి పుట్టింది భక్తి. ఈ పదానికి భజించడం అని అర్థం. చిత్తం పశుపతి పాదారవిందాల సామీప్యాన్ని చేరుకొనడమే భక్తి. ఈశ్వరుని మీది ఉత్తమ ప్రేమ ఏదైతే ఉందో దాన్ని భక్తి అంటారు. భగవంతుని మీద పరమప్రీతి, గాఢానురక్తి భక్తి అవుతుంది.

మధురభక్తి పవిత్రశృంగార భూయిష్ఠమైన ఆత్మ పరమాత్మల అలౌకిక సంయోగం, భరతుని రస సిద్ధాంతం ఆధారంగా రాధకు కృష్ణునిపై గల శృంగార రూపభక్తిని మధురభక్తిగా భావించవచ్చు. మధుర హృదయరతే భక్తి రసం. దాన్నే మధురభక్తి అంటారు.

పరమేశ్వరుణ్ణి మనసా చింతించి నప్పుడేర్పడిన మానసిక ప్రవృత్తి లేదా ఆలోచనా ప్రవాహమే భక్తి.

"సా త్వస్మిన్+పరమ ప్రేమ రూపా" భగవంతుని పట్ల ఉన్న ప్రగాఢ ప్రేమే భక్తి.

అమృత స్వరూపా చ "ఆ ప్రేమ అమృత స్వరూపం" యల్లబ్ధ్వా పుమాన్ సిద్ధో భవతి, అమృతో భవతి, తృప్తో భవతి".

దేనివలన మానవుడు సిద్ధుడు, అమరుడు, తృప్తుడు కాగలుగుతున్నాడో అది భక్తి.

**"యత్ప్రాప్య న కించి ద్వాంఛతి న శోచతి న ద్వేష్టి న రమతే నోత్సాహీ భవతి".**

దేనివలన మానవుడు ఇతరాలను వాంఛింపడో, దేనివలన శోకద్వేష రహితుడై విషయభోగాల పట్ల అనాసక్తుడవుతాడో అది భక్తి.

**యద్ జ్ఞాత్వా మత్తో భవతి, స్తబ్ధో భవతి, ఆత్మారామో భవతి**

దేనిని గ్రహించి మానవుడు ఉన్మత్తుడు, స్తబ్ధుడు ఆత్మారాముడవుతున్నాడో అది భక్తి.

**సా న కామయమానా నిరోధ రూపత్వాత్**

ప్రేమభక్తి కామపూరితం కాదు. ఎందుకంటే అది త్యాగమయమైంది.

**పూజాదిష్వనురాగ ఇతి పారాశర్యః**

వ్యాసుని అభిమతాన్ని అనుసరించి భగవదారాధన పట్ల ఆసక్తిని, అనురక్తిని కలిగి ఉండేదే భక్తి.

**లోకేఽపి భగవద్గుణ శ్రవణ కీర్తనాత్**

భగవంతుని గుణాలను వినడం, కీర్తించడం భక్తి.

**"త్రిసత్యస్య భక్తిరేవ గరీయసీ భక్తిరేవ గరీయసీ"**
**మనసా, వాచా, కర్మణా త్రికాలాల్లోనూ భక్తి శ్రేష్ఠమైనది.**
**"కామాద్గోప్యో భయాత్కంసం ద్వేషాచ్చైర్యాదయో నృపాః**
**సంబంధా ద్వృష్ణయః స్నేహా ద్యూయం భక్త్యావీయం నృప"**
**"ప్రీణనాయ ముకుందస్య న వృత్తం న బహుజ్ఞతా**
**న దానం న తపో నేజ్యా నశౌచం నవ్రతానిచ**
**ప్రీయతే మలయా భక్త్యాహరి రన్య ద్వి డంబనమ్"**

దాన తపో శౌచాదులవల్ల లభించని హరిసాన్నిధ్యాన్ని అమలిన భక్తితత్త్వంతో సంపాదించుకోవచ్చును.

శ్లో ॥ అంకోలం నిజబీజ సంతతిః
అయస్కాంతో ఫలం సూచికా ।
సాధ్వీనైజ పతిం లతా క్షితిరుహం
సింధుః సరిద్వల్లభమ్ ।
ప్రాప్నోతీహ యథా తథా
పశుపతేః పాదారవింద ద్వయం ।
చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి
సదా సా భక్తి రిత్యుచ్యతే" ॥

ఊడుగచెట్టు దాని విత్తనాలను ఎలా ప్రోగుచేస్తుందో, ఒక అయస్కాంతం ఎలా ఇనుమును ఆకర్షిస్తుందో, ఒక భార్య భర్తను ఎలా మనసా స్మరిస్తుందో, ఒక తీగ చెట్టు కెలా అల్లుకు పోతుందో, ఒక నది సంద్రాన్ని ఎలా పరుగులతో చేరుకుంటుందో అలా శివుని చరణాల మీద మనసు నిలపడమే భక్తి.

శ్లో ॥ మోక్షకారణ సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ ।
స్వస్వరూపానుసంధానం భక్తి రిత్యభిధీయతే " ॥

శంకరాచార్యులు ఎవరిని వారెరుగడమే భక్తి అన్నారు.

శ్లో ॥ మధురం రసవద్వాచి
వస్తున్యపి రసస్థితః ।
మేన మాద్యంతి ధీమంతః
మధుసేవ మధు వ్రతాః" ॥

మాధుర్యం రసవత్తరం, అది వాక్కునందు, వస్తువునందు ఉంటుందని దండి అభిప్రాయం.

సంగీత, తాళ, లయ, నృత్యాది నాట్య సంబంధ విషయానుగుణంగా నర్తిస్తూనే శిరసు మీద కలశాన్ని పడిపోకుండా జాగ్రత్త వహించే నటీమణిలా అసంఖ్యాకమైన లౌకిక లంపటాలతో సతమతమవుతున్నా బ్రహ్మ భావన నుంచి యోగి పతితుడు కాడు. ఇలాంటి ఉత్తమోత్తమ గుణాన్నే భక్తి అంటారు.

"కృష్ణ భగవానుడు రస జగత్సమ్రాట్టు". అతని గూర్చిన భావన భక్తి శృంగారముల సంగమస్థానం. ఆ రసములకది పరసీమ. రూపగోస్వామి పరిభాషలో మధురము, ఉజ్జ్వలము నను పదములు భక్తి రస పర్యాయ వాచకములు. శృంగారము మధుర రసరాజమనుట సర్వాంగీణమైన విషయము. ఉజ్జ్వల శబ్దము శృంగార పర్యాయవాచి.

కృష్ణ సంబంధమైన భక్తి శృంగారముల భావబాంధవ్యము నిసర్గ మధురము, మనోహరము. అదే భారతీయుల భక్తి సాంప్రదాయ మార్గములలో సర్వోత్కృష్టమైన మధురభక్తికి మూల ప్రకృతి, సార్థకమైన ఆ మహారస రహస్యము, భగవంతుడినే పరమ ప్రాప్యుడైన ప్రియునిగా వలచి ఉపాసించుటయే మధురభక్తి పరమార్థము."

**శ్లో ॥ భగవాన్ పరమానంద స్వరూపః స్వయమేవ హి ।**
**మనోగత స్తదాకారో రసతామేతి పుష్కలమ్ ॥**

మనసుమీద ప్రతిఫలించే భగవానుడు పరమానంద స్వరూపుడు. ఇలా మనోముద్రితమైన ఆ ఆనంద స్వరూపమే పుష్కల భక్తిరస స్థాయీభావం.

ఈ భక్తి బీజం ద్రావిడదేశంలో అంకురించి కర్ణాటక, మహారాష్ట్ర

మొదలైన ప్రాంతాల్లో శాఖోపశాఖలుగా విస్తరించి ప్రవర్ధమానమవుతూ వచ్చింది.

గ్రామీణ ప్రాంతాల్లో నానా అగచాట్లు పడుతున్న జనపదులకు ఈ భక్తి ఉద్యమం ఉపశమనాన్ని కలిగించింది. ఈ కాలంలో వెలుగులోకి వచ్చిన వారిలో తులసీదాసు, విద్యావతి, తుకారాం, నానక్, సరళాదాసు, బసవన, పోతన, పురందరదాసు, యాజుతాబెన్, కంబ మొదలైన వారంతా మహాభక్త కవులుగా ప్రసిద్ధికెక్కారు. మోక్షసాధనలో కర్మమార్గం మధురభక్తికి ప్రేమభక్తి, పరాభక్తి, సర్వోత్తమభక్తి, ఉజ్జ్వలభక్తి, పరమప్రేమరూపభక్తి, కాంతాభావనాభక్తి, గోపికాభక్తి, శరణాగతభక్తి, ఆత్మనివేదనాభక్తి, రసమయభక్తి, మోక్షశృంగారం, భక్తిశృంగారం అని అనేక నామాంతరాలున్నాయి.

లౌకిక విషయాలైన సంతానం, సంపద, ఇత్యాది విషయాల మీదగాని, జ్ఞానకర్మలమీద గానీ అపేక్ష లేకుండా త్రికరణ శుద్ధిగా భగవంతుణ్ణి ధ్యానించడమే ఉత్తమభక్తి అవుతుంది. మధురభక్తిలో ప్రథమస్థానం పతిపత్నీ భావానికే దక్కింది. ఈ దివ్య ప్రేమలో ప్రేయసీ ప్రియుల మధ్య చోటు చేసుకునే విషయలోలుపత వుండదు. కామవాసన అంటని పవిత్ర భావనకు ప్రతీక ఇది. పతి సమాగమంలో పత్ని తనకు తాను సంపూర్ణంగా సమర్పించుకునేలా భగవంతుని ముందు భక్తుడు ఆత్మార్పణం చేసుకోవడమే మధురభక్తి. ఈ పతిపత్నీ భావంతో పాటు ఇతర భక్తి గుణాలైన సేవ, దాస్యం, ఏకాంతనిష్ఠ, కారుణ్యం, దృఢభావన అనేవి కూడా ఈ భక్తిలో ప్రధాన లక్షణాలు. జీవాత్మకు పరమాత్మకు అభేదాన్ని ప్రతిపాదించడం ఈ మధురభక్తి ఆంతర్యం.

భక్తునికీ, భగవంతునికీ మధ్య పితాపుత్ర భావం, రక్ష్యా రక్షక భావం, శేషశేషీభావం, జ్ఞాతృజ్ఞేయభావం, స్వస్వామిభావం, శరీరాత్మభావం చోటు చేసుకుని ఉన్నాయి. ఈ భావాలన్నింటిలోకి పతిపత్నీ భావమే జీవాత్మ పరమాత్మలకు అతి సాన్నిహిత్యాన్ని ఏర్పరుస్తుందని మధురభక్తి వ్యక్తీకరిస్తుంది.

భగవంతుని సాన్నిధ్యంలో భక్తుడు ప్రియుని పరిష్వంగంలో బాహ్యాంతర జ్ఞానాన్ని కోల్పోయిన ప్రియురాలిలా దివ్యానుభూతికి లోనవుతాడు. ఈ స్థితిలో భక్తునికి ఇతర వాంఛలేమీ ఉండవు. అతని కాయన పరమాత్మ సంస్పర్శకోసమే.

సృష్ట్యాదిలో పరతత్త్వ స్వరూపుడైన నారాయణుడొక్కడే దేవుడు. పరమాత్మ ఏకంగా ఉండి తనతోనే తాను రమించలేడు. ఈ సమాగమ మాధుర్యాన్ని మరింత అనుభవించడానికి తనకు తానే రెండుగా మారాడు. అంటే ద్వైదీభావాన్ని పొందాడన్నమాట. అందువల్ల భగవంతునికీ, భక్తునికీ శరీరాలు వేరైనా ఆత్మానందానికి చెందిన అనుభూతులు మాత్రం ఒక్కటిగానే కనిపిస్తాయి. ఈ మధురభక్తిని భావంగానే కాకుండా రసంగా కూడా భావించడం జరుగుతూంది. మధురభక్తి రసమైనప్పుడు ఈ రసానికి ఆలంబన భగవంతుడు అవుతాడు. ఆయన గుణగణాలను కీర్తించే చరిత్రలు ప్రసాద ఓజోగుణంగా మారుతాయి. భక్తజనులు ఉద్దీపనాలు. వారికి సంభవించే ఆంగిక వికారాలు, అనుభవాలు, నిర్వేద శంకాహర్షాదులు, వ్యభిచారీ భావాలు, భగవదాకార చిత్త వృత్తి స్థాయీభావం, దీనినే భగవద్రతి అంటారు. లౌకిక శృంగారంలో నాయికకు, లౌకికవ్యక్తి అయిన

నాయకుడు ఆధారమైతే, భక్తి శృంగారంతో భక్తునికి అలౌకిక శక్తి అయిన భగవంతుడు ఆలంబనం అవుతాడు. బాహ్య శృంగారంలోలా భగవద్రతిలో భక్తుల హృదయాలు కామవాసనా రహితాలవుతాయి.

మధురభక్తి భావ పంచక ప్రధానమైంది. శాంత రసాన్ని దాస్యం, దాస్యాన్ని సఖ్యం, సఖ్యాన్ని వాత్సల్యం, వాత్సల్యాన్ని మధురరసం అపేక్షించి ఉంటాయి. మధురశాంతంలో భక్తుడు భగవంతుణ్ణి గురుభావంతో ధ్యానిస్తే, మధుర దాస్యంలో తాను దాస్యభావానికే లోనవుతాడు. అతని హృదయం మధురసఖ్యంలో పరస్పర సంప్రీతి సంభాషణలు జరుపుతుంది. మధుర వాత్సల్యంలో మాతృభావన చోటు చేసుకుంటుంది. మధుర మధురంలో పవిత్ర దాంపత్య ప్రేమ అంతర్భూతంగా ఉంటుంది. అన్నమయ్య శృంగార సంకీర్తనలలో ఈ లక్షణాలను పరిశీలిద్దాం.

**పాదముల దాటించు పసిడి మెట్టెల మ్రోత**
**మోదవు కంకణ రవములమీరంగా**
**గాదిలి నీ కౌగిట వేంకటపతి మీది పాట**
**వేదముల మీరినట్లు వెదచల్లెనె (సంపుటం-3, సంకీర్తన-400)**

ఇక్కడ అన్నమయ్య తనను నాయికగా భావించుకుని వేంకటేశునితో సమాగమాన్ని అభిలషిస్తాడు. శ్రీనివాసుడు నాయకుడై తనను అలరించినట్లు పరవశం చెందుతాడు.

**మధురశాంతం :**

**చిక్కించుక యిట్టి తన చిత్తము దెలిసేనంటే**
**గక్కన వూహించరాని గంభీరుడాతడు (1వ చరణం)**

జడియక తను మెచ్చిసారె బొగడే నంటే
కడలేని గుణసాగరుడాతడు (2వ చరణం)

(సంపుటం-26, సంకీర్తన-430)

అన్నమయ్య నాయిక శృంగారనాయికలుగా, అష్టవిధ నాయికలుగా అనేక రూపాలను ధరిస్తుంది. ఈ నాయిక జీవాత్మ ప్రతీక శ్రీవేంకటేశుడు పరమాత్మ. ఈ నాయిక నిరంతరం నాయకుని తలపులతో పరవశిస్తుంది. అతని ధ్యానంతో ధన్యతను చెందుతుంది. ఒక ప్రశాంత మధురస్థితిని పొందుతుంది.

**మధురసఖ్యం :**

చెలిమి సేయంగరాదు చేసి విడువంగరాదు
తలంచి బాసలీరాదు తప్పంగరాదు
వలవరాదు వలచి వదలరాదు
మనసియ్యరాదు యిచ్చి మరువరాదు

(సంపుటి-3, సంకీర్తన-107)

ఇక్కడ నాయిక నాయకుణ్ణి వలచి వలపించుకుని విడదీయరాని అనుబంధాన్ని అతనితో అల్లుకుంది. అతన్ని ప్రగాఢంగా మోహించి, ప్రాణసఖునిగా భావించి మృదువాక్కులతో అలరిస్తూ మధురానుభూతిని పొందుతుంది. కాబట్టి మధురసఖ్యం ఇక్కడ చోటుచేసుకుంది.

**మధురదాస్యం :**

శక్తికలిగితే నీ సరస దేవుండ గానా
యుక్తి గలిగితే నే నొడలు మోయగా

శక్తి యుక్తియు నొకటి లేక నీ
భక్తుండనైతి నన్ను పాలింపవే (సంపుటం-3, సంకీర్తన-77)

తాను వలచిన నాయకునికి సేవకురాలై వినయవిధేయతలతో అనురాగంతో అతనికి త్రికరణశుద్ధిగా మధురదాస్యం చేస్తుంది.

**మధురవాత్సల్యం :**

ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు
దిద్దరాని మహిమల దేవకీసుతుడు
అంతనింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చ బూస
చెంతల మాలోనున్న చిన్ని కృష్ణుడు
(సంపుటం-9, సంకీర్తన-288)

ఇక్కడ నాయిక యశోద. నాయకుడు చిన్నికృష్ణుడు. ఈమె నాయకుణ్ణి పుత్రునిగా భావించి తాను మాతృమూర్తిగా అతనిపట్ల ప్రవర్తిల్లుతుంది. అతన్ని లాలించి, ముద్దు మురిపాలు చేస్తూ మధుర వాత్సల్యంతో పరవశిస్తుంది.

**మధురమధురం :**

పత్రిలేని పూజ దలపగ గోటి మణుగులై
అతివ పరిమళము బ్రహ్మానందమాయ
మానినీమణి మనసు మంచి యాసనమాయ
నానంద భాష్పజల మర్ఘ్యాదులాయ

**మీనాక్షి కనుదోయి మించు దీపములాయ**
**నానన సుధారసంబభిషేక మాయ**

**(సంపుటం-9, సంకీర్తన-288)**

నాయకునికోసం విరహంతో వేసారిన నాయిక నాయకుని ఆగమనంతో బ్రహ్మానంద పరవశురాలవుతుంది. అతన్ని స్వాగతించడానికి ఆమె మనసే ఆసనంగా, చిరునవ్వులు పూజా సుమాలుగా, తనూలావణ్యం నీరాజనంగా అలరారాయి. అతని రాకతో ఆమె హృదయంలో చెలరేగిన వేడుకలు నైవేద్యాలుగా, తాంబూలాలుగా, అతని పరిష్వంగంలో లీనమై మధురాన్ని పొందుతుంది.

**పరకీయోపాసన :**

అనురాగార్పితమైన ఆత్మగలవారు మనో ధర్మంచే స్వీకరించబడినవారు పరకీయ నాయికలవుతారు. అన్నమయ్య సంకీర్తనలలో పరకీయలున్నారు.

**కొండలోఁగోవిలగుయ్య గుండె పగిలెనీ**
**యండకు రాగా ఁబ్రాణమంతలో బ్రదికెరా ॥పల్లవి॥**

**(సంపుటం-12, సంకీర్తన-324)**

సామాజిక కట్టుబాట్లను, బంధనాలను గణించని ఒక మధురారాధన ఈమెలో కనిపిస్తుంది.

ఈ మధురభక్తి రససాధనలో కృష్ణభక్తి సంప్రదాయంలో పరకీయోపాసనకే ప్రాముఖ్యం ఉంటుంది. పరకీయులైన గోపికలు పరపురుషుడైన శ్రీకృష్ణునితో ప్రేమ ప్రవృత్తిని కలిగి ఉండడం

అసహజంగా కనిపించినా జీవాత్మ పరమాత్మల అన్వయంతో ఈ దోషం సమిసిపోతుంది.

వైష్ణవంలోని రాధామాధవతత్త్వాన్ని పతిపత్నీ భావనతోనే సమన్వయించుకోవాలి. ఈ మాధుర్యరసంలో కృష్ణుడు విషయం తానే విషయ స్వరూపుడు. తానే ఆశ్రయ రసస్వరూపం రాధ. ఈ రసం అనియతంగా, స్వభావసిద్ధంగా ఉంటుంది. దీనికి అవధులుండవు. కృష్ణుడు సమస్త జనుల్ని రంజింపచేస్తే రాధ కృష్ణుని రంజింపజేస్తుంది. అందుకే పురాణాలు ఈమెను 'కృష్ణమయి' అంటాయి. మాతృదేహంకంటే మాతృత్వం ఎలా శ్రేష్ఠమో, భక్తిమతులైన వారి కంటే భక్తి స్వరూప రాధే కృష్ణుడికి ఇష్టం. కనుక మహాభావం యొక్కసారమే రాధ. మిగతా గోపికలంతా రాధ అవయవాలు. రాధాకృష్ణుల సంబంధం కస్తూరికి పరిమళానికి ఉన్న సంబంధం వంటిది. ఈ దిగువ సంకీర్తనలో అన్నమయ్య ఈ తత్త్వాన్ని ప్రస్తావించాడు.

**రాధామాధవ రతి చరితమితి**
**బోధావహం శ్రుతిభూషణం** ॥పల్లవి॥

**పురతో యాంతం పురుషం వకుళైః**
**కురంటకైర్వా కుటజైర్వా**
**పరమం ప్రహరతి పశ్చాలగ్నా**
**గిరం వినాపి వికిరతి ముదం**

**(సంపుటం-12, సంకీర్తన-166)**

నిరంతరం కృష్ణుని తలపులతో తరిస్తూ, అతని ధ్యానంతో ధన్యత చెందుతూ రసోన్మాదంతో కృష్ణుని చరణాల చెంత ఆత్మార్పణ చేసుకునే

అలనాటి రాధను సాక్షాత్కరింపజేశాడు అన్నమయ్య.

మొత్తం మీద ఆత్మానందమే మధురభక్తికి పరమ లక్ష్యం. తన ఆత్మలో జగత్తును జగత్తులో తన ఆత్మను దర్శించగలిగే ఆత్మ విద్యా విశారదుడే మధురభక్తి సంపన్నుడు.

భక్తి రెండు విధాలుగా ఉంటుంది. మార్జాల కిశోర న్యాయం, మర్కట కిశోరన్యాయం.

**మార్జాల కిశోర న్యాయం :**

అమాయకులైన అసమర్థులైన మృదులశాబకాల్ని నోట కరచుకుని సురక్షిత ప్రదేశాలకు తరలిస్తూ వాటి సంక్షేమానికి తానే బాధ్యత వహిస్తున్నట్లు, తన సంతతి అయిన భక్తుల యోగక్షేమాన్ని పరమాత్మే వహించడం మార్జాల కిశోరన్యాయం అవుతుంది.

అన్నమయ్య సంకీర్తనల్లో పరమాత్మ ప్రతిరూపమైన శ్రీ వేంకటేశుడు ఆత్మలకు ప్రతిబింబాలైన నాయికలను చేపట్టి వారిని ధన్యులను చేయడంలో మార్జాల కిశోరన్యాయం నిక్షిప్తమై ఉంది.

**వాడిక నవ్వులు నవ్వి వనితల మానములు**
**కూడపెట్టి లోలోనే గుది గుచ్చేవు**
**యీడుజోడుగా ౘెనగి ఇంపులు మచ్చులు వేసి**
**యీడేరించితివి మమ్మునెంత వాడివయ్యా**

**(సంపుటం-24, సంకీర్తన-140)**

శ్రీవేంకటశైలపతి ప్రవర్తనను నాయికే స్వయంగా వ్యక్తీకరించడం జరిగిందిక్కడ. పరమాత్మనుంచి అభివ్యక్తమైన ఆత్మలు నాయికలు. వారి

సంక్షేమం, సౌభాగ్యం, ఆయన కనీస కర్తవ్యం. అందుకే తనను కనీసం తలపునకు తెచ్చుకునే వారినందరినీ మొదట తనకభిముఖంగా త్రిప్పుకుంటాడు.

ఈ సంకీర్తనలో కూడా నాయికలు ఆయన కథలు మెచ్చారు. మనసిచ్చారు. సతులందరి వలపులు ముడుపులుగా కట్టుకున్నాడాయన. ముదితల తరుణాలను వేణువులుగా మలచి సుందర బృందావనాల్లో ప్రణవనాదాల్ని పలికిస్తూ, తన్మయింపచేశాడు. భావనలో తనను స్మరిస్తూ, పఠిస్తూ, తపిస్తూ, జపిస్తూ, వీక్షిస్తూ, అపేక్షిస్తూ ఎదురుచూసే వారిని తనవారిగా చేర్చుకుని వారి జీవితాలను ధన్యం చేశాడు. మార్జాలం తన కూనల స్థితిగతుల విషయంలో శ్రద్ధ వహించినట్లే నాయకుడు తన వారనుకున్న నాయికల సంక్షేమాన్ని తన సంయోగంతో సంప్రాప్తింపజేసి వారికి రక్తినీ, ముక్తినీ ప్రసాదించాడు. ఈ సంకీర్తన మార్జాలకిశోర న్యాయానికి చేరువగా ఉందని భావించవచ్చు.

**నెలతబాసి వుండలేను నిమిషమెందు నేడు నాకు**
**తలపులో నీ వలెనే రతుల తరుణి గలయు టెన్నడె॥పల్లవి॥**

**(సంపుటం-23, సంకీర్తన-20)**

దివ్యుడైన నాయకుడు తనంతట తానే వచ్చి ప్రణయ భిక్షకోసం నాయికను అర్థించడం, ఆర్తి చెందడం కనిపిస్తుందిక్కడ. ఈ సంకీర్తనలో కూడా మార్జాలకిశోర న్యాయం నిక్షిప్తమై ఉంది.

**విభుని వినయములు వినవమ్మా నిన్ను**
**నభయం బడిగీ నయ్యో తాను ॥పల్లవి॥**

**కింకరుడటనీ కినుక సేతలకు**
**వేంకటపతి గతి వినవమ్మా**
**నీదయగానక నిమిషమె యుగమై**
**ఖేదంబున నల గీ నట తాను (సంపుటం-12, సంకీర్తన-308)**

పరమాత్మ ఆత్మకోసం పరితపించడాన్ని అన్నమయ్య చిత్రీకరించాడిక్కడ. నాయిక ఎడబాటుతో శ్రీరమణుడు బాధా పరితప్త హృదయుడయ్యాడు. ఆ దివ్యపతి తన నారీమణికి దాసోహ మంటున్నాడు. నాయిక చూపుతున్న దయా రాహిత్యం జగన్నాధునికి అశాంతి జనకమైంది. ఇలా శ్రీవిభుడు సతిని చేరడానికి సతమతమవు తున్నాడు. భగవంతుని సహితం తనవెంట త్రిప్పుకోగలిగిన మహత్తరమైన మంత్రరాజం భక్తి. భక్తవత్సలుడైన భగవంతుడు భక్తుని వీడి తను మనలేక పోవడం ఇక్కడ ద్యోతకమవుతుంది.

**మర్కట కిశోర న్యాయం :**

ఒడుదుడుకుల గమనంలో పతనం కాకుండా వానర శాబకం తనతల్లిని హత్తుకునే విధంగా భక్తుడు ఎన్ని అవాంతరాలు, ఆటంకాలు వచ్చినా అనన్య మనస్కతతో భగవంతుని చరణాలు పట్టుకోవడాన్ని మర్కటకిశోర న్యాయమని అంటారు.

అన్నమయ్య సంకీర్తనల్లో ఆత్మకు ప్రతీక అయిన నాయిక పరమాత్మకోసం పరితపిస్తూ ఆయన సాంగత్యాన్ని వదలకుండా ఉండడానికి చేసే యత్నంలో కపికిశోరన్యాయ భక్తి సిద్ధాంతం నిబిడీకృతమై ఉంది.

**నెట్టిన నెప్పుడు నాకు నీవే దిక్కు**
**గుట్టుతోడ నుండగానే గురుతాయ వలపు**

**(సంపుటం-24, సంకీర్తన-330)**

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో కపికిశోర న్యాయానికి చెందినవే ఎక్కువగా కనిపిస్తాయి. ఆత్మ పరమాత్మకోసం పరితపించడం ప్రకృతి సహజం. ఇక్కడ నాయిక సంపూర్ణ శరణాగతితో జగన్నాయకునితో త్రికరణ శుద్ధిగా మైత్రీ బంధనాలల్లుకుంటుంది. ఈమె కపికిశోరంలా నాయకుడు ఎటు వెళ్ళినా వదలిపెట్టకుండా తనశాయ శక్తులా బంధించి తన స్వంతం చేసుకోవాలని యత్నిస్తుంది. ఈ కీర్తనలో మర్కట కిశోర న్యాయానికి అనువైన భక్తితత్త్వం ప్రచలితమవుతూంది.

**చాలుఁజాలువాడులేని జన్మమేలా**
**జాలినన్ను, బెట్టకురె సారె సారె జెలులు ॥పల్లవి॥**

**నేడు వానిఁబాసిన వెన్నెల బయలేలా**
**లీలవాని సరసము లేని నవ్వేలా**
**ఆలించి వాడు వినని ఆమాటలేలా**
**తాలిమిలతో లోలోనే తలపోతే చాలును**

**(సంపుటం-27, సంకీర్తన-448)**

ఇక్కడ నాయిక నాయకుడు లేని జన్మ వ్యర్థమని వాపోతుంది. అతని సాహచర్యం లేనిదే ఆమెకు కాల భ్రమణం జరగదు. ప్రకృతి నిసర్గ శోభాయమానంగా దర్శనమివ్వదు. కంటికి నిద్రలా, గుండెకు శ్వాసలా, కాంతికి కిరణంలా, దేహానికి జీవశక్తిలా నిరంతరం అతని సహవాసం ఆమెకు అనివార్యంగా ఉండాలి.

జ్యోత్స్న లేని ఆకాశంలా, దినకర మయూఖాలు సోకని కమలంలా, మనోవికాసం లేని దరహాసంలా, మాధురీ గుణంలేని వాక్చయంలా, పారవశ్యమెరుగని జవ్వనంలా అతన్ని ఎడబాసిన ఆమె వెలవెలబోతుంది. సర్వకాల సర్వావస్థల్లోను నాయిక అతని సాన్నిధ్యాన్ని అపేక్షిస్తుంది. అతని సమక్షంలో ప్రశాంతిని పొందుతుంది. అతని ఆదరణకు పాత్రం కావాలని ఆరాటపడుతుంది. తానుగా చెలిమిని అల్లుకుంటుంది. ఈ విధంగా ఈ కీర్తనలో కపి కిశోర భక్తి తత్త్వం వెల్లడవుతూంది.

అన్నమయ్య సంకీర్తనలలో మర్కట కిశోర భక్తి తత్త్వ ప్రతిపాదకమైన అంశాలు అధికంగా చోటుచేసుకున్నాయి. వేవేల ఆత్మలన్నీ నాయికలైతే, పరమాత్మ నాయకుడైతే నవవిధ భక్తులుగా ఉద్భవించిన నాయికల మహోన్నత భక్తి తత్త్వం మర్కట కిశోర న్యాయానికి చెందింది.

# 7.పోతన-అన్నమయ్య

**శా॥ శ్రీ కైవల్య పదంబు చేరుటకు నై చింతించెదన్ లోక ర**
**క్షా కారంభకు భక్త పాలన కళా సంరంభకున్ దానవో**
**ద్రేక స్తంభకు గేళిలోల విల సద్దృగ్జాల సంభూతనా**
**నాకం జాత భువాండ కుంభకు మహానందాంగ నాధింభకున్ (1-1)**

తెలుగు సాహిత్య చరిత్రలో 16వ శతాబ్దానికి విశిష్టమైన స్థానం ఉంది. పద్య యౌవనం, పదబాల్యంగా గలిగిన ఈ శతాబ్దానికి తండ్రి వైష్ణవం.

మహాకవుల దృక్పథం వారి గ్రంథాలలో ప్రతిబింబిస్తుంది. తమ కాలంలో జరిగిన అనేక సంఘటనలకు కవులు ప్రత్యక్ష సాక్షులుగా కన్పిస్తారు. అలాంటి మహాకవులలో పేరెన్నిక కలిగిన భక్తకవులు పోతన, అన్నమయ్యలు. భాగవత రచన ద్వారా పోతన, సంకీర్తన రచన ద్వారా అన్నమయ్య ప్రశస్తి పొందారనడం నిర్వివాదాంశం.

**శ్లో ॥ జయన్తి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః ।**
**నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయమ్ ॥**

అనిన భర్తృహరి సుభాషితానికి ఉదాహరణగా పోతన, అన్నమయ్య కనిపిస్తారు. పోతన భక్తకవి. అన్నమయ్య భక్త వాగ్గేయకారుడు అన్న విషయం ప్రధానంగా తెలుస్తున్నప్పటికీ వాగ్గేయకార లక్షణాలు పోతనలోనూ, పద్యకవిత్వలక్షణాలు అన్నమయ్యలోనూ కనిపిస్తాయి. పోతనది రాగయుక్తంగా సాగిన పద్య లక్షణాలు గల కవిత్వం. అన్నమయ్య సంకీర్తన రచన పద్యలక్షణాలతో కూడిన రాగయుక్తమైన కవిత్వం, పోతన భాగవత రచన భక్తి సమ్మిళితం గల పురాణ రచన.

అట్లే అన్నమయ్య సంకీర్తన రచన కూడా సంగీతం, సాహిత్యం సమ ప్రాధాన్యం గల భక్తి సమ్మేళనం. వీరిరువురు కర్మ జ్ఞాన యోగాలను అనుసరించి వాటిని భక్తితో పూర్తి చేయడం జరిగింది.

ఏ సాహిత్యంలోనైనా ఏ ఇద్దరి కవుల రచనల్ని పోల్చిచూసి తారతమ్య నిరూపణ చేయడం సహృదయ విమర్శక లక్షణంకాదు. కారణం వారు ఎన్నుకున్న విషయం ఒక్కటే అయినా వారు జీవించిన కాలం, వారు సంచరించిన ప్రాంతం, వారి సమకాలీన రాజకీయ, సాంఘిక, మత పరిస్థితుల కనుగుణంగానే వారి రచనలు సాగుతాయి. అందులో పురాణ ఫక్కిలో భాగవతము వ్రాసినవాడు పోతన, సంకీర్తనల రూపంలో ఆ దేవదేవుని ధ్యానించి తరించినవాడు అన్నమయ్య. అట్టి అనన్య సామాన్యమైన కవుల మధ్య తారతమ్య పరిశీలన అసమంజసం.

అయితే ఈ ఇద్దరి కవుల మధ్య సాదృశ్యాల్ని మనం గుర్తించవచ్చు. సాదృశ్యాల్ని గుర్తించడమే కాని పోలిక చెప్పడం భావ్యం కాదు. పోతన అన్నమయ్య రచనల్ని మనం పరిశీలిస్తే వారి ప్రధాన మనోభావాలు ఒక్కటిగానే కనిపిస్తాయి. "శ్రీకైవల్య పదంబు చేరుటకై" అని చింతించినవాడు పోతన. తన ఆత్మను ఆ పరమాత్మలో ఐక్యం చేయడానికి తపించినవాడు అన్నమయ్య. ఇద్దరి మతం ఒక్కటే ఈ ఇద్దరూ చెప్పిన సాహితీ పద్ధతులు శతధా భిన్నాలైనా, భక్తిమార్గం ద్వారా భగవంతుని చేరడం సులభమని ఇద్దరూ నొక్కి వక్కాణించారు. మనోభావాల విషయంలోనే గాక జీవన ప్రయాణంలో గూడ వీరిద్దరి మధ్య సాదృశ్యం కనిపిస్తుంది.

ఒకటి వీరిద్దరు ఇంచుమించు ఒకే శతాబ్దానికి చెందినవారు. రెండు అన్నమయ్య రాయలసీమవాసి అనుటలో అనుమానం లేదు. పోతన తెలంగాణ ప్రాంతం వాడని, రాయలసీమవాడని చారిత్రక విమర్శకుల మధ్య అభిప్రాయభేదాలున్నాయి. రాయలసీమ ప్రాంతం వాడనుకుంటే ఇద్దరూ ఒకే ప్రాంతం వారవుతారు. మూడు ఇద్దరూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వారే. నాలుగు ఇద్దరూ ఊరిపేరు ఇంటి పేరుగా ప్రసిద్ధికెక్కినవారే. ఒకరు బమ్మెర పోతన, మరొకరు తాళ్ళపాక అన్నమయ్య. ఐదవది ప్రధానమైనది ఇద్దరూ రాజాశ్రయాల్ని తిరస్కరించినవారే. పై ఐదంశాలు లౌకిక ప్రపంచానికి సంబంధిచినవి.

మరొక విషయాన్ని గమనిస్తే వీరిరువురి తల్లిదండ్రుల పేర్లు లక్ష్మీనారాయణ నామార్థాలుగా ఉండడం విశేషం. పోతన తల్లి పేరు లక్కసాని(మాంబ). అన్నమయ్య తల్లిపేరు లక్కమాంబ. లక్కమాంబ అన్న పదం లక్ష్మీనామార్థంగా ఉంది. పోతన తండ్రి (కేతన) కేసన. కేసన అన్న పదం కేశవ నామార్థాన్ని తెలుపుతుంది. ఇక అన్నమయ్య తండ్రి పేరు నారాయణసూరి. ఈ విధంగా వీరి తల్లిదండ్రుల పేర్లు కూడా లక్ష్మీనారాయణ నామార్థాలుగా ఉండడం వల్ల సాక్షాత్తు లక్ష్మీనారాయణులే వీరి తల్లిదండ్రులుగా ఉండవచ్చని కూడా భావించవచ్చు. ఇక అలౌకిక ప్రపంచానికి సంబంధించి వీరు సృష్టించిన సాహిత్యంలోని అనేక అంశాలలో వీరి మధ్య గల సాదృశ్యాల్ని మనం గమనించవచ్చు. సృష్టి సర్వం ద్వంద్వాల సంయోగమని ఋషులు, ఋషితుల్యులు భావించారు. సుఖ దుఃఖాలు, జయాపజయాలు, లాభనష్టాలు, ఆర్య అనార్యులు, ధనిక పేదలు, పండిత పామరులు,

స్త్రీ పురుషులు ఈ విధంగా అనంత కోటి ద్వంద్వమయమని పెద్దల ఉవాచ. ఎక్కడ ద్వంద్వముంటుందో అక్కడ సంఘర్షణ తప్పదు. ద్వంద్వ సంఘర్షణకు అతీతులు నిర్మల మనస్కులైన వారు కొందరుంటారు. వారు జ్ఞానులు. ఈ ద్వంద్వ శక్తుల సమన్వయం వారికంతగా అవసరముండదు. ద్వంద్వశక్తులను సమన్వయం చేసి శాంతిని కోరుకునే కర్మవీరులు కొందరుంటారు. వారు భూమ్యాకాశాలకు అంతరిక్షమనే నిచ్చెన వేసి లోకమనే ఈ మహాసముద్రాన్ని చిలికి అమృతాన్ని మాత్రమే లోకానికి అందించాలని అనుక్షణం ప్రయత్నిస్తుంటారు. అట్టి కర్మవీరులు పోతన అన్నమయ్యలు.

బ్రహ్మసృష్టి అనబడు ఈ జగత్ సృష్టి అదృష్టమైన కర్మఫలాదులచే నియమితమైంది. కవిసృష్టి స్వతంత్రమైంది. బ్రహ్మసృష్టిలో కేవలం సుఖాలే కాక దుఃఖాలు ఉంటాయి. కవిసృష్టిలో సుఖదుఃఖాలు చెప్పబడినా అవి సమ్మేళనమై చివరికి పాఠకులకు లేదా శ్రోతలకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. బ్రహ్మ సృష్టిలోని రసాలు పరిమితం. కవి సృష్టిలోని రసాలు కేవలం ఆనంద దాయకాలు. అపరిమితాలు. కవి సృష్టిలోని రసం అత్యంత మనోజ్ఞమైంది. ఈ దృష్టితో మనం ఆలోచిస్తే అటు శబ్దాలంకార శోభాయమానంగా పోతన సృష్టించిన పద్యమయ ప్రపంచం, ఇటు అన్నమయ్య అలౌకికానంద పరవశుడై సృష్టించిన సంకీర్తనా ప్రపంచం బ్రహ్మసృష్టి సంకీర్తనా ప్రపంచం బ్రహ్మసృష్టికన్నా ఆనంద దాయకమైందని చెప్పక తప్పదు.

ప్రాచీన కాలంలో సమాజ నిర్మాణం అధికంగా మతం చేతిలో ఉండేది. ఆ మానవుని ఆధ్యాత్మిక, నైతిక సభ్యతలకు ధర్మమే ఆధారమై

ఉండేది. అటువంటి ధర్మప్రతిపాదనకు కృషిచేసిన వారు బమ్మెరపోతన. తాళ్ళపాక అన్నమయ్యలు. సాహిత్య సత్యంతో ఆత్మ సంబంధం ప్రధానంగా మూడు విధాలుగా ఉంటుంది. అందు మొదటిది జిజ్ఞాస. రెండవది ప్రయోజనం. మూడవది ఆనందం. ఆధ్యాత్మిక విషయాల ద్వారా జిజ్ఞాస ఏర్పడుతుంది. విజ్ఞాన విషయాల ద్వారా ప్రయోజనం కలుగుతుంది. వీటి కలయిక చేత ఆనందం సమకూరుతుంది. ఎంతో దీర్ఘంగా ఆలోచిస్తే కాని జిజ్ఞాస ఉత్పన్నం కాదు. అటువంటి జిజ్ఞాసను కలిగించేది పోతన అన్నమయ్యల సాహిత్యం. జిజ్ఞాస, ఆనందం, విజ్ఞానం - మూడు అంశాలు సాహిత్య లోకానికి అవసరమని మనం భావిస్తే వాటిని పోతన అన్నమయ్యలు పోషించిన తీరును మనం గమనించవచ్చు.

పోతన సీస పద్యాల్లోని శబ్దాలంకార సౌందర్యాన్ని అన్నమయ్య సంకీర్తనలలోని గానామృతాన్ని విని ఆనందించే వారు కొందరు. పోతన తన పద్యాలలోనూ, అన్నమయ్య తన సంకీర్తనల్లోనూ అలవోకగా ప్రయోగించిన సామాజిక పరమైన లోకోక్తులు, సామెతలు, జాతీయాలు, నానుడులు మొదలగు వాని యొక్క విశిష్టార్థాల్ని గ్రహించి అబ్బురపడేవారు కొందరు. అట్లే పోతన పద్యాలలోను, అన్నమయ్య సంకీర్తనలలోనూ కనిపించే విష్ణుతత్త్వాన్ని జీవాత్మ పరమాత్మల సంబంధాన్ని, మోక్షమార్గాన్ని, భక్తి పారవశ్యాన్ని మొదలగు అంశాలను అర్థం చేసికొని వాటిలోతుల్ని గ్రహించి ఆత్మానందాన్ని పొందేవారు కొందరు.

మ॥ లలిత స్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సు జ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్విజశ్రేయమై

ఇది పోతన భాగవత సారాంశం. (ప్రథమస్కంధం-22 పద్యం)

మ॥ శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమ వీధులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైల వల్లభరతి క్రీడా రహస్యంబులై
నుతులై తాళుల పాక యన్నయ వచోనూత్న క్రియల్ చెన్నగున్

ఇది అన్నమయ్య సంకీర్తనల సారాంశం.

పోతన, అన్నమయ్యల సాహిత్యాన్ని పరిశీలిస్తే వీరిరువురు ఒకే భావసామ్యం కలిగినవారుగా కనిపిస్తారు. వీరిరువురు ఒకే మనోభావ తత్త్వంగల పవిత్ర స్నేహితులా అన్న (భావం) సందేహం కూడా వస్తుంది. ఆలోచిస్తే దీనికి రెండు కారణాలు కనిపిస్తాయి. ఒకటి ఇద్దరూ హరితత్త్వాన్ని కొనియాడినవారే. అందులో సాక్షాత్తు మహావిష్ణువే వీరి చిత్తంలో ఉండి అతని (శ్రీహరి) గుణగణాలను కీర్తింపజేశాడు.

"పలికెడిది భాగవతమట పలికించు విభుండు రామభద్రుండట" అని రామభద్రుడే తన చేత భాగవతాన్ని పలికించాడని పోతన చెప్పుకున్నాడు.

అట్టే అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడే తన నాలుకపై నుండి నానా సంకీర్తనలు పలికించాడని చెప్పుకున్నాడు.

**నా నాలికపై నుండి నానా సంకీర్తనలు**
**పూని నాచే పొగిడించితివి**
**వేనామాల వెన్నుడా వినతించనెంతవాడ**
**కానిమ్మని నీకీపుణ్యము గట్టితివింతె అయ్యా**

కాబట్టి వీరి మనోభావాలు ఒక్కటిగా ఉండడంలో ఆశ్చర్యం లేదు. కారణం వీరిరువురు అనన్యమైన భక్తిగల భగవత్ ఉపాసకులు. భక్తికి చిక్కిన విధంగా భగవంతుడు మరొకవిధానానికి చిక్కడు. అని పోతన చెప్పినట్లుగా భక్తి గొప్పతనం అలాంటిది. భక్తి గల వీరి మనస్సుల్లో ఎల్లప్పుడు భగవంతుడు అంతరాత్మగా ఉన్నాడు. కావున ప్రత్యక్షంగా పోతన భాగవతాన్ని, అన్నమయ్య సంకీర్తనలను రచించినా పరోక్షంగా ఆ పని చేయించినవాడు శ్రీమహావిష్ణువే అని తెలుస్తుంది. ఆవిధంగా భగవంతుడే మానోటి వెంట పలికించాడని చెప్పుకొని వారు వారి వినయాన్ని చాటుకున్నారు.

"భాగవతులు తెలిసి పలుకుట చిత్రము..., నే బలికిన భవహరమగునట" (1-17) అని పోతన, నేనొక్కడ లేకుండితే నీకృపకుఁ బాత్రమేది పూని నా వల్లనే కీర్తిబొందేవు నీవు" (3-48) అని అన్నమయ్య చెప్పుకున్నాడు.

పోతన పద్య పోకడలు, అన్నమయ్య కీర్తన పోకడలు గమనిస్తే భావసామ్యం కనిపిస్తుంది. శరద్రాత్రిలో గానం చేసే శ్రీకృష్ణుని సన్నిధికి చేరారు గోపికలు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు కొంతసేపు కనిపించకపోగా ఒక గోపిక శ్రీకృష్ణుని అన్వేషిస్తూ అతని రూపలావణ్యాలను ఇలా చెపుతుంది.

ఉ॥ నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు నవ్వు రా
జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబు దెచ్చెనో
మల్లియలార! మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే!
(10పూ-1010)

ఇదే పద్యాన్ని పోలినది అన్నమయ్య కీర్తనలో కూడా కనిపిస్తుంది. అయితే ఇక్కడ అన్నమయ్య తానే ఒక గోపికయై గొల్లవాడలోని గోపికలను అడుగుతున్న సందర్భంలో శ్రీ కృష్ణుని రూపురేఖలు వర్ణించబడ్డాయి.

వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంట
చెందమ్మికన్నువాడు చేతిపిల్లగోవి వాడు
ఇందు వచ్చి కంటారా యేలరే అమ్మ
మందల పశువుల వాడు మకరాంకములవాడు
యెందునున్నాడో చెప్పరే యేల దాచేరమ్మ
నెమలిపింఛము వాడు నీలిమేఘ కాంతివాడు
రమణుడాతడు మొక్కేను రమ్మనరమ్మ
జమళి చేతులవాడు శంకు చక్రముల వాడు
అమరనీపాల జిక్కునట చూపరమ్మ (18-14)

పోతన అన్నమయ్య గోపికల విరహాన్ని గమనించినట్లయితే వీరిరువురి గోపికల మనోభావాలు ఒక్కటిగానే ఉన్నట్లు వ్యక్తమవుతాయి.

శ్రీకృష్ణుడు గోపబాలురతో చల్దులారగించే సన్నివేశంలో బ్రహ్మాది దేవతలు ఆశ్చర్యం చెంది కీర్తించిన సందర్భంలో పోతన అన్నమయ్యల భావసామ్యాలు ఈ క్రింది పద్య సంకీర్తనల్లో గమనించవచ్చు.

వైకుంఠుని నుతియించ వినుతులు వననిధిగురిసిన వానలు
ఆ కమలోదరు గోరని కోరికెలందని మానిఫలంబులు
శ్రీకాంతుని పైజేయిని భక్తులు చెంబు మీది కనకపు బూత
దాకొని విష్ణుని తెలియని తెలువులు తగ నేటి నడిమిపైరులు

వావిరిఁగేశవునొల్లని బదుకులు వరతఁగలవు చింతపండు
గోవిందుని కటు మొక్కని మొక్కులు గోడలేని పెను చిత్రములు
భావించి మాధవుపై లేని తలపులు పలుమేఘముల వికారములు
శ్రీ వేంకటపతి కరుణ గలిగితే జీవుల కవియే వినోదములు

(2-235)

పరమాత్మ తత్త్వాన్ని కొనియాడిన తీరులో పోతన అన్నమయ్యల భావసామ్యం క్రింది పద్య సంకీర్తనల ద్వారా తెలుస్తుంది.

సీ॥ భావించి కొందఱు బ్రహ్మంబు నీవని
తలపోసి కొందఱు ధర్మమనియు
జర్చించి కొందరు సదసదీశ్వరుడని
సరసవిగొందరు శక్తి సహితుడనియు
జింతించి కొందరు చిరతరుండవ్యయ
దాత్మ తంత్రుడు పరుండధికుడనియు

దొడరి యూహింతురు తుదినద్వయ
సదసద్విశిష్ట సంశ్రయుడవీవు

తే॥ తలపనొక్కింత వస్తు భేదంబు గలదె
కంకణాదుల పసిడి యొక్కటి గాదె
కడలు పెక్కైన వార్ధి యొక్కటి గాదె
భేదమంచును నిను వికల్పింపరాదు (8-386)

అట్లే అన్నమయ్య,

ఎంత మాత్రమున ఎవ్వరుదలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులను శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులాది భైరవుండనుచు

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తి రూపు నీవనుచు
దరిశనములు మిము నానా విధులను తలపుల కొలదుల భజింతురు
సిరుల మిమునే యల్పబుద్ధి దలచిన వారికి అల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని దలచిన మన బుద్ధులకు ఘనుడవు

నీ వలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరపు
ఆవల భాగీరథి దరిబావుల ఆ జలమే ఊరిన యట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని వున్న దైవమని
ఈవలనే శరణనెదను ఇదియే పరతత్త్వము నాకు (2-159)

పోతన అన్నమయ్యలు విష్ణువును సర్వాంతర్యామిగా కీర్తించిన క్రింది పద్య సంకీర్తనల ద్వారా వీరి భావసామ్యం కనిపిస్తుంది.

**హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పని లేదా**
**హరి మయము గాని ద్రవ్యము**
**పరమాణువు లేదు. వంశ పావన వింటే**

**(2-17 పోతన)**

**విశ్వమెల్ల నీ విరాట్ రూపమే**

**(3-530, అన్నమయ్య)**

**సర్వం విష్ణుమయంబుగాన**

**(2-581, అన్నమయ్య)**

**విశ్వ ప్రకాశునకు వెలియడలో నేడ**

**(1-355, అన్నమయ్య)**

శివుని ఆజ్ఞ లేనిదే చీమైన కుట్టదన్నట్లు భగవత్ సంకల్పం మీదనే అన్నీ జరుగుతాయి. దైవానుగ్రహం ఉంటే అన్ని అబ్బుతాయని లేకపోతే లేదన్న విషయాన్ని తెలిపే క్రింది పద్య సంకీర్తనల ద్వారా పోతన అన్నమయ్యల భావస్వామ్యం కనిపిస్తుంది.

**ఆ॥ ధనము వీధిబడిన దైవ వశంబున**
**నుండు బోవు మూలనున్నదైన**
**నడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు**
**రక్షితుండు మందిరమున జచ్చు (7-49, పోతన)**

**రావలెనన్నవి రాకమానవు**
**పోవలెనన్నవి పోకుండవు**
**ఆవలనీవల అలమట లేటికి (3-562, అన్నమయ్య)**

పోతన అన్నమయ్యల మనస్తత్త్వభావాలు ఒకే విధంగా ఉంటాయనడానికి క్రింది పద్యసంకీర్తనే నిదర్శనం.

**పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లా నిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృత స్వాదసం**
**ధానుండై మఱచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా।"**
**(7-123)**

పై పద్యం ద్వారా సర్వకాల సర్వావస్థల యందు హరి ధ్యానంతో తన్మయత్వాన్ని పొందే ప్రహ్లాద తత్త్వం పోతనదని తెలుస్తుంది. అట్లే సంకీర్తనకంటే సుఖాన్నిచ్చేది మరొకటి లేదని, ఎల్లప్పుడు శ్రీహరి సంకీర్తన గానం చేస్తుండడమే ఇహపర సాధనం అన్న తత్త్వం కలవాడు అన్నమయ్య.

**ఇహపర సాధనమిది యొకటే**
**సహజపు మురారి సంకీర్తనొకటే (4-16)**
**సతతము శ్రీహరి సంకీర్తనం త**
**ద్వ్యతిరిక్త సుఖం వక్తుం నాస్తి (1-4)**

పోతన అన్నమయ్య లిరువురు రాజాస్థానానికి దూరంగా ఉన్నవారే, ఆత్మ విశ్వాసం కలవారు. వీరి బ్రతుకు తెరువు హరి సంకీర్తనం తప్ప అన్యుల కీర్తించి ధన సహాయాన్ని పొందాలన్న తత్త్వం కాదు. సంగీత

త్రిమూర్తులలో ఒకరైన త్యాగరాజస్వామి వారిది కూడా వీరి తత్త్వమే అందుకే అతడు "నిధి చాలా సుఖమా, రాముని సన్నిధి చాలా సుఖమా" అని కీర్తించాడు. రాజాశ్రయానికి కూడా దూరంగా ఉన్నాడు. క్రింది పోతన అన్నమయ్యల పద్య పదాలు గమనించినట్లయితే లౌకిక సంపద మీద ఏ మాత్రం వీరికి ఆశలేదు. అలౌకికమైనది, శాశ్వతమైనది అయిన ముక్తి సంపదపై వీరికి మక్కువ ఎక్కువ అని తెలుస్తుంది.

**నిన్నె కాని పలుకనేరదు మా జిహ్వా**
**(10-పూ-988, పోతన)**

**"నరహరి కీర్తన నానిన జిహ్వా"**
**నొరుల నుతింప నోపదు జిహ్వా**
**(2-144-అన్నమయ్య)**

**ధనమదాంధుల కొలువేల తాపసులకు**
**(2-21, పోతన)**

**వడినితరుల కొలువగ వచ్చునా**

భాగవతం రచించే అవకాశం రావడం పూర్వజన్మసుకృతమని పోతన భావించాడు.

**మ॥ ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్విం బురాణావళుల్**
**తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో**
**తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిందెనిగించినా**
**జననంబున్ సఫలంబు జేసెద బునర్జన్మంబు లేకుండగన్**
(శ్రీమదాంధ్ర మహాభాగతం-ప్రథమస్కంధం-19 పద్యం)

అట్లే అన్నమయ్య కూడా భగవత్ సంకీర్తనలు గానం చేయడం సుకృతమని భావించాడు.

నెమ్మది వేంకట నిలయుని దాసుల
సొమ్మై నిలుచుట సుకృతమది (1-263)

భాగవత ప్రశంస :

పోతన భాగవత ప్రశస్తిని, అన్నమయ్య సంకీర్తన ప్రశస్తిని కొనియాడారు.

పోతన :

కం॥ నిగమములు వేయు చదివిన
సుగమంబులు గావు ముక్తిసుభగత్త్వంబుల్
సుగమములు భాగవతవను
నిగమంబు బఠింప ముక్తి నివసనము బుధా (1-139)

ఆ॥ వేదకల్పవృక్ష గళితమై శుక
ముఖ సుధా ద్రవమున మొనసియున్న
భాగవత పురాణ ఫలరసాస్వాదన
పదవి గనుడు రసిక భావవిదులు (1-35)

తే ॥ శ్రీమంతమై ముని శ్రేష్ఠ కుతంబైన
భాగవతంబు సద్భక్తితోడ
వినగోరువారల విమల చిత్తంబుల
జెచ్చర నీశుండు చిక్కుకాక (91-34)

"సత్యం పరం ధీమహి" యను గాయత్రీ ప్రారంభమున
గాయత్రీ నామ బ్రహ్మ రూపంబై (1-33)

చం॥ లలిత స్కంధము గృష్ణమూలము శుకాలాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై
(1-20)

ఆ॥వె॥ అతి రహస్యమైన హరిజన్మకథనంబు
మనుజుడెవ్వడేని మాపు రేపు
జాలభక్తి తోడ జదివిన సంసార
దుఃఖరాశి బాసి తొలగిపోవు" (1-64)

అన్నమయ్య :

అన్ని మంత్రంబులిందె ఆవహించెను (4-438)

అన్నిటికిది పరమౌషదము (4-358)

కలియుగంబునకు గలదదియె
వెలసిన పంచమవేదమె కలిగె (4-2-60)

పంచమవేదపు పద్మాక్షునామము
అంచెపాపహర మౌషధము (3-564)

కామధేనువిదె కల్పవృక్షమిదె
ప్రామాణ్యముగల ప్రసన్నులకు (2-488)

ఏవం శ్రుతిమతమిదమేవ త
ద్భావయతు మతః పరం నాస్తి
అతుల జన్మ భోగాసక్తానాం
హితవైభవ సుఖమిదమేవ

సతతం శ్రీహరి సంకీర్తనం త
ద్వ్యతిరిక్త సుఖం వక్తుం నాస్తి
బహుళ మరణ పరిభవ చిత్తానా
మిహపర సాధన మిదయేవ

అహివయున మనోహర సేవా త
ద్విహరణం వినా విధిరపి నాస్తి
సంసార దురిత జాడ్య పరాణాం
హింసా విరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరిపతేః ప్ర
శంసైవా పశ్చాదిహనాస్తి (1-4)

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం
సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమనగించు సంకీర్తనం

జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతము దలచుడే సంకీర్తనం

సామజము గాచినది సంకీర్తనం
సామమున కెక్కుడీ సంకీర్తనం
సామీప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణు సంకీర్తనం

జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వాడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యము లిచ్చు సంకీర్తనం
శమదమాదుల జేయు సంకీర్తనం

జలజాసనుని నోరి సంకీర్తనం
చలిగొండ సుత దలచు సంకీర్తనం
చలువకడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలచుడీ సంకీర్తనం

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియ పో సంకీర్తనం
సరుస వేంకట విభుని సంకీర్తనం
సరుగనను దలచుడే సంకీర్తనం (1-343)

ఇహపర సాధన మిది యొకటె
సహజపు మురారి సంకీర్తనొకటె (4-16)

చాలదా హరి సంకీర్తనం గల
మేలది దీనినే మొరసిరి ఘనులు

తలప వేద శాస్త్రములు గానక
అలరుచు వాల్మీకాదులు
తలకొని హరిమంత్రమే గల బేర్కొని
అలవి మీర గడు నధికములైరి

ఇతర దైవముల నెఱగనేరక
పత్రి లేని మహిమ భార్వతి
మతిదలపుచు హరి మంత్రమై పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె

చదువులు పలుమరు జదువనోపక
అదివో నారదాదులు
పదిలపై వేంకటపతి హరినామమే
వలదకిదియె జీవనమై మనిరి (1-205)

చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు
చాలదా హితమైన చవులెల్ల నొసగ
తగు వేంకటేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్పభూజంబు వలెనుండ (1-52)

నళినదళాక్షుని నామ కీర్తనము
కలిగి లోకమున కలదొకటి (4-314)

**నారాయణాయ నమో నమో నానాత్మనే నమో నమో**

ఈ రచనలనే ఎవ్వరు తలచిన ఇహపర మంత్రము లిందరికీ

**గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో**
**భావజగురవే నమో నమో ప్రణవాత్మకే నమో నమో**
**దేవేశాయ నమో నమో దివ్య గుణాయ నమో నమో**
**ఈ వరుసలచే ఎవ్వరు తలచిన ఇహపరమంత్రములిందరికి**

**పరిపూర్ణాయ నమో నమో ప్రణవగ్రాయ నమో నమో**
**చిరంతనాశ్రీ శ్రీ వేంకట నాయక శేషశాయినే నమో నమో**
**నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో**
**ఇరవుగ నీ గతి నెవ్వరు దలచిన ఇహపర మంత్రములిందరికి**

**(1-380)**

ఈ విధంగా భాగవత, సంకీర్తన ప్రాశస్త్యాన్ని కొనియాడి ముక్తి కోసం పోతన భాగవతాన్ని, అన్నమయ్య సంకీర్తనలను రచించారు.

"శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్" (1-1) అని పోతన తన కైవల్య కాంక్షను తెలిపాడు. అట్లే అన్నమయ్య " ..... ఈతని సంకీర్తన మోక్షమునకు" (3-63) అని మోక్షకాంక్షను తెలిపాడు.

భక్తి విధానాలను గురించి శ్రీకృష్ణభగవానుడు 'భగవద్గీత' లో చెపుతూ అందులో మొదటి తరగతి వారిని గురించి ఇలా చెప్పాడు.

**శ్లో ॥ సతతం కీర్తయంతోమాం యతంతశ్చ దృఢవ్రతాః ।**
**నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥**

**(భగవద్గీత, 9-14)**

(నా గుణాలను, దివ్యనామాలను, అద్భుతలీలలను కీర్తిస్తూ నాకు భక్తి యుక్తులై ప్రణామాలు ఆచరించి తీవ్ర నిశ్చయంతో యత్నపరులై ఇంద్రియాలను, మనసును నిగ్రహించి నాయందు మనసును లగ్నం చేసి నన్ను ఉపాసిస్తారు).

ఈ మొదటి తరగతికి చెందినవారే పోతన, అన్నమయ్య. వీరిరువురు భక్తి ప్రాశస్త్యాన్ని కొనియాడారు. కవులు ఎందరైనా ఉండవచ్చు. అయితే "చదువది ఎంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న యా చదువు నిరర్థకంబు" అన్నట్లు ఎంత పాండిత్యం ఉన్నా రసజ్ఞత అనే భక్తి సంస్కారం లేని వారి కావ్యాలు, రచనలు వన్నెకెక్కవు. అయితే ఈ సూక్తి అనేది అందరికీ అలవడదు. అది పూర్వజన్మ సుకృతం కొద్ది లభిస్తుందని అంటాడు అన్నమయ్య.

**భక్తి ప్రశంస :**

**కం॥ చిక్కడు వ్రతముల గ్రతువుల**
**జిక్కడు దానముల శౌచశీల తఫములం**
**జిక్కడు యుక్తిని, భక్తిని**
**జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ**

"అంధేందూదయముల్ మహా బధిర శంఖారావముల్ మూకసద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావళీ బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడసద్గ్రంథంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సంసారముల్".

చం॥ హరిచరణారవింద యుగళార్చన సన్నుతి భక్తి యోగముల్
నిరతము గల్గువారె భవనీరజ గర్భుల కందరాని భా
సుర పదమందు జేరుదురు సూరి జనస్తవనీయ! యట్టి స
త్పురుషల పూర్వజన్మ ఫలమున్ గణుతింప దరబె యేరికిన్?

కం॥ ప్రబ్బిన భక్తిని హరిపై
గబ్బంబులు సెప్పి కవులు కైవల్యశ్రీ
కబ్బుదురుట హరిపోషణ
మబ్బిన తలిదండ్రులెచటి కబ్బుదురో తుదిన్

భక్తితో హరిజన్మకథల్ని చదివిన వానికి సంసార దుఃఖం తొలగిపోతుందని చెపుతున్నాడు.

ఆ॥ అతి రహస్యమైన హరిజన్మ కథనంబు
మనుజుడెవ్వడేని మాపు రేపు
జాల భక్తి తోడ జదివిన సంసార
దుఃఖరాశిబాసి తొలగిపోవు (1-66)

"భక్తియుక్తుడు లోకేశ పదమునొందు" అని ఏ పని చేసినా భక్తితో చేయాలన్నదే పోతన మతంగా తెలుస్తుంది.

**అన్నమయ్య :**

"సకల కర్మములచేత సాధ్యముకాని నీవు
వొక యించుకంత భక్తి కొగిలోనైతివి"

"సకల శాంతి కరము సర్వేశ నీపై భక్తి సర్వేశ"

పదిలమై వేంకటపతి భక్తి కలిగితేను
తుది పదంబునకెల్ల తొడవునపుడే

అందుకే కోనేటిరాయుడైన శ్రీవేంకటేశ్వరుని భక్తితో కొలవండని తెలియజేస్తున్నాడు అన్నమయ్య.

"కొలువుడీ భక్తి కొండల కోనేటి
నిలయుని శ్రీ నిధియైన వాని"
"భక్తి నీపై దొకటె పరమ సుఖము
యుక్తి చూచిన నిజంబొక్కటే లే"

అతి రహస్యమిది అచ్యుతుపై భక్తి
పత్రి లేని పరమ పావనము
చతురలై తెలిపిరి సనకాది మునులు
తతి దొరకుట సుకృత ఫలము కొలది

సదానందము సర్వేశ్వరా నీ
పదారవిందము పై భక్తి

మహిలో శ్రీ వేంకటేశు మరి నీదాసుడనైతి
బహుభక్తి నీ మీద పచరించేనయ్యా

ఇహమే కాని పరమే కాని
బహుళమై హరి నీపై భక్తే చాలు.

# 8.అన్నమయ్య సంకీర్తనలలో ఆచార్యుడు

ఆచార్యుడంటే ముందుగా తాను ఆచరించి తనను అనుసరించే వారికి మార్గదర్శకుడై మెలగేవాడు. అన్నమయ్య జన్మతః ఆచార్యుడు మాత్రమే కాదు. భక్తి, జ్ఞాన, వైరాగ్య, క్రియా యోగాలలోనూ, సంగీత సాహిత్య విద్యలలోనూ ఎందరికో మార్గదర్శకత్వం వహించిన పరిపూర్ణ ఆచార్యుడు.

ఆచార్యుడైన అన్నమాచార్యునికే నిజమైన ఆచార తత్త్వం తెలిసింది. అందుకే ఆయన రాసిన వేల సంకీర్తనలలో అనేక చోట్ల ఆచార్య ప్రసక్తి కన్పిస్తుంది.

ఆచార్యుడంటే గురువని సామాన్యార్థం చెప్పవచ్చు. ఆధ్యాత్మిక జీవన పథాన్ని చూపగల మహనీయుడే గురువు. మోక్షాసక్తి గలవాడు మంచి గురువును ఆశ్రయించాలి. ఆచార్యుని అనుగ్రహం లభిస్తేనే శిష్యునికి భగవంతుని సాక్షాత్కారం లభిస్తుంది. అందుకే ఆచార్యుడు భగవంతునితో సమానమైనవాడని దివ్య ప్రబంధం పేర్కొంటోంది. అన్నమయ్య కూడా భగవద్రామానుజుల వారినే తన దైవంగా భావించాడు. శిష్యవాత్సల్యం చూపడం ఆచార్యుని పరమ కర్తవ్యమయితే, ఆచార్యులనే దైవంగా కొలవడం శిష్యరేణువు పరమవిధి. ఈ తత్త్వం తెలిసినవాడు అన్నమయ్య. అందుకే

**అందమైన రామానుజాచార్య మతమును**
**అందుకొని నిలచినాడన్నమయ్యా**
**విందువలె మాకును శ్రీవేంకటనాథుని నిచ్చె**
**అందరిలో దాళ్ళపాక అన్నమయ్యా**

అంటూ చిన్నన్న చేత కీర్తింపబడ్డాడు. చిన్నన్న తనకు ఆచార్య స్థానంలో ఉన్న అన్నమయ్యను, అన్నమయ్యకు ఆచార్యస్థానంలో రామానుజుల్ని కీర్తించడం ద్వారా పారంపరిక ఆచార్యత్వ వైశిష్ట్యాన్ని తెలియజేశాడు. శిష్టభావాలు, వైశిష్టలక్షణాలు అకస్మాత్తుగా సంభవించేవి కావు. క్రమక్రమంగా ఆచార్యులనుండి శిష్య ప్రశిష్యుల ద్వారా సంక్రమిస్తాయి. రామానుజుల యొక్క అంశ ఆ విధంగా తదనంతర అనుయాయులపై ప్రసరించి, వారిని కూడా దివ్యులుగా చేస్తుందన్నదే చిన్నన్న అంతరంగం.

**సహజ వైష్ణవాచార వర్తనుల**
**సహవాసమె మా సంధ్య**
**అతిశయమగు హరి సంకీర్తనమే**
**సతతంబును మా సంధ్య**
**మతి రామానుజ మతమే నాకును**
**చతురత మెరసిన సంధ్య**

అన్న అన్నమయ్య మాటలు శిష్య శుశ్రూషను ప్రతిపాదిస్తాయి. ఆచార్యులు ఉపదేశించిన మార్గంలోనే సజ్జీవనా యాత్ర జేయాలని, ఆచార్యుల సంకల్పబలమే శిష్యుల పాలిట శ్రీరామరక్ష అని అన్నమయ్య భావిస్తాడు.

ఇక్కడ అన్నమయ్య వలెనే దివ్య ప్రబంధంలో మధురకవి ఆళ్వారులు కూడా "కణ్ణినుణ్ శిరుత్తామ్బు" అనే పాశురంలో ఆచార్య ప్రభావాన్ని వర్ణించారు. నమ్మాళ్వారును తన గురువుగా స్వీకరించి తన జీవితం ధన్యమైనదని భావించడమే కాక-

**నణ్ణిత్తెన్ కురుగూర్ నమ్బి యెన్నక్కాల్**
**అణ్ణిక్కు మము దూఱుమ్ ఎన్నావుకే**

ఆచార్య నామ సంస్మరణంతో నా జిహ్వాకు అమృతాస్వాదనంగావించి నన్నానందింపజేస్తోందని పరవశించి పోయాడు. ఇటువంటి భావనలు అన్నమయ్యకు తెలుసు. దివ్య ప్రబంధాన్ని మధించి వైష్ణవాన్ని ధరించిన శుద్ధ వైష్ణవుడు అన్నమాచార్యుడు. ఆ ప్రభావం వల్లనే మధురకవి ఆళ్వార్‌ను అనుసరించి తన సంకీర్తనలలో ఆచార్య ప్రభావాన్ని కొనియాడాడు.

**శ్లో ॥ మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయంతః పరస్పరమ్ ।**
**కథయం తశ్చ మాం నిత్యం తుష్యంతి రమంతి చ ॥**

నా యందే మనసు లగ్నం చేసి నాగురించి తెలుసుకొని ఇతరులకు తెలియజెప్పి, సజ్జన సాంగత్యం చేస్తే తృప్తి లభిస్తుందని గీతాచార్యుడు హితబోధ గావించాడు. ఆచార్యుల సాహచర్యంలో తరించడం వైష్ణవంలో అత్యంత ప్రాధాన్యం కల విధి. కులశేఖరాళ్వారుల ముకుందమాలా స్తోత్రంలో

**మజ్జన్మనః ఫలమిదం మధుకైట భారేః**
**మత్ప్రార్థనీయా మదనుగ్రహ ఏష ఏవ ।**
**తద్భృత్య భృత్య పరిచారిక భృత్య భృత్య**
**భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథః ॥**

భాగవతోత్తముల మధ్య ఉచ్ఛనీచాది భేదం ఉండదు. భగవంతుని భక్తులైన వారంతా సమానులే. వారి సాంగత్యం, సహజీవనం వారిని

ఆచార్యులుగా భావించి సేవ చెయ్యడమే జన్మఫలమని భావించి తరించడం శ్రీవైష్ణవసంప్రదాయం లోనూ, దివ్యప్రబంధ నిర్మాతలైన ఆళ్వారులలోనూ కన్పిస్తుంది.

ఈ భావాన్నే అన్నమయ్య ఈ విధంగా ప్రస్తావించాడు.

**పరమ భాగవత పద సేవనమే**
**సరవి నెన్న మా సంధ్య**
**సిరివరు మహిమల చెలువొందగ వే**
**సరక వినుటి మా సంధ్య**

అంటూ ఆచార్య పదసేవను మించిన ధ్యాస వేరే ఉండకూడదని నొక్కి వక్కాణించాడు.

**ఇన్ని జన్మములేటికి హరిదాసు**
**లున్న వూర దానుండిన జాలు**

**నిత్యులు ముక్తులు నిర్మల చిత్తులు**
**నిగమాంత విదులు వైష్ణవులు**
**సత్యము వీరల శరణని బ్రదుకరో**
**సాటికి బెనగక జడులారా!**

**తప్పరు తము పట్టిన వ్రతమెప్పుడు**
**దైవమొక్కటే గతి యనుచు**
**ఒప్పగు తమ పాతివ్రత్యంబున**
**నుందురు సుఖముగ వైష్ణవులు**

కప్పిన శ్రీవేంకటపతి దాసులు
కర్మ విదూరులు సాత్త్వికులు
చెప్పకుడితరులు సరిగా వీరిని
సేవించగనే ధన్యుడనైతి

అంటూ ఆళ్వారులను తన ఆచార్య స్థానంలో నిలుపుకొని వారి సల్లక్షణాల్ని, సచ్చరిత్రను తన సంకీర్తనలలో పొందుపరచి వారి ఆశయాలకు అనుగుణంగా తాను తన అనుయాయులకు ఆచార్యుడై, సార్థక నామధేయుడైనాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

# 9.అన్నమయ్య దర్శించిన వైష్ణవక్షేత్రాలు-కడప జిల్లా

ఏ ఆలోచనా సరళి అయినా ప్రజలలో ప్రచారం పొందాలంటే ప్రచారకులు వారితో కలిసిపోయి వారిబాణిలో చెప్పగల్గిన సమర్థులై ఉండాలి. అటువంటప్పుడే వారికి ప్రజల ఆదరణ తప్పక ఉంటుంది. అటువంటి వ్యక్తులను పాలకులు కూడా పరికించి చూడడం తటస్థమవుతుంటుంది. ఆలోచనా సరళులనేకాలు. అవి రాజకీయాలకు సంబంధించినవి కావచ్చు, సాంఘిక సమస్యలవీ కావచ్చు. మతానికి సంబంధించినవి కావచ్చు. మత ప్రచారానికి రాజాస్థానాలు, మఠాలు, ఆలయాలు, ప్రధాన కేంద్రాలు. "రాజాసుమతో ధర్మః" అనడం బట్టి మతం మారుతూ ఉంటుంది. మఠాలు మతప్రవర్తకుల ఆలోచనా సరళికి నిలయాలు. రామానుజకూటం, దాసకూటం, వ్యాసకూటం మొదలగునవి అట్టివి. ఆలయాలు ఇటు రాజులకు అటు మఠాధిపతులకు ఇటు ప్రజానీకానికి అవశ్యం సందర్శించవలసిన ప్రదేశాలు. అవి కళలకు కాణాచి. మతప్రచారానికి ఆయువుపట్టు కేంద్రాలు. కనుకనే హైందవ జీవితంలో ఆలయాలకు అగ్రస్థానం ఉంది.

ఆంధ్రవాగ్గేయకారుల్లో అనేక దివ్య స్థలాలను దర్శించి కీర్తించిన ఘనత తాళ్ళపాక అన్నమయ్యది.

**కడపజిల్లా :**

చారిత్రకంగా కడపజిల్లా చాలా ప్రసిద్ధికెక్కింది. పల్లవులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, తొలి చోళరాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. క్రీ.శ.1198 లో కాకతీయ గణపతిదేవుడు చోళ సామంతుల్ని ఓడించి కడపను కాకతీయ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. అటు మహమ్మదీయుల పాలనలో కొంతకాలం ఉండి విజయనగర

రాజుల వశమైంది. విజయనగర రాజులు ఈ ప్రాంతంలో తమ కళా నైపుణ్యాన్ని చాటి చెప్పే అనేక ఆలయాలను నిర్మించారు. కమనీయమైన దర్శనీయ స్థలాలకు ఆటపట్టు కడపజిల్లా. జిల్లాలో ప్రవహించే వివిధ నదీ తీరాలలో పుణ్యక్షేత్రాలు వెలిశాయి. అన్నమయ్య జన్మించిన జిల్లా కూడా ఇదే. పైగా అన్నమయ్య ఆలయ కీర్తనలలో ఎక్కువ భాగం కడపజిల్లా దేవాలయాలవే కావడం గమనించదగ్గ అంశం.

**ఒంటిమిట్ట కోదండరాముడు :**

కడపజిల్లాలో చాలా ప్రసిద్ధి పొందిన చారిత్రాత్మక గ్రామం ఒంటిమిట్ట. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలో ఉంది. ఈ గ్రామం మండల కేంద్రం కూడా. ఇది కడపకు 15 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

ప్రాచీనకాలంలో ఈ ప్రాంతం దొంగలకు నిలయమై కీకారణ్యంగా ఉండేది. ఈ గ్రామాన్ని ఒంటడు, మిట్టడు అనేవారు నిర్మించడం వల్ల దీనికి ఒంటిమిట్ట అనే పేరు వచ్చింది. ఒంటిమిట్ట అంటే ఒకే రాయి అనే అర్థం ఉంది. రామలక్ష్మణ సీతా ప్రతిమలు ఒకేశిలపై చెక్కడం వల్ల దీనికి ఏకశిలా నగరమని కూడా పేరు. ఈ స్వామి త్రేతాయుగంలో స్వయంభువుగా వెలిశాడని జాంబవంతునిచే ప్రతిష్ఠింపబడిందని కథ. ఇక్కడ మార్కండేయుడు పరమేశ్వరుని ధ్యానించి మృత్యుంజయుడై నాడని, శృంగి పరీక్షిత్తుని శపించి తన తొందరపాటుకు చింతించి ఇక్కడ తపం చేసి పాప విముక్తుడైనాడని మరోకథ.

**శాసనాలలో ఆలయవిశేషాలు :**

ఈ ఆలయంలో కనిపించే శాసనాలలో మొదటిది క్రీ.శ. 1554వ సంవత్సరం కల్లూరి లింగరాజు తిమ్మయ్య కుమారుడైన లింగప్ప శాసనం. ఇతడు ఒంటిమిట్ట శ్రీ రఘునాయకుల నిత్య పూజలకు అంగరంగ వైభవాలకు, మాసోత్సవాలకు మరియు పంచపర్వాలకు 'పులుపతూరు' యిందుకు చెలేరనుతూంపల్లె. ఒంటిమిట్టలోని బుగెపల్లె-ఒంటిమిట్టకు చెందే కొంత మడి భూములను కట్టడి చేశాడు. రెండవది 17వ శతాబ్దంలో ఒంటిమిట్ట రామాలయంలో సిద్ధిరాజు ద్వారపాలకులను ప్రతిష్ఠించాడు.

మూడవది శా.శ. 1744వ సంవత్సరంలో తిప్పన సూరారెడ్డి పోలిచెంచు నారాయణరెడ్డి, మడకల శేషారెడ్డి, దామ గంగిరెడ్డి, చంనెల కొండారెడ్డి, కరణం పేరయ అనేవారు ఒంటిమిట్ట కోదండరామస్వామికి అఖండ దీపానికి ప్రతినెల నెయ్యిని సమర్పించారు. నాల్గవది శా.శ. 1715వ సంవత్సరంలో మాడుపూరు తాలూకాలో 18 గ్రామాల రెడ్లు, కరణాలు ఒంటిమిట్ట కోదండ రామస్వామి తళిగ, దీపారాధన, కైంకర్యాలకు నెలకు ఒక్కొక్క గ్రామం ఒక రూపాయి వంతున ఇచ్చేటట్లు ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్ట కోదండరామునికి సంబంధించిన ఒక కీర్తన అన్నమయ్య పదాలలో కనిపిస్తుంది.

**ఇందులోనే కానవద్దా యితడు దైవమని**
**విందువలె వొంటిమిట్ట వీరరఘురాముని ॥పల్లవి॥**

**యెందుచొచ్చె బ్రహ్మవరమిల రావణుతలలు**
**కందువ రాఘవుడు ఖండించునాడు**
**ముందట జలధి యే మూల చొచ్చె గొండలచే**
**గొంది బడగట్టి వేసి కోపించెనాడు**
**యేడనుండి మహిమలు యిందరికితడు వచ్చి**
**వేడుకతో హరువిల్లు విరచేనాడు**
**వోడక యింద్రాదులెందు వొదిగి రీతని బంటు**
**కూడబట్టి సంజీవి కొండ దెచ్చెనాడు**
**జముడెక్కడికి బోయి సరయువులో మోక్ష**
**మమర జీవుల కిచ్చే నల్లనాడు**
**తెమలి వానరులై ఈ దేవతలే బంట్లైరి**
**తిమిరి శ్రీ వేంకటపతికి నేడు నాడు ॥ఇందు॥ 5-302**

ఒంటిమిట్ట రఘురాముని వీర రఘురామునిగా కీర్తించుట ఇందలి విశేషం. పేరుకు తగ్గట్టె శ్రీరామచంద్రుని వీరోచిత కృత్యాలిందు ప్రస్తావించబడ్డాయి. అన్నమయ్య కాలం నాటికి 'వానర' సంపద ఒంటిమిట్ట. తిరుమలలో ఎక్కువ కావడం వల్లనేయేమో-

**తెమలి వానరులై ఈ దేవతలే బంట్లైరి**
**తిమిరి శ్రీ వేంకటపతికి నేడునాడు 5-302**

అని అన్నమయ్య భంగ్యంతరంగా ప్రస్తావించి ఉండవచ్చు.

**కోనచెన్నకేశవుడు :**

ఇది కడపకు దక్షిణంగా నాలుగుమైళ్ళ దూరంలో ఉండే పుణ్యక్షేత్రం.

దీన్నే పాలకొండ కోన అంటారు. ఇక్కడ వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఈ స్వామిని పాలకొండరాయుడు అని కూడా అంటారు. దట్టమైన పొదలు, కొండ చరియలు, జలాశయాలు ఉన్న ప్రాంతం. ఇది విహారయాత్రకు ప్రసిద్ధి.

**ఆలయ వివరాలు :**

ఆలయం పడమటి ముఖం కలిగి ఉంది. ముఖమంటపం ఉంది. గర్భగుడిపై విమానం ఉంది. ఆలయానికి ప్రాకారం గాని, గోపురాలు గాని లేవు. స్వామివారు నిలబడి భక్తులకు అభయమిస్తున్నాడు. ఈ స్వామివారికి పూజలు, పాంచరాత్ర ఆగమం ప్రకారం జరుగుతున్నాయి. అన్నమయ్య సంకీర్తనలలో చెన్నకేశవుడు-

**నేనొకటి సేయగాను నీవొకటి సేసేవు**
**కోనచెన్న రాయడ నీ గుణమింక మానవు**
**కందువ లంటుచు నిన్ను కౌగిట నించగాను**
**పొందుల నుప్పువేసి పొత్తు గూడేవూ**
**అందవు శ్రీవేంకటేశ అట్టెకోన చెన్నడవై**
**ముందు వెనకా గూడి మోహము చల్లేవూ ॥ నే॥ 17-423**

**గండికోట చెన్నకేశవుడు :**

కడపజిల్లాలో మైలవరం ఒక మండల కేంద్రం. మైలవరం మండలంలోని గ్రామం గండికోట. ఇది జిల్లాలో ప్రసిద్ధిపొందిన చారిత్రాత్మక దుర్గం. మద్రాసు బొంబాయి రైలు మార్గంలోని ముద్దనూరు రైల్వేస్టేషనుకు 15 మైళ్ళ దూరంలో ఉంది.

**శాసనాలలో ఆలయ విశేషాలు**

క్రీ.శ. 21.03.1545వ సంవత్సరం నరసింగయ్య దేవ మహారాజులు గారి పుత్రుడైన తిమ్మదేవమహారాజు శాసనం. ఇతడు గండికోట రఘునాధదేవునికి అమృతవడి, అంగరంగవైభవాలకు శ్రీరామజయంతి పుణ్యకాలమందు కట్టడి చేశాడు. క్రీ.శ. 29.12.1557వ సంవత్సరం ఔభలేశ్వర మహారాజులుంగారి శాసనం. ఇతడు గండికోట రఘునాథ నాయకుల దివ్య చరణారవిందములకు పెదకోమెర్ల గ్రామాన్ని రథ్యోదనానికి, అఖండ తిరువళికెకు, తెప్పతిరణాల మహోత్సవం, మకర సంక్రాంతి మహోత్సవం, పారువేటకు తోపు తిరుణాలకు, కోట తిరునాళ్ళ మహోత్సవానికి, ఊంజల్ తిరుణాలకు, విజయదశమి మహోత్సవానికి, తేరు తిరుణాల మహోత్సవానికి, పల్లకిసేవకు కట్టడి చేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో గండికోట చెన్నకేశవుడు :**

అన్నమయ్య ఈ స్వామిని దర్శించి నాలుగు కీర్తనలు రచించి గానం చేశాడు.

**చెల్లునా నీకీ పనులు చెన్నకేశా**
**కొల్లవాడ వౌర గండికోట చెన్నకేశా** **26-50**

అన్నమయ్య గండికోటలోని శ్రీరామచంద్రునిపై పాడిన కీర్తన -

**నావంటి నేతను నాగేటికొనదెచ్చితి**
**రావాడి తమకముతో రామచంద్ర**

**యీవేళ శ్రీవేంకటాద్రి నిరవై నన్ను గూడితివి**
**చేవదేరర గండికోట శ్రీరామచంద్ర 26-50**

**గాలివీడు వేంకటేశ్వరుడు :**

కడపజిల్లాలో గాలివీడు ఒక మండల కేంద్రం. ఇది పాకాల-ధర్మవరం రైలుమార్గంలోని కురబలకోట రైల్వేస్టేషనుకు 25 కి.మీ. దూరంలో ఉంది.

**స్థలపురాణం - స్థానికకథలు :**

పూర్వం ఈ ప్రాంతం పాలెగాండ్రకు కేంద్రం. గాలివీడు అనేది కుటుంబనామాన్నిబట్టి వచ్చింది. ఇక్కడ గాలి అనే ఇంటిపేరు గల కుటుంబం ఉండేది. ఆ కుటుంబం వారి పేరుతో ఇది గాలివీడుగా పిలువబడింది. వీడు అంటే నగరం, దండు అనే అర్థాలున్నాయి. గాలివీడులో వెలసిన స్వామి వేంకటేశ్వరుడు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య కీర్తించిన గాలివీడు వేంకటేశ్వరుడు :**

ఈ స్వామిపై అన్నమయ్య ఒక ఆధ్యాత్మిక కీర్తన పాడారు.

**ఒక్కడవె లోకాన కొడయువు నీవె**
**దిక్కుగా నెవ్వరు లేదు తిమ్మనాయడా**
**పాలికొల్ని చందిరెడ్డి వంటసేయ బొద్దులేక**
**గాలివీటి కాపురాన గసుగందగా**
**కోలుపుదు దినమూ నీ కొండ మీది నాయకులు**
**తేలుపర చేరుగనే తిమ్మినాయడా 11-4-1**

**చింతకుంట చెన్నకేశవుడు :**

కడప జిల్లాలో ప్రొద్దుటూరు ఒక మండల కేంద్రం. అందులో ఒక గ్రామం చింతకుంట. ఇది మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని ఎఱ్ఱగుంట్ల రైల్వేస్టేషనుకు 25 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

పూర్వం పెద్దణచోళ మహారాజు అంతఃపురంలో చింతమ్మ అనే బోణకత్తె ఉండేది. ఆమె తన పేరుమీద కుంట కట్టించింది. పల్లెకూడా నిర్మించింది. చింతకుంట అని నామకరణం చేసింది. పూర్వం ఇది ఒక బ్రాహ్మణ అగ్రహారం. ఒకసారి ఈ గ్రామంలో క్షామం సంభవించింది. చెరువులు, బావులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థులు క్షామప్రభావంవల్ల చింతాక్రాంతులయ్యారు. అందుచేత అగ్రహారం అనేమాట మాసిపోయింది. క్రమక్రమంగా చింతలకుంట అనేమాట చింతకుంట్లగా మారిందని కథనం. ఒక అత్త చింతను పోగొట్టడానికి కోడలు కట్టించిన ఊరని మరొక ఐతిహ్యం. చింతకుంట, చింతలకుంట, చింతకుంట్ల అని నామాంతరాలు. ఈ గ్రామంలో వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు అభించడంలేదు.

**అన్నమయ్య సంకీర్తనల్లో చెన్నకేశవుడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని కంభం రాయనిగా పేర్కొన్నాడు.

ఘనుడవు చింతకుంట కంభమురాయ మము
గనుగొని రక్షించు కంభమురాయ
కంతుని గరుడవో కంభమురాయ శ్రీ
కాంతతొడపై నిడిన కంభమురాయ
కాంతులు నీమేనెల్ల గంభమురాయ యే
కాంతమాడే వింతలతో గంభమురాయ
కప్పురపు విడేల కంభమురాయ
కప్పముగొనే వింతట గంభమురాయ
కప్పులు దేర నీమోవి గంభమురాయ
కప్పుకొమ్మ పచ్చడము కంభమురాయ 29-209

కంభంరాయు అన్నది సాధారణంగా నరసింహస్వామిని సూచిస్తుంది. కాని చింతకుంటలో ప్రస్తుతం చెన్నకేశవ ఆలయం ఉంది. బహుశః అన్నమయ్యకాలం నాటికి కంభంరాయడు ఉన్నాడేమో. లేదా ఈ ఊరి ప్రాంతంలో మరొక కంభంరాయని గుడి ఉందేమో. ఈ విషయం ఇంకా పరిశీలించతగ్గ అంశం. ఈ దేవాలయంలోని ఒక స్తంభాన్ని కంభంరాయునిగా స్థానికులు భావిస్తున్నారు.

**జల్లావాండ్లపల్లి నృసింహుడు :**

**జల్లావాండ్ల పల్లి గ్రామనామ విశేషాలు :**

కడపజిల్లాలో చిన్నమండెం మండలకేంద్రం. ఈ మండలంలోని కుగ్రామం జల్లావాండ్లపల్లె. ఇది చిన్నమండెం నుండి 4 కి.మీ. దూరంలో ఉంది. మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని కడప రైల్వేస్టేషనుకు 42 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం-స్థానిక కథలు :**

పూర్వకాలంలో ఇక్కడ జల్లావాళ్ళనే కుటుంబం ఉండేది. వారీ ప్రాంతంలో పలుకుబడి కలవారు. అంచేత వారి కుటుంబం పేరుతో ఈ ఊరికి జల్లావాండ్లపల్లె అనే పేరు వచ్చిందని స్థానికుల కథనం. ఇది కుటుంబ నామాన్ని సూచిస్తుంది. పూర్వం చిన్నమండెం నుండి మల్లూరు వరకు ఈ ఊరు ఉండేది. ఈ రెంటికి మధ్యలో నరసింహస్వామి ఆలయం ఉంది. ఇదంతా ఇప్పటికీ ఒకే వీధిలాగ వరుసలో ఉన్నాయి. మండెంలో ఉండడం వల్ల మండెం రాయడని, మండెం నారసింహుడని ఇప్పటికీ అంటున్నారు. ఈ గ్రామం ఒకప్పుడు పాళెగాండ్రకు కేంద్రంగా ఉండేదని కథనం. జల్లావాండ్లపల్లెకు నరసింహస్వామి ఆలయానికి మధ్య పెద్ద ఏరు ప్రవహిస్తున్నది. ఆలయం ఈ పల్లెకు పడమటి దిక్కుగా కొంత దూరంలో ఉంది.

**శాసనాలలో ఆలయ వివరాలు :**

ఆలయ వివరాలకు సంబంధించి ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య కీర్తనలలో మండెం రాయడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ మండెంరాయని దర్శించి తొమ్మిది శృంగార సంకీర్తనలు పాడాడు. దీనిని బట్టి అన్నమయ్య పలుసార్లు ఈ స్వామిని దర్శించినట్లు తెలుస్తున్నది.

**మమ్మేలతో నీవు నానేరపులెంతు నంటానాడేవు**
**కొమ్మలతోడుత నిట్టె కొనియాడుదువా**

మమ్ము శ్రీ వేంకటేశుండ మండెము రాయండవై
సమ్మతించి గూడె ఎట్టిచన విత్తునా 3-94

**దేవుని కడప-ప్రసన్న వేంకటేశ్వరుడు :**

కడప జిల్లా కేంద్రం కడప గ్రామీణ మండల క్షేత్రంలోని గ్రామం దేవుని కడప. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని కడప రైల్వేస్టేషనుకు 4 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం-స్థానిక కథలు :**

ఇది తిరుమల శ్రీనివాసుని క్షేత్రానికి గడపగా ప్రసిద్ధి. తిరుపతి వెళ్ళే యాత్రికులు ముందుగా ఈ స్వామిని దర్శించి వెళ్ళేవారు. అందుచేత ఈ క్షేత్రానికి దేవుని కడప అనే పేరు వచ్చింది. కడపకు దేవుని కడప, దేవరి కడప, పాతకడప, కృపనగరం, కడప, గడప నడప అని నామాంతరాలు. కడప కృశబ్ధభవం, వేదాంత దేశికులు దేహళీ పురమని పేర్కొన్నారు. దేహళీ అంటే గడప. దేవుని కడపలో నెలకొన్న స్వామి వేంకటేశ్వరుడు. భక్తులు ఈ స్వామిని ప్రసన్న వేంకటేశ్వరునిగా భావిస్తారు. స్వామిని కృపాచార్యులు ప్రతిష్ఠించారని ప్రతీతి.

**శాసనాలలో ఆలయవివరాలు :**

కడప దేవాలయానికి సంబంధించిన శాసనాలు నాలుగున్నాయి. మొదటిది కీ.శ. 1517వ సంవత్సరం శాసనం. ఈ శాసనకర్త శ్రీకృష్ణదేవరాయుల ప్రధాని అయిన తిమ్మరుసు. ఇతడు తిరువేంగళనాథుని ఆరగింపులు, చతుర్మూర్తి హోమం, బలి ప్రధానం మొదలైనవి ఏర్పాటుచేశాడు. రెండవది క్రీ.శ.1537వ సంవత్సరం

ఔభళ మహారాజు శాసనంలో చలివేంద్రం కట్టడి చేశాడు. మూడవది క్రీ.శ. 1553వ సంవత్సరం శాసనం. నంద్యాల పిన ఔభళరాజు శాసనం. ఇతడు తిరువేంగళనాథ దేవునికి ఉద్యానవనం కట్టడి చేశాడు. నాల్గవది 1553వ సంవత్సరం పెద్ద ఔభళరాజు కుమారుడు చిన్న ఔభళరాజు శాసనం. ఇతడు తిరువేంగళనాథ దేవునికి తులసిమాల సమర్పణ తోమాల కైంకర్యం మొదలైనవి కట్టడి చేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో కడప రాయడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామివారిని దర్శించి నలభై కీర్తనలు రచించి గానం చేశాడు. వీటిని రెండు వర్గాలుగా విభజించవచ్చు- 1. ఉత్సవ కీర్తనలు 2. మధుర భక్తి కీర్తనలు.

**1. ఉత్సవకీర్తనలు :**

కడపరాయనికి జరిగే ఉత్సవాలలో అన్నమయ్య రథోత్సవం, కళ్యాణోత్సవాలను తన కీర్తనల్లో ప్రస్తావించాడు.

**రథోత్సవం :**

కడప శ్రీనివాసునికి ప్రతి సంవత్సరం రథసప్తమినాడు రథోత్సవం నిర్వహిస్తారు. ఈ రథోత్సవం రథసప్తమినాడు అరుణోదయానికి ముందే నదిలో దీపం వదిలి స్నానం చేయాలి. స్నానం చేసేటప్పుడు ఏడు జిల్లేడు ఆకులు, ఏడు రేగుఆకులు తలపై పెట్టుకోవాలి. దీనిని ఉత్తరాయణ పుణ్యకాలంగా భావిస్తారు. ఇలాంటి రోజున కడపలో జరిగే రథోత్సవ వైభవాన్ని అన్నమయ్య-

కన్నుల పండుగలాయ గడపరాయని తేరు
మిన్నునేల శృంగారము మితిమీరినట్లు
కదలెగదలె నదె గరుఢధ్వజుని తేరు
పొదిగి దేవ దుందుభులు మ్రోయగ
పదివేలు సూర్యబింబములుదయించునట్లు
పొదిరి మేరువు వచ్చి పొడసూచినట్లు
వచ్చె వచ్చె అంతనింత వాసుదేవుని తేరు
అచ్చగ దేవకామినులాడి పాడగా
ముచ్చటతో గరుడుడు ముందు నిలిచినట్లు
మెచ్చుల మెరుగులతో మేఘము వాలినట్లు
తిరిగె దిరిగె నదె దేవ దేవోత్తముని
వరుసదేవతలెల్ల బయ వెట్టగా
విరివి గడపలో శ్రీ వేంకటేశుడు -
తేరుపై .........
సిరవాయ సింహాసన మిదేయన్నట్లు 8-93

వర్ణించాడు. అలాగే రథంలో ఊరేగే వారిని మరొక కీర్తనలో-

కాంతతో శ్రీవేంకటేశ కడపలో దేరెక్కి
యింతనన్ను గూడి వీధులేగితివి నీవూ 17-4-7

వర్ణించాడు.

కల్యాణోత్సవం :

కడప శ్రీనివాసునికి జరిగే కల్యాణోత్సవాన్ని అన్నమయ్య తన

కీర్తనలలో కీర్తించాడు. కల్యాణానంతరం స్వామి ఊరేగే ప్రసక్తిని అన్నమయ్య క్రింది కీర్తనలో వర్ణించాడు.

సిగ్గరి పెండ్లికొడుక చెలువరాయనన్ను
వెగ్గళించకిక నీవు వెస జెలువరాయ
ఇప్పుడే శ్రీవేంకటేశ యేకతము కడపలో
జెప్పితిగా అలనాడే చెలువరాయ
నేరుపరులకు నెల్లా నీవు సేసిన దేవాడి
అరయ గడప రాయ అంతవాడవౌదువు
కందువ మాటలనే కంకణాలు గట్టికట్టి
సందడి బెండ్లాడేవు చతురుడవు
చందమామ గుడుకల సొరెనవ్వి వావులెల్లా
అందలాన బెట్టుకుంటి వంతవాడవౌదువు 14-148

**మధురభక్తి :**

మధురభక్తి శృంగార సమ్మిళితం కావడం ఒక ధర్మం. తాను సేవించే దేవుడు నాయకుడు, భక్తుడు నాయిక. దేవుడొక్కడే పురుషోత్తముడు. తక్కిన జీవరాశి అంతా స్త్రీ సమూహం. ఆ స్త్రీ-పురుషుల అనంత శృంగార లీలలే మధురభక్తి విశ్వరూపం. మచ్చునకొకటి:-

కాదనకు రా నామాట కడపరాయ నీవు
గాదె బోసే వలపులు కడపరాయ
కప్పుర మియ్యగ రావా గడపరాయా నీకు
గప్పిత నా పయ్యెదెల్ల గడపరాయ

కప్పుమిదె కుచములు కడపరాయ వో
కప్పు మొయిలు మేని ఛాయా కడప రాయ
కొందువకు రారాదా కడపరాయ ముందే
గండమిచ్చిన వాడవు కడపరాయా
కందము నీమాటలిక గడపరాయా వో
కందర్పగరుడ మొక్కే గడపరాయ
కలిసితివిటు నన్ను గడపరాయా నా
కల నేడు నిజమాయ గడపరాయ
కలదాననే నీకు గడపరాయా వో
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయా 19-458

**నల్లబల్లి చెన్నకేశవుడు :**

కడప జిల్లాలో ముద్దనూరు ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం నల్లబల్లె . ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని ముద్దనూరు రైల్వేస్టేషనుకు 3 కి.మీ.దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

పూర్వం ఈ ప్రాంతంలో కిరాతులు నల్లరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈమె స్త్రీమూర్తి. ఈమెను నలసానెమ్మ, నల్లసానెమ్మ, నల్సానమ్మ, నల్చాలమ్మ అంటారు. కృష్ణ శిలతో చేయబడిన ఈ విగ్రహం చెన్నకేశవస్వామి ఆలయానికి వెనుక భాగంలో ఉంది. ఈమె పేరుమీదుగా ఈ ఊరు నల్లబల్లె అని పిలవబడిందని కథనం. నల్లబల్లెలో సాక్షాత్కరించిన స్వామి చెన్నకేశవుడు. ఈ స్వామిని జనమేజయుడు

ప్రతిష్ఠించాడని స్థానికుల కథ. కాని ప్రస్తుతం ఆలయ ప్రాకార పునాదులుతప్ప మరేమీ లేదు. స్థానికుల అభిప్రాయం ప్రకారం ప్రధాన ఆలయం పూర్తిగా పాడుబడి పోయిందట. కొన్నివందల సంవత్సరాలుగా వృధాగా ఉన్న ఈ మధ్య ప్రదేశంలో ఇల్లు కట్టుకొన్నారు. ప్రస్తుతం ఆలయప్రాంగణంలో ఇల్లు ఉంది. ఇందులో కాపురం ఉన్నారు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీనశాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య కీర్తనలలో నల్లబల్లి చెన్నుడు :**

అన్నమయ్య నల్లబల్లి చెన్నకేశవుని దర్శించి స్వామిపై అయిదు కీర్తనలు పాడాడు. ఈ చెన్నకేశవ స్వామిని అన్నమయ్య చెన్నుడని, చెన్నరాయడని, చెన్నకేశవుడని, ఆదికేశవుడని కీర్తించాడు.

**నల్లబల్లి చెన్నుడు నాపాలిటి వెన్నుడు**
**యెల్ల జీవులకు మరి యిన్నిటా బ్రసన్నుడు**
**కమలావరుడు. శ్రీ కర మదన గురుడు**
**సమర దానవ కుల సంహారుడు**
**విమల గుణాకరుడు విజయ చక్రధరుడు**
**కమనియ్య భక్తజన కరుణాకరుడు 10-168**

**కొలవరో మొక్కరో కోరి తలచరో**
**చెలగి మనిల రక్షించని వీడె**
**పాయపువాడు నల్లబల్లి చెన్నుడు**
**వేయినామముల వెన్నుడు 10-282**

అన్నమయ్య ఈ చెన్నకేశవుని భక్తితో తాను కొనియాడినాడు. స్వామిని కొలువుడని ప్రజల్ని ఉద్బోధించాడు.

**నందలూరు సౌమ్యనాథుడు :**

కడపజిల్లాలో చారిత్రాత్మక గ్రామం నందలూరు. ఇది మండల కేంద్రం. మద్రాసు-బొంబాయి రైలు మార్గంలో ఉంది. బాహుదానదీ తీరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

ధృష్టద్యుమ్నుని కుమారుడు నిరంతర మహారాజు. అతడు బాహుదానదీ తీరంలో నిరంతర పురం అనే అగ్రహారం కట్టించాడు. ఈ అగ్రహారం బాహుదానది వెల్లువ వల్ల కొట్టుకొని పోయింది. నెలంద అనే ఆమె రాజుగారి ఉంపుడుకత్తె. ఈమె వేశ్య. కొట్టుకుపోయిన ఈ ప్రదేశం సందర్శించింది. ఆ ప్రదేశానికి ఉత్తరంగా ఒక గ్రామం నిర్మించింది. దానికి తన పేరు మీద 'నెలందలూరు' అని నామకరణం చేసింది. దాన్ని సర్వాగ్రహారంగా బ్రాహ్మణులకు దానం ఇచ్చినట్లు స్థానికుల కథనం. ఇది నంద వంశీయులు పాలించిన ప్రాంతం. అంచేత దీనికి నందలూరు అని పేరొచ్చిందని మరోకథ. నందలూరుకు నిరంతరపురం, నెలందలూరు, నెందలూరు, నెలదలూరు, తొండాయ మండలం అనే నామాంతరాలు ఉన్నాయి. ఈ నందలూరులో వెలసిన స్వామి చొక్కనాథుడు. బాహుదానదికి భృగునది, చెయ్యేరు అని నామాంతరాలు. నారదుడే స్వామిని ప్రతిష్ఠించాడని కథనం.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

ఈ ఆలయంలో కనపడే శాసనాలలో మొదటిది 2-7-1433వ సంవత్సరం. బాహుదానదీ తీరమందు శ్రీ చొక్కనాథ పెరుమాళ్ళ సన్నిధిని సోమగ్రహ పుణ్యకాలమందు పొత్తపినాటిలోని పోలినాడు, లేంబాన, తాళ్ళపాక, టంగుటూరు, ఓపిలి మొదలగు గ్రామాలందలి ప్రముఖులు కొందరు వీసబాడిపన్ను, కాసిగప్పాలు మొదలైనవి. నెలదలూరు చొక్కనాథ పెరుమాళుకు నియమనం చేశారు. రెండవది క్రీ.శ.28-6-1501వ సంవత్సరం నాటిది. దేవినేనిగారి కుమారుడు పర్వతనాయని గారు వేయించిన శాసనం. ఇతడు నరసానాయని పుణ్యానికిగాను నెలదలూరి చొక్కనాథదేవునికి ప్రాతఃకాల దధ్యోదన అవసరానికి పొత్తపినాటి రాజ్యంలోని ఆకింపోడనే గ్రామాన్ని ఏర్పాటు చేశాడు. మూడవది క్రీ.శ.8-1-1537వ సంవత్సరం నాటిది. రాముబట్లయ్యవారు అండువూరు అనే గ్రామం పూర్వం నందలూరి చొక్కనాథ పెరుమాళ్‌కు ఏర్పాటుచేశాడు. ఈ గ్రామం రాజకీయంగా రద్దయింది. తాళ్ళపాక తిరుమలయ్యంగారు అచ్యుతమహారాయలకు చెప్పి ఆ గ్రామాన్ని యథాతథంగా చొక్కనాథ పెరుమాళుకు సర్వమాన్యంగా ఇప్పించారు.

నాల్గవది క్రీ.శ.28-12-1556వ సంవత్సరం. నెలదలూరి జక్కుల తిప్పాబత్తుని కూతురు తిమ్మసాని శాసనం. ఈమె చొక్కనాథ దేవునికి నెలందలూరు, పాటూరు, అడువూరు, టంగుటూరు, పొళదలూరు, ఓపిల, తాళ్ళపాక, గండ్లూరు, ఊటుకూరు అనే తొమ్మిది గ్రామాలకు చెందిన మడి కుంటలను (వెట్‌ల్యాండ్స్) దాశెలపడికి

ఏర్పాటు చేసింది. ఐదవది క్రీ.శ.1742వ సంవత్సరం. వీరప్ప కుమారుడు వెంకటాచలం శాసనం. సౌమ్యనాథస్వామి దేవాలయ అర్చకుడైన వేంకటాచలం పేరుతో సౌమ్యనాథస్వామికి కర్పూర హారతిని ఏర్పాటు చేశాడు.

**అన్నమయ్య కీర్తనల్లో సౌమ్యనాథుడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించాడు. నాలుగు కీర్తనలు వ్రాశాడు. ఇందులో స్పష్టంగా నెలదలూరు ప్రస్తావన ఒక కీర్తనలో ఉంది.

**ఐరి శ్రీ వేంకటగిరి నుండి వచ్చి కూడితివి**
**మేరతో నెలదలూరి మేటి చొక్కనాథా 26-175**

ఈ కీర్తన అన్నమయ్య మధురభక్తి ప్రదర్శకంగా వ్రాశాడు. ఇందులో నాయిక అన్నమయ్య. నాయకుడు శ్రీవేంకటేశుడు. మిగిలిన మూడింటిలో నెలదలూరు ప్రస్తావన లేదు. బహుశః వీటిని కూడా అన్నమయ్య నెలదలూరు చొక్కనాథునిపై వ్రాసి ఉండవచ్చునని ఊహ.

**పూనిన శ్రీ వేంకటాద్రి నుండి వచ్చి ననుంగూడె**
**సూన్యాస్త్ర గురుడైన చొక్కనాథుడు 3-237**
**సొమ్ములతో విఱ్ఱవీగే చొక్కనాథు పోదు**
**సుమ్మీ నీకు నాకు జొక్కనాథా 27-436**

'సొమ్ములతో విఱ్ఱవీగే చొక్కనాథా' అనడం బట్టి అన్నమయ్య కాలం నాటికి ఈ స్వామికి సకలాభరణాలుండేవని అంగరంగ వైభవంగా ఉండేదని స్పష్టమవుతుంది.

**పాలగిరి చెన్నకేశవుడు :**

కడపజిల్లాలో ఒక మండల కేంద్రం వీరపునాయనిపల్లె. ఈ మండలంలోని గ్రామం పాలగిరి. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని ఎర్రగుంట్ల రైల్వేస్టేషనుకు 14 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానికకథలు :**

ద్వాపర యుగంలో సాందీపుని ఆశ్రమానికి వాల్మీకాది ఋషులు వచ్చారు. వారి క్షుత్పిపాసలు తీర్చడానికి సాందీపుని నిజాశ్రమమైన పర్వతంలోని పాదపథములను యాచించారు. వాటి శాఖల నుండి క్షీర వృష్టి కురియించినందువల్ల పర్వతానికి క్షీరగిరి అనే పేరు వచ్చింది. ప్రజల వ్యవహారంలో ఇది పాలగిరి అయిందని స్థానిక చరిత్ర. ఈ ప్రాంతంలోని కొండలకు పాలకొండలని పేరు. ఈ కొండల్లో ఊరుకట్టుకోవడం వల్ల దీనికి పాలగిరి అనే పేరు వచ్చింది. పాలగిరికి ఉత్తర దిశలో శిథిలమైన దుర్గం కనపడుతుంది. ఇది పాలెగాళ్ళకు పొలిమేరగా ఉంటుందని స్థానికుల కథనం.

పాలగిరిలో వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఈ ఆలయం చాలా ప్రాచీనమైనది.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

క్రీ.శ. 1504వ సంవత్సరం విజయనగర రాజుల పాలన కాలంలో పాలగిరి చెన్నకేశవ స్వామికి మడి మాన్యాలను రామదాసు తిమ్మయ్యగారు ఉత్థాన ద్వాదశి రోజున కట్టడి చేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో పాలగిరి రాయడు :**

తాళ్ళపాక అన్నమయ్య చెన్నకేశవస్వామిని దర్శించి ఒక శృంగార సంకీర్తన పాడాడు.

కంటిరా నీ గుణమెల్ల కడగడనే
పంట మోపితేనె కాడ పాలగిరి రాయడా ॥పల్లవి॥

నిన్ననే వూ కొంటిరా నేడు నీ మాటలకు
వున్నవెల్ల మానియిక నూరకుండరా
వెన్నవంటి మనసింతే వెతకోపరా
పన్నిన మాయలకాడ పాలగిరి రాయడా ॥కంటి॥

ఇప్పుడే మెచ్చితిరా నీ ఇట మీది చేతలకు
చెప్పనేల విచ్చి విచ్చి సిగ్గులయ్యీరా
కొప్పు జారె గోరికకు గురి లేదురా
పప్పులాయె దాలిమెల్ల పాలగిరి రాయడా
అంతలో మరిచితిరా ఆయము నీవంటేవని
సతమైతి నీ కౌగిట చాలఅ జాలురా
ఇంతటి జాణడ నీకు ఇటు మొక్కేరా
పంతపు శ్రీ వేంకటాద్రి పాలగిరి రాయడా 30-182

**పులివెందుల రంగనాయకులు :**

కడపజిల్లాలో పులివెందుల ఒక మండల కేంద్రం. ఇది పాకాల-ధర్మవరం రైలు మార్గంలోని కదిరి రైల్వేస్టేషనుకు 27 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

పూర్వం ఈ ఊరికి పులిమందలు అని పేరు. ఈ ప్రాంతంలో పులులు మందలు మందలుగా తిరుగాడుతుండేవి. వేటగాళ్ళు పులులు మందలుగా ఉండే చోట్లకు పోయి పులులను చంపేవారు. అంచేత దీనికి పులిమందల అని పేరు వచ్చింది. పులివెందుల అంటె పులులకు నిలయం అని అర్థం. పూర్వం రంగనాయకులస్వామి ఆలయానికి పల్లెకి 2 కి.మీ. దూరం ఉండేది. ఈ మధ్య ప్రదేశం ఘోరారణ్యం. ఈ పల్లెకు పోలేపల్లి అని పేరు. స్వామి పూజారులు ఈ పల్లెలో నివసిస్తుండేవారు. వారు పులులకు భయపడి చెట్లమీదికిపోయి రంగనాయకుల స్వామికి పూజలు చేసి వస్తుండేవారు. స్వామి అర్చకుల భక్తికి మెచ్చాడు. రంగనాయకులస్వామి పులివెందుల (పులులు నశించుగాక) అని శపించాడు. పులులు నశించాయి. పూజారులు సంతోషించి స్వామి పలుకులనే ఈ గ్రామ నామంగా పరిగణించినారు. అప్పటినుంచి అది పులివెందులగా పిలువబడిందని స్థానికుల కథనం. ఈ పోలేపల్లి క్రమంగా జన వ్యవహారంలో పులివెందులుగా మారిందని కథ. పులివెందుల, పులివిందల, పులివిందళ, పులివిందలసీమ, పుల్విందల, వ్యాఘ్రపురి అని నామాంతరాలు. పులివెందలలో వెలసిన స్వామి రంగనాయకులస్వామి. ఈ ఆలయం పులివెందల గ్రామానికి పడమటి దిశలో పంట పొలాల మధ్యలో ఉంది.

**శాసనాలలో ఆలయ వివరాలు:**

క్రీ.శ. 1509వ సంవత్సరం తిమ్మరాయుని కుమారుడైన బసవరాజుగారి తమ్ముడైన నరసయ్య దేవ మహారాజు గారి శాసనం.

ఇతడు కుందల్కూడు గ్రామాన్ని పులివెందుల శ్రీరంగదేవునికి నైవేద్యం, అంగరంగవైభవాలకు కట్టడి చేశాడు.

**అన్నమయ్య సంకీర్తనలలో రంగనాయకుల స్వామి :**

అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక శృంగార కీర్తన పాడాడు.

**ఇంకనేల వెరపు యెదుటనే వున్నారము**
**వంకలొత్తకిక మఱివద్దు వద్దు**
**వెలినవ్వేల పదారువేల బెండ్లాతివి**
**బసిమి కాడవు గావా భావించినదే**
**కలిసితి మిదె శ్రీ వేంకటరాయనేము 20-15**

**పెద్దచెప్పలి చెన్నకేశవుడు :**

కడపజిల్లాలో కమలాపురం ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం పెద్దచెప్పలి. ఇది కమలాపురం రైల్వేస్టేషనుకు 4 మైళ్ళదూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానికకథలు :**

చెప్పలి అనే పేరుగల వ్యక్తిపేరుతో ఈ ఊరు వెలసినట్లు స్థానికుల చరిత్ర. చెప్పల్లె చప్పలి, చెప్పల్లి, చెప్పలి అని నామాంతరాలు. ఈ ఊరులో వెలసిన స్వామి చెన్నకేశవుడు. అగస్త్యునిచే ప్రతిష్ఠించబడినట్లు స్థానికుల కథనం.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడంలేదు.

**అన్నమయ్య కీర్తనలలో చెప్పలి చెన్నకేశవుడు:**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక కీర్తన పాడాడు.

వరుసకు మాపటంత వచ్చేగాని
గెరసు దాటకు వోయి కేశవరాయ ||పల్లవి||

చేసన్న చాలదా వెట్టపట్టి తియ్యనేల
ఆసల నెదురు చూచే ఆట దానికి
రాసీగుచములవి రాయడి చెట్టుకుపోయి
సేస కొప్పుగంటు జారె జెన్నరాయా ||వరుస||

పదమంట చాలదా బలిమి సేయగనేల
కిదియగ దమకించే కామినికిని
చెదరె గస్తూరి బొట్టు చెరకు విడవవోయి
అదె నామై చెమరించె హరి కృష్ణరాయ
కాగిలిదే చాలదా కన్నుల యొక్కగనే (నేల?)
నాగువారె ననువుల నన్నుబోటికి
ఆగి కూడితివి నన్ను అలసితి రతులలో
వీగేవు చెప్పలి శ్రీ వేంకటరాయా ||వరుస|| 13-307

**పెద్దముడియం నృసింహుడు:**

కడప జిల్లాలో పెద్ద ముడియం ఒక మండల కేంద్రం. ఇది జమ్మలమడుగుకు 12 మైళ్ళ దూరంలో ఉంది. మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని ముద్దనూరు రైల్వేస్టేషనుకు 26 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

చాళుక్య సామ్రాజ్య స్థాపకుడైన విష్ణువర్ధనుడు ఇక్కడ జనించాడని కథ. విష్ణువర్ధనుని తండ్రి త్రిలోచనుడు మరణించాడు. ఆ సమయంలో విష్ణుభట్ట సోమయాజి అనే బ్రాహ్మణుడు స్వామి దేవేరిని కన్నకూతురులాగ సంరక్షించాడు. విష్ణువర్ధనుడు రాజయ్యాడు. తల్లిని ఆపద సమయంలో రక్షించి, పోషించిన బ్రాహ్మణుడికి ఈ ముదివేము గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. అంచేత దీనికి ముదివేము అగ్రహారం అని పేరు. పూర్వం ఇక్కడ 184 బ్రాహ్మణ కుటుంబాలుండేవని కథ. పెద్ద వేపచెట్టు క్రింద ఈ అగ్రహారం ఉండడం వల్ల దీన్ని పెద్దవేము అనేవారు. ఈ ముదివేమును క్రమంగా ముడియ్యాం, ముడివేముల, ముడియంగా రూపాంతరం చెంది ముడియం అయింది. ముడి అంటే చెట్టు అని అర్థం కూడా ఉంది. పెద్ద వేప చెట్టుకింద ఉండడంవల్ల దీనికి పెద్దముడియం అనేపేరు వచ్చింది. దీనికి త్రిలోచపురం, బ్రాహ్మణుల ముడియం అని కూడా పేర్లు. పెద్దముడియంలో నెలకొన్న స్వామి లక్ష్మీనరసింహుడు. ఈ స్వామిని జనమేజయుడు ప్రతిష్ఠించాడని కథ.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

ఇది అసంపూర్తి శాసనం. సంవత్సరం లేదు. పెద్దముడియంలోని నరసింహస్వామి దేవాలయ గోపుర శిఖర నిర్మాణార్థం బ్రాహ్మణుల ముడియం ఆ అగ్రహారాన్ని మాన్యంగా ఇచ్చారు.

**అన్నమయ్య సంకీర్తనలలో ముడియం నారసింహుడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక కీర్తన పాడాడు.

జయమాయ నీకు నాడె సురసములూ
నయగారి ముడియము నారసింహా
మోము చూచినీతోడ ముచ్చటలాడ వలసి
కోమలి నీ తొడమీద గూచున్నది.

ఆముకొని అట్టె మాటలాడవయ్యా ఆపెతోడ
నామాట విని యిట్టె నారసింహా
మన్నన నీ యలుకుల మంకు దెలుపవలసి
చన్నులురమున బెట్టి సతతమైనది.

చెన్నుడవాపె చనువు చెల్లించవయ్య యిట్టె
నన్నడిగేదింకా నేమి నారసింహా
చేతుల నిన్ను నలమి చెక్కుజెక్కు గదియించి
నీతితో నీమెడ సొమ్మె నేలకున్నది
యీతల వెంకటాద్రి నెనసితి వాపెతోడ
నా తలపులీడేరించి నారసింహా 17-139

అనే శృంగార సంకీర్తనను బట్టి ఇందులోని స్వామి లక్ష్మీ నరసింహుడని చెప్పాడు అన్నమయ్య.

**ప్రొద్దుటూరు చెన్నకేశవుడు :**

కడపజిల్లాలో ప్రొద్దుటూరు ఒక మండల కేంద్రం. ఇది మద్రాసు-బొంబాయి రైలుమార్గంలోని ఎర్రగుంట్ల రైల్వేస్టేషనుకు 9 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థల పురాణం, స్థానిక కథలు :**

శ్రీరాముడు రావణుని సంహరించాడు. రావణబ్రహ్మ పైగా శివభక్తుడు. అంచేత బ్రహ్మహత్యాపాపం అంటింది. దాని విముక్తి కోసం శ్రీరామచంద్రుడు ఈ ప్రాంతంలో శివలింగం ప్రతిష్ఠించాడు. శివలింగ ప్రతిష్ఠ ప్రొద్దున్నే చేశాడు. ప్రొద్దు అంటే సూర్యుడు ఉదయించే సమయం. ఊరు అంటే గ్రామం. ఈ విధంగా ఇది ప్రొద్దుటూరుగా మారింది. అగస్త్యుడు తన ముని గణాలతో ఈ ప్రాంతంలో సంచరించినట్లు చెబుతారు. పూర్వం రామిరెడ్డి రంగారెడ్డి అనే కాపులుండేవారు. వారి దేశంలో క్షామం వచ్చింది. అంచేత వారక్కడనుండి పొదలపల్లెకు వచ్చారు. వారు ప్రొద్దున్నే శంఖుస్థాపన చేశారు. ఇండ్లు కట్టుకున్నారు. ఉదయంపూట శంఖుస్థాపన చేయడం వలన దీనికి ప్రొద్దుటూరు అనే పేరు వచ్చింది. దీనికి ప్రొద్దుటూరు, పొదలపల్లె, బంగారు ప్రొద్దుటూరు, ప్రఖ్యాతపురం అని నామాంతరాలు. ఇక్కడ వెలసిన స్వామి చెన్నకేశవుడు. ఇది జనమేజయుని ప్రతిష్ఠ అని కథనం.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

మొదటి శాసనం క్రీ.శ.1878వ సంవత్సరం నాటిది. ప్రొద్దుటూరు చిన్నరెడ్డి మనుమడు వెంకటరెడ్డి కుమారుడు. ఆచువ జీవరెడ్డి శాసనం. ఇతడు ఆదికేశవస్వామి సంవత్సరోత్సవం రెండవదినం సింహోత్సవం. ఉభయానికి గాను రూ॥250లు విలువగల ఎనిమిది ఎకరాల మెట్ట భూమిని కట్టడి చేశాడు. రెండవది క్రీ.శ.1880వ సంవత్సరం. ఆదికేశవ స్వామివారికి సంవత్సరోత్సవ రెండవదినం శేషవాహనోత్సవం ఉభయానికి ప్రొద్దుటూరు కొంగయ్య భార్య వెంకమ్మ రూ.200లు

విలువగల రెండున్నర ఎకరాల పూజ భూమిని ఏర్పాటుచేశారు. మూడవది అసంపూర్తి శాసనం. ఇందులో ప్రొద్దుటూరు ఆలయ పరిచారిక వర్గమైన అర్చక, ధర్మకర్త, పురోహిత రెడ్డి, కరణం కట్టుబళ్ళు దాసుడికి, భోగంవాండ్లకు, భజంత్రీలకు ఇచ్చే ధన వివరాలు ఉన్నాయి.

**అన్నమయ్య కీర్తనలలో ప్రొద్దుటూరు చెన్నకేశవుడు :**

ప్రొద్దుటూరు పురవాసి శ్రీ చెన్నకేశవస్వామి. ఈ స్వామిని అన్నమయ్య ఒక కీర్తనలో కీర్తించాడు.

**కరుణించవయ్య ఇక కదుజాణవౌదువు**
**వొరిసేరింతలు పొదటూరి చెన్నరాయా ॥పల్లవి॥**

**వెగ్గళించి కన్నుల వెడనవ్వులు నవ్వుతా**
**వొగ్గేరు వలపు పొదటూరి చెన్నరాయా ॥కరు॥**

**చల్లలమ్మే మాటలనే సరసములాడేరు**
**పల్లము లలర పొదటూరి చెన్నరాయా**
**చీరలు నీవియ్యగాను చేకొని కౌగిలించిరి**
**మేరతో శ్రీవేంకటాద్రి మీదనే నిన్ను**

**గారవించి యిందు నందు కందవలు మెరసిరి**
**వూరటగా నీకు బొదటూరి చెన్నరాయా ॥కరు॥ 13-537**

**పోట్లదుర్తి చెన్నకేశవుడు :**

కడపజిల్లాలో ఎర్రగుంట్ల ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం పోట్లదుర్తి. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని ఎర్రగుంట్ల రైల్వేస్టేషనుకు 5 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థల పురాణం, స్థానిక కథలు :**

సారు మహారాజు వేటాడుతూ ఈ ప్రదేశం వచ్చారు. కుందేళ్ళపైన శునకాల్ని వదిలాడు. కుందేళ్ళు శునకాలపై తిరగబడి పోట్లాడినాయి. ఈ ప్రాంతం చాలా శౌర్య ప్రభావం కలిగింది. దీనికి పోట్లదుర్తి అనే పేరు వచ్చింది. తురుష్కులు వెలమలతో పోట్లాడి ఈ స్థలం సంపాదించారు. పోట్లాడి సంపాదించడం వల్ల దీనికి పోట్లదుర్తి అనే పేరు వచ్చింది. దుర్తి అంటే త్రోవ, దోవ, తెరువు అనే అర్థాలున్నాయి. పోట్లదురితి, పోట్లదుర్తి అని నామాంతరాలు. ఈ పోట్లదుర్తిలో వెలసిన స్వామి చెన్నకేశవుడు. జనమేజయుడు స్వామిని ప్రతిష్ఠించాడని కథనం.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

క్రీ.శ. 1513వ సంవత్సరం విజయనగర రాజైన కృష్ణదేవరాయల కాలంలో ఎఱ్రగుడి గుండమయ్య దేవ మహారాజు కుమారుడు 'రేవిరాజు' పోట్లదుర్తి చెన్నకేశవస్వామికి సుంకాన్ని ఏర్పాటుచేశాడు. క్రీ.శ. 1546వ సవంత్సరం విజయనగర రాజుల కాలంలో, నందేల తిమ్మరాజయ్య చెన్నకేశవ స్వామికి 'నల్లబల్లిట్టకి' గ్రామంలోని "అంగళ్ల పన్నులను ఏర్పాటుచేశాడు.

**అన్నమయ్య కీర్తనలలో పోట్లదుర్తి చెన్నకేశవుడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక కీర్తన పాడాడు.

**అప్పుడెట్టుండెనో చిత్తమయ్యో యెఱగనైతి**
**చెప్పడు మాటలకే నే జేర నైతిగా ॥పల్లవి॥**

కొసరి కొసరి నీపై కోపమున నుంటిగాని
అసమిచ్చి నీతో మాటలాడనైతిగా
పసలేని సిగ్గుతోడి పంతాననే వుంటిగాని
ముసిముసి నవ్వు మోపి మోపనైతిగా

విరహపు గాకల నావిసుపే చూపితిగాని
సరిబిల్చిరే నూకొన జాననైతిగా
వరుసంతులకై నే వాదులాడితి గాని
మురిపేన మొక్కితే నే మొక్కనైతిగా 6-10

వేగమే నీవు గూడితే వెసబ్రసితిగాని
చేగల నీమేను వచ్చి చేయనైతిగా
భోగపు శ్రీవేంకటేశు పోట్లగొరితి లోన
నీగతి జెన్నుడవైతే నెనసితిగా 27-499

భోగపు శ్రీవేంకటేశు అనే మాటను బట్టి అన్నమయ్య కాలం నాటికి పోట్లదుర్తి చెన్నకేశవుడు అంగరంగ వైభవాలతో విరాజిల్లేవాడని ఊహించడానికి వీలుంది.

**మాచనూరు చెన్నకేశవుడు :**

కడప జిల్లాలో పెండ్లిమర్రి ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం మాచనూరు. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని కడపకు 25 కి.మీ. దూరంలో ఉంది.

మాచనూరు అనేది కుటుంబనామం నుండి వచ్చింది. మాచన అనేవాడు కట్టించాడని స్థానికుల కథనం. అందుచేత అతని పేరుతో

మాచనవోలుగా పిలువబడింది. క్రమంగా అది మాచనూరుగా మారింది. మాచనవోలు, మాచనూరు అనేవి నామాంతరాలు. మాచనూరు చెన్నకేశవ ఆలయానికి సంబంధించి శాసన ఆధారాలు లభించడంలేదు. స్వామి వారికి వైఖానస ఆగమం ప్రకారం పూజలు జరుపుతున్నారు. అన్నమయ్య మాచనూరు చెన్నకేశవస్వామిని దర్శించి మూడు కీర్తనలు కీర్తించాడు.

**కేరడమాడగల నా కేశవరాయా**
**చూరగొని మర్మముల సోకింతుగాక**
**పంతమాడితే నీతో బతియాడగలనా**
**కాంతలతో జెప్పి నవ్వగల గాక**
**కొంత మోము మూసుక సిగ్గున నుందుగాక**
**కౌగిలించితే నిన్ను గాదనగ గలనా**
**లోగి యెందులకే చొక్కిలో నౌదుగాక**
**నాగులెల్ల దీర మాచనవోలి చెన్నుడవై**
**మూగితి శ్రీ వేంకటేశ మోవి యిచ్చేగాక 27-495**

**మాడువూరు చెన్నకేశవుడు, మాడువూరు గ్రామ నామ విశేషాలు :**

కడప జిల్లాలో అట్లూరు ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం మాడువూరు. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని కడపకు 25 మైళ్ళ దూరంలో ఉంది. ఈ గ్రామానికి మాడుకూరు, మాడువూరు అని రూపాంతరాలు. ఈ ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య సంకీర్తనలలో మాడుపూరి చెన్నరాయడు :**

తాళ్ళపాక అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఏడు ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలు కీర్తించాడు. స్వామిని చెన్నకేశవుడని, కేశవుడని, చెన్నరాయడని, మాధవరాయడని, వేంకటేశుడని కీర్తించాడు.

**చేరి యందెల మోతతో చెన్నకేశవా**
**యీ రీతి మాడుపూరిలో నిట్లాడేవా**

మొదలగునవి ఈ మాడుపూరి చెన్నకేశవునికి సంబంధించిన కీర్తనలు.

**వత్తలూరు చెన్నకేశవుడు :**

కడప జిల్లాలో పుల్లంపేట ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం వత్తలూరు. ఇది మద్రాసు-బొంబాయి రైలు మార్గంలోని రాజంపేటకు 6 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానిక కథలు :**

వత్తలూరుకు పూర్వం బత్తలూరు అనిపేరు. ఈ బత్తలూరు వ్యవహారంలో వత్తలూరుగా మారింది. దీనికి బత్తలూరు, వత్తలూరు అని నామాంతరాలు. ఈ ప్రాంతంలో శిగి చెన్నయ్య అనే భక్తుడు ఉండేవాడు. హరిజనుడు కావడం వల్ల ఏ ఆలయానికి వెళ్ళేవాడు కాదు. పరమ భక్తుడు. తానే ఒక చిన్న రాళ్ళ గుడి నిర్మించుకుని పూజలు చేసేవాడు. అందులో స్వామి విగ్రహం బదులు స్వామివారి ఆయుధాల్ని (మూడు కొణతలు) ప్రతిష్ఠించుకొన్నాడు. కొద్దిరోజులకే స్వామి మహిమ ఆ ప్రాంత ప్రజలకంతా తెలిసింది. ప్రజల మొక్కుబళ్ళ సంఖ్య పెరిగింది.

ఈ మొక్కుబళ్ళలో భాగంగానే ఆలయ నిర్మాణం జరిగింది. ప్రొద్దుటూరుకు చెందిన ఒక వైశ్యునికి ఎంతోకాలంగా సంతానం లేదు. స్వామి మొక్కుబడివల్ల సంతానం కలిగింది. స్వామికి మొక్కుబడిగా ఆలయం నిర్మించాడు. ఈ స్వామికి చంద్రాయుడు, చెన్నయ్య, చెన్నకేశవుడు, విష్ణువని నామాంతరాలు.

**అన్నమయ్య సంకీర్తనల్లో వత్తలూరి కేశవుడు :**

ఈ చెన్నకేశవ స్వామిపై అన్నమయ్య ఒక కీర్తన పాడాడు.

**వత్తలూరి కేశవా వెన్నెలీడ జేసేవా**
**బత్తిగల వాడవౌదు పట్టకు వయ్యా ॥పల్లవి॥**

**పిల్లగోవి వింటిమి బిరుదులు గంటిమి**
**చల్లలమ్మే బొవలె జాలువయ్యా**
**పల్లదాలు ఇకనేల పదవయ్యా ॥వత్తలూరి॥**

**నిందలు వేసితివి నేరమీ జేసితివి**
**మందకును బోవలె మానవయ్యా**
**చిందె మోవి దేనెలు సిగ్గులాయ మేనులు**
**ముందరి కట్టేగాని మొక్కకు వయ్యా ॥వత్తలూరి॥**

**చీరనీచే జిక్కెను చిత్తమెల్లా బొక్కెను**
**నీరుగొలి నాడవలె నిలవయ్యా**
**యీరీతి శ్రీ వేంకటేశ యిటు నన్ను గూడితివి**
**తేరీ పనులేమి గల్లా తె కికి రావయ్యా ॥వత్తలూరి॥ 28-108**

ఈ పాటలోని నాయిక ఒక గోపిక. ఆ గోపిక మరెవరో కాదు అన్నమయ్య. మధురభక్తి ప్రదర్శకంగా వ్రాసిన సంకీర్తనలో 'విత్తమెల్లా పొక్కెను' అను పద పంక్తిలో స్వామిపట్ల అనురక్తి అయిన భక్తి భావం సాక్షాత్కరిస్తుంది.

**వేయినూతుల కోన నరసింహుడు :**

కడప జిల్లాలో పెండ్లిమర్రి ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం చిన్నదాసరపల్లె. ఈ పల్లెకు దక్షిణదిశలో 2 కి.మీ. దూరంలో కొండలోయలున్నాయి. ఈ ప్రదేశాన్ని వేయినూతుల కోన అంటారు. ఇది పెండ్లిమర్రికి 3 మైళ్ళ దూరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానికకథలు :**

పూర్వం వాల్మీకి ఈ ప్రాంతంలో నివసించేవాడు. ఈ కొండలోయల్లో వేయి నూతులను త్రవ్వించాడు. ఇతడే నారసింహస్వామిని ప్రతిష్ఠించాడని కథ. అహోబిలం లాగే ఇది కూడా నరసింహక్షేత్రం. కనుకనే ఔభలేశుడని అంటారు. ఈ ప్రదేశానికి, వేనూతులకోన, ఔనూతులకోన, ఓగు నూతులకోన, వెయ్యినూతులకోన అని నామాంతరాలు. జన వ్యవహారంలో ఇలా మార్పు వచ్చింది. అంతేగాని ఓగునూతుల అనే ప్రదేశం గానీ, ఊరుకానీ లేదు. ఈ స్వామి మహిమలు విచిత్రం. గుడిలో నడిరేయి గంట మ్రోగడం, రాత్రిపూట లక్ష్మీపాదాలవద్ద అర్చన ద్రవ్యాలుండడం వంటివి, ధ్వజస్తంభానికి తైలం రాస్తే కష్టాలు నయమౌతాయనే నమ్మకం ఉంది. ఇది అరణ్యప్రదేశం. సమీపంలోనికి వచ్చేవరకు ఇంత విశాల ప్రదేశం ఉన్నట్లు కనపడదు. కొండలోయలు, జలపాతాలు వృక్ష సముదాయాలతో అలరారుతున్నది. జనసంచారం

చాలా అరుదు. ప్రశాంత వాతావరణం, పక్షుల కిలకిలా రావాలు తప్ప ఆధునిక ప్రపంచ ఛాయలు కనపడవు. ఆలయానికి సంబంధించిన ప్రాచీన శాసనాధారాలు లభించడం లేదు.

**అన్నమయ్య సంకీర్తనల్లో ఓగునూతుల నారసింహుడు :**

అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఐదు కీర్తనలు రచించి గానం చేశాడు. స్వామివారికి వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు గరుడోత్సవం జరుగుతుంది. ఈ దినం స్వామిని చిన్న దాసర పల్లెలో ఊరేగిస్తారు. ఈ గరుడోత్సవాన్ని తిలకించిన అన్నమయ్య-

**ఆదరమ్మ పాదరమ్మ అంగనలు చూడరమ్మ**
**వేడుక బురుషలెల్ల వీధినుండరమ్మా**
**అల్లదివో వోగు నూతులౌభలేశు పెద్దకోన**
**వెల్లివాల నీటి జాలు వెడలేకోన 11-1-80**

అన్నాడు.

**సంబటూరు చెన్నకేశవుడు :**

కడప జిల్లాలో కమలాపురం ఒక మండల కేంద్రం. ఈ మండలంలోని గ్రామం సంబటూరు. ఇది మద్రాసు-రాయచూరు రైలు మార్గంలోని కమలాపురానికి 3 మైళ్ళ దూరంలో ఉంది. ఇది పెన్నానదీ తీరంలో ఉంది.

**స్థలపురాణం, స్థానికకథలు :**

చ్యవనకుడు అనే ఋషి ఆశ్రమం ఇక్కడ ఉండేది. చ్యవనుని ఆశ్రమం కావడం వల్ల దీనికి చ్యవనాశ్రమం అని పేరు. ఈ ఆశ్రమం

కొంత కాలానికి ఊరుగా మారింది. చమటూరుగా పిలువబడింది. క్రమ క్రమంగా సంమ్మటూరు సంబటూరుగా మారింది. సంబటూరుకే శ్రీభాష్యపుర అగ్రహారం అని కూడా పేరు.

**శాసనాలలో ఆలయ విశేషాలు :**

ఈ ఆలయ విశేషాల్ని తెలిపే శాసనాలు మూడు. క్రీ.శ. 1667వ సంవత్సరం. కమలాపురం తాలూకాలోని సంబటూరు చెన్నకేశవ స్వామి దేవాలయ ప్రవేశద్వారం వద్ద ఉండే శాసనం. సంబటూరు చెన్నకేశవస్వామికి అభిజిత్ లగ్నంలో జరుగుతున్న అన్ని పూజా కైంకర్యాలు, లక్ష్మీనారాయణస్వామికి జరగాలని చెప్పల్లిలోని నింగప్ప గంగాయమ్మ ఆనతిచ్చింది. రెండవ శాసనం చెన్నకేశవదేవాలయం గోడపై ఉన్న శాసనం. అసంపూర్ణ శాసనం కావడం వల్ల వివరాలు పూర్తిగా తెలియడం లేదు. సంబటూరు గ్రామ ప్రజల నుండే డబ్బు, ధాన్యం రోజుకు 'ఇరుస' వంతున వసూలు చేసి భద్రపరిచి అందులో సగం లక్ష్మీనారాయణస్వామికి మిగిలిన సగం ఆ దేవాలయ యజమానులైన నియోగులకు ఖర్చు పెట్టాలి. మూడవది సంబటూరు చెన్నకేశవ దేవాలయ ముఖమంటపం వద్ద స్థంభంపై ఉండే శాసనం.

సంబటూరి లక్ష్మీనారాయణస్వామికి వెంకన్న వెంకటపతి కోనేరు లక్ష్మీనారాయణగార్లు నిత్య దాన సేవా కార్యక్రమాల ఏర్పాటు చేశారు. నాల్గవది క్రీ.శ. 1554వ సవంత్సరం సంబటూరు కేశవపెరుమాళ్ళు సకల విధ కైంకర్యాలు నిర్వహించడానికి భోజనపల్లి శ్రీనివాసయ్యగారు కల్యాణ మంటపాన్ని కట్టించాడు. ఐదవది ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ఒక స్తంభానికి తెలుగు శాసనం ఉంది. ఇందులో

4, 5 వరుసలలో సంబటూరుకు శ్రీ భాష్యపురం అనే పేరు స్పష్టంగా ఉంది.

**అన్నమయ్య సంకీర్తనల్లో సంబటూరిచెన్నుడు :**

అన్నమయ్య ఈ చెన్నకేశవ స్వామిని ఎనిమిది కీర్తనల్లో స్తుతించాడు. ఇందులో అన్నీ శృంగార కీర్తనలు కావడం విశేషం. అన్నమయ్య ఈ స్వామిని దర్శించినట్లు ఈ కీర్తనలవల్ల తెలుస్తున్నది.

**చక్కని ఈ చెన్నుడూ సంబటూరి చెన్నుడూ**
**అక్కడ నిక్కడ చూపి అసలు రేచీని** 17-162

ఒక కీర్తనలో (29-245) సంబటూరి చెన్నకేశవుని కీర్తిస్తూ అందులోనే-

**జాగుల నవ్వుల నవ్వి జాజర పాటలు వాడి**
**బాగుగా నప్పటి గొంత భ్రమయించేవు** 29-245

జాజర పాటలు అనడం బట్టి ఆనాడు పౌర్ణమినాడు జాజర పాటలు పాడి వెన్నెలలో ఆడుకొనే వారని తెలుస్తున్నది.

# 10.అన్నమయ్య కవిత్వం-సమాజ శ్రేయస్సు

భారతదేశం అనాదిగా ఎన్నో విషయాలలో మహిమ గాంచింది. దేశ, కాల, ప్రాంత, వ్యక్తుల విషయికంగానూ ప్రత్యేకతలను సంతరించుకొంది. సత్య జ్ఞాన స్వరూపులైన మహర్షులు, ప్రవక్తలు, దార్శనికుల పాదస్పర్శతో పునీతం అయ్యింది. ఈ పవిత్రత దేశం నలు మూలలా ఏదో ఒక ప్రత్యేకతను కల్గి ఉంటుంది. అదే విశ్వంలో భారతదేశానికి ప్రత్యేక ఆకర్షణకు, ఆదరణకు, ఆదర్శానికి కారణం అవుతుంది. భారతదేశ సుప్రతిష్ఠను నిలబెట్టిన జ్ఞాన సంపన్నులెందరో ఉన్నారు. వారిలో తమిళదేశంలో ఆళ్వార్లు, ఆంధ్రదేశంలో తాళ్ళపాక అన్నమాచార్యులు అదే కోవలోనికి చెందినవారు. వీరు భారతదేశ ప్రజలపై ధార్మిక, తాత్త్వికప్రభావం చూపారు. ఆ ప్రభావమే వారికి ప్రజలను బ్రహ్మరథం పట్టేటట్లు చేసింది.

భక్తికి గల శక్తి అనంతమైనది. అద్వితీయమైనది. ఇది సంఘసమూహాన్ని చైతన్యవంతం చేస్తుంది. సక్రమ మార్గంలో నడిపిస్తుంది. కాలానుగాములై వచ్చే అనర్థాలకి, ఉపద్రవాలకి భక్తి గొడ్డలిపెట్టు. ఆ భక్తిని ఆలంబనగా చేసుకొనే ఎందరో మహితాత్ములు ఉద్యమాలతో జాతి గుండెల్లోంచి నడిచి వెళ్ళారు. అలా నడిచి వెళ్ళిన దారంతా సౌశీల్యం, సంక్షేమం వెల్లివిరిసింది.

శ్రీవైష్ణవం ఆవిర్భవించిన నాటినుండి కుల తత్త్వాన్ని నిరసించింది. సంస్కారదీక్ష, ఆచార్యానుగ్రహం ఉండడమే మానవుని యోగ్యత. ఇది ఏ కాలానికైనా కావలసిన శుభ పరిణామం. దీని కోసమే తమ రచనల

ద్వారా ఆకాంక్షించారు, ఆళ్వారులు, అన్నమయ్య. ఆళ్వారులలో అన్ని కులాల వాళ్ళూ ఉన్నారు. పవిత్రత, మహిమాన్వితమైన భక్తి పారవశ్యం ప్రజలకు అందించి వారిని తరింపజేశారు.

ఉదాత్త భక్తితత్త్వాన్ని, పారవశ్యాన్ని ద్వాపర యుగంలో గోపికలు అనుభవించినట్లుగా కలియుగంలో ఆళ్వారులు, అన్నమాచార్యులు ప్రతినిధులుగా ఉన్నారు. జన్మతః సిద్ధించిన భక్తి భావాన్ని లోకశ్రేయస్సు ప్రతిఫలించడం కోసం వినియోగించారు. విశ్వాత్మను దర్శించిన వారి లోకజ్ఞానం లోకం కోసమే వినియోగించడం కూడా ఒక భగవదారాధనమే. అందుకే సామాన్య మానవులకు దృగ్గోచరం కానిదీ, జ్ఞానదూరమూ, క్లిష్టమూ, దుర్లభమూ అయిన పరతత్త్వాన్ని ప్రకృతిలో ఎలా దర్శించాలో ఒక సాధనామార్గాన్ని అందించిన మహదాశయం కలవారు.

ఎవరు ఎన్ని తత్త్వాలను బోధించినా, మతాలను స్థాపించినా, సిద్ధాంతాలను ప్రవచించినా అందరూ పేర్కొనేదొక్కటే. అదే పరబ్రహ్మతత్త్వం. ఆదినుండీ భారతదేశంలో వేద శాస్త్రోపనిషత్తులు నిరూపిస్తున్నదిదే. ఉపనిషద్వాక్యానుసారంగా అణువులో అణువులా, మహత్తులో మహత్తులా విరాజిల్లేది పరమాత్మయే. ఈ తత్త్వం తెలుసుకోవడమే జ్ఞానం. ఆ జ్ఞానం చుట్టూ ప్రకృతి, సృష్టి, జీవనం, ఆచారం, మానసిక ప్రవర్తన, నైతికత, ఋజువర్తన, ధర్మం, సత్యం వంటివన్నీ పరిభ్రమిస్తూ ఉంటాయి. ఏ సమాజంలో ఈ

పరబ్రహ్మతత్త్వానికి చెందిన వాసనలు జన్మతః సిద్ధించడంవల్లనో, సాధన ద్వారా లభించడం వల్లనో అధికంగా ఉంటాయో ఆ సమాజం అభివృద్ధిలో ముందుంటుంది. విజ్ఞానం వికసించిన మేధ గల మహానుభావులు ఈ అభివృద్ధిని మున్ముందుకు నడిపిస్తారు. అందుకే ఈ జ్ఞానం అందరికీ అందేట్టు చేయాలి. సమాజంలోని వ్యక్తుల వైవిధ్యం వల్ల ఇది అందుబాటులో లేకపోవడం వల్ల లోకోద్ధరణాకాంక్షితులైనవారు ఈ తత్త్వాన్ని సులభతరం చేసి ప్రజలకు అందించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్న పురుషుల్లో ఆళ్వార్లు, అన్నమయ్యలు చేరారు.

పరబ్రహ్మజ్ఞానం మానవుని జీవితానికి దిశానిర్దేశం చేస్తుంది. ప్రకృతి కార్యకలాపాలను దర్శించి వాటిని ఆదర్శంగా భావించి బలాన్ని, జ్ఞానాన్ని సాంత్వనాన్ని ఎలా పొందాలో నేర్చుకొనే మెలకువ ఏర్పడుతుంది. అప్పుడు జీవుడు ప్రకృతిలోని నీతిని దర్శిస్తాడు. ఉపదేశాన్ని వింటాడు. ప్రకృతే అతనికి తత్త్వ జ్ఞానాన్ని బోధిస్తుంది. ఈ సత్యం గమనించిన కవులకు ప్రకృతే మూలవస్తువవుతుంది. ఆళ్వారులు అన్నమయ్య ప్రాకృతికమైన అంశాల ద్వారా- పారమార్థికతను సాధించి బోధించారు. ప్రకృతిలో మానవ చైతన్యాన్ని ఆరోపించారు. ఇదే మానవీకరణ. మానవునిలా ప్రకృతిని కూడా బాహ్యమైన రూపకల్పన చేయడం ప్రాచీన కాలం నుండీ పరిపాటిగానే ఉంది. దీనిని ఆధారంగా చేసుకొనే కావ్య స్రష్టలు ప్రకృతిలో మానవ ప్రియత్వాన్ని, మానవ వ్యాపారాన్ని కూడా అనుభవంలోనికి తెచ్చారు. జటిలమైన తాత్త్వికాంశాలను సులభ బోధ

చేయడానికి లౌకికమైన ప్రాకృతికాంశాలను కవితా వస్తువులుగా స్వీకరించడం పరిపాటి. ఆళ్వారులు, అన్నమయ్య సమకాలీన సమాజంలోని సామాన్య ప్రజలను ఉద్దేశించి సామాన్యంగా సమాజంలో కన్పించే అంశాలతో సృజన చేశారు. వారి ప్రతి సృజన లౌకికంతో ప్రారంభమై అలౌకికంతో అంతమవుతుంది.

జానపదుల శృంగారం, ఆచారవ్యవహారాలు, హావభావ విన్యాసాలు, బలాలు, బలహీనతలు, మూఢనమ్మకాలు వీరి రచనలలో కన్పిస్తాయి. నూటికి నూరు శాతం ప్రజా సంస్కారాన్ని, సంక్షేమాన్ని ఆశించడంవల్ల ప్రత్యక్షరమూ వాస్తవీకరణనో, ఉపదేశాన్నో వ్యక్తం చేస్తున్నాయి.

ప్రజల నోళ్లలో నానే జాతీయాలు, సామెతలు, పలుకుబళ్ళు ఇలాంటి ఆశయాలున్న రచనలకు అక్కరకొస్తాయి. సాహిత్యం పరిమళించేదీ, సంగీతం వెల్లివిరిసేదీ, సదాశయం దారి చూపేదీ అయిన ఏ రచన అయినా జనులకు ఆమోదయోగ్యమవుతుంది. తమిళదేశంలోని వివిధ ఆలయాలలో, ఉత్సవాలలో ఆళ్వారుల సంకీర్తనలను ఆలపించడం ఎలా అలవాటుగా మారిందో ఆంధ్రదేశంలో కూడా తిరుమల వంటి దివ్యక్షేత్రాలలో అన్నమాచార్యుల సంకీర్తనలు సముచిత స్థానంలో ఆదరింపబడుతున్నాయి. ఆంధ్ర దేశమంతటా సంకీర్తన యజ్ఞాలు, సప్తాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ప్రజలకోసం ప్రజల భాషలో, ప్రజాంశాలను ప్రస్ఫుటిస్తూ అలౌకికతత్త్వాన్ని అందరికీ పంచాలనే ఆశయం ఉన్నతమైనదిగా అందరూ భావించబట్టే అన్నమయ్యను కూడా దైవాంశ సంభూతునిగానే ప్రజలు భావిస్తున్నారు. ఈ స్థానం ఆళ్వారులకు వారి వారి రచనల ద్వారా ఎప్పుడో లభించింది.

తమిళభాషలో సంగీతసాహిత్యాల సమ్మేళనంగా రచనలు చేయడం మొట్టమొదటినుండీ ఉంది. తెలుగు భాషలో కూడా ఈ రకమైన రచనలు అన్నమయ్యకు ముందు ఉన్నా సంకీర్తనలకు కావ్యగౌరవాన్ని తెచ్చి పెట్టింది అన్నమయ్యే. ఈ గౌరవ ప్రాప్తికై అన్నమయ్య తన ప్రతిభా పాండిత్యాలను వెచ్చించాడు. జీవితాంతమూ ఆ రచనలకై అహర్నిశలూ శ్రమించాడు. సాంప్రదాయ సాహిత్యంలో ఉంటే అన్ని విధాలయిన మార్గ పద్ధతుల్నీ అవలంబిస్తూనే దేశి కవిత్వానికి పెద్దపీట వేశాడు. పాల్కురికి సోమనాథునితో ప్రారంభమైన దేశికవితా పట్టాభిషేకం అన్నమయ్య చేతుల్లోనే మహోజ్వలంగా రాణించింది. సంప్రదాయ వాదులెవ్వరూ అంతగా ప్రాధాన్యమివ్వని లొల్లాయి పాటలన్నింటికీ కావ్యగౌరవాన్ని కల్గించిన ఘనత అన్నమాచార్యులదే.

దేశి కవిత్వంలో ఎంతో ప్రాధాన్యాన్ని, విశిష్టతను సంతరించుకొన్న సువ్విపాటలు, మేలుకొలుపులు, మంగళారతులు, అల్లోనేరెళ్ళు, జాజరలు, గొబ్బి పాటలు తుమ్మెద, సోది, తందానలు, ఏలలు, కోలాటం పాటలు, చందమామ పాటలు, శోభనాలు, కూగూగులు, హారతి పాటలు, నివాళి పదాలు, ధవళపదాలు, ఊయలపదాలు, లాలిపాటలు,

జోలపాటలు, తాత్త్వికాలు, చాఁగుబళాలు, చిలకపాటలు, సాసముఖాలు వీటన్నింటినీ గుదిగుచ్చి ఆంధ్రభారతి కంఠాన్ని అలంకరించిన సరస్వతీ పుత్రుడు తాళ్ళపాక అన్నమయ్య.

ఆళ్వారులు కూడా దేశిసాహిత్య ప్రాధాన్యంతోనే గానయోగ్యమైన పాశురాలను రచించారు. ద్రవిడ వేదంలో పరాంకుశయోగి, ద్వాదశాళ్వార్లు ద్రావిడాగమస్ఫోరకమైన కీర్తి వహించారు. తెలుగు భాషలోనూ తాళ్ళపాక అన్నమయ్య, పెదతిరుమలాచార్యులు ద్రవిడ వేద సారాన్ని తెలుగు ప్రజలకు అందించి ఆంధ్ర వేదాంత కర్తలై వెలుగొందారు.

పంచమాగమ సార్వభౌములు, పంచమాగమ చక్రవర్తులనే బిరుదులు వీరికి రావడానికి కారణం ఇదే.


ఆళ్వారులకు, అన్నమాచార్యులకు ఉన్న సాదృశ్యాలను విశ్లేషించడం అత్యంత కష్టతరమైనది. ప్రధానంగానూ, స్థూలంగానూ పరిశీలిస్తే తాత్త్వికంగానూ ధర్మప్రాధాన్యంగానూ కవితాభివ్యక్తి, సామాజికబాధ్యత, లోకోద్ధరణాశయం అనే అమ్ములపొదిలో ఇమిడిపోయే బ్రహ్మాస్త్రాల వంటి వారే ఆళ్వార్లు, అన్నమయ్య.

పుణ్యస్థలాల ప్రశస్తులను పెంచే విధంగా కీర్తించడం, దివ్య దేశాలలో కొలువై ఉన్న అర్చామూర్తుల మహిమాన్విత విశేషాలను ప్రజలకు తెలియజెప్పడం. నిఃస్వార్థంగా లోక సంక్షేమం కోసం రచనలు చేపట్టడం, వేదాంతాన్ని సామాన్యులకు అందించడం, సామాన్య జీవితం

నుండి అసామాన్య ఫలితాలను ఎలా సాధించవచ్చో ఆచరించి చూపడం వీరు చేసిన పని. దీనికోసం కవిత్వాన్ని సాధనంగా చేసుకొన్నారు. ఏ మార్గంలో చెప్పినా అది లోకంలో చిరకాలం నిలిచి ఉండవు. లోకంలో ఎన్ని నాశనం చెందినా ఖిలం కాకుండా నిలచేది కృతి. అందుకే రచనను మించిన సామాజిక సంస్కరణాయుధం మరొకటి లేదు. అందుకే వీరు ఈ ఆయుధాన్ని చేపట్టారు.

ఆళ్వారులకు, అన్నమాచార్యులకు ఇంతటి సామ్యం ఉండడం కేవలం యాదృచ్ఛికమని చెప్పడానికి వీలులేదు. అన్నమయ్య ఆళ్వారులచే ప్రభావితుడయ్యాడు. అతి ప్రాచీన కాలంలోనే ఆళ్వారులు సాగించిన హితబోధ, భక్తి, అన్నమయ్యను ముగ్ధుణ్ణి చేసింది. వారి మార్గంలో రెట్టించిన ఉత్సాహంతో నడిచేలా చేసింది.

ఆళ్వారుల ఊతం అందుకొన్న తాళ్ళపాక అన్నమాచార్యులు తన సంకల్పాన్ని, కృషిని, దీక్షని, భక్తి, ప్రచారాన్ని తన కాలం నాటి సామాజిక అవసరాలకు, భావి ఆలోచనలకు అనుగుణంగా పెంచుకున్నాడు. ఈ లక్షణాలే అన్నమయ్యను ఆళ్వారుల మార్గంలో నడిపించడమే కాకుండా వారిని మించేటంతటి సృజన విస్తృత ప్రచారాశయం చేసేందుకు పురికొల్పాయి. దివ్యాత్మ స్వరూపునిగా ప్రజలు నోరారా కీర్తించేంతటి శాశ్వతమైన యశస్సుతో అలరాలేలా దీవించాయి.



# డా॥ యస్. చిన్నరెడ్డయ్య

| | | |
|---|---|---|
| జననం | : | 01-06-1963 |
| స్వస్థలం | : | కడప. |
| తల్లిదండ్రులు | : | యస్. సుబ్బలక్ష్మమ్మ - యస్. పెంచలయ్య |
| విద్యార్హతలు | : | ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి. |
| పరిశోధన | : | ఎం.ఫిల్. - 2<br>వేమన-సర్వజ్ఞుల సాంఘిక సంస్కరణలు<br>అనే అంశంపై యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ |
| సెమినార్లు | : | 22 |
| అంతర్జాతీయ సెమినార్లు | : | 3 |
| పరిశోధన పత్రాలు | : | 10 జాతీయ, 6 అంతర్జాతీయ పత్రికలు |
| వర్క్‌షాప్స్ | : | 4 |
| ఉద్యోగము | : | అధ్యాపకులు, తెలుగు విభాగాధిపతి,<br>ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం. |
| ప్రస్తుత విలాసం | : | 11-200, తారకరామనగర్,<br>తిరుపతి - 517 502 |